అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

మంగళవారం 6-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 36 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

కేరళ ప్రభుత్వంపై కేంద్రం నిరంకుశ ధోరణి

8న హైదరాబాద్‌లో నిరసన

- హాజరు కానున్న బివి రాఘవులు : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. కేంద్రం వివక్షాపూరిత విధానాలు, రాష్ట్రాల హక్కులపై దాడులకు వ్యతిరేకంగా ఈనెల ఎనిమిదిన రాష్ట్రకేంద్రాల్లో సంఘీభావంగా నిరసన కార్యక్రమం నిర్వహించాలని పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందని గుర్తు చేసింది. అందులో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద గురువారం ఉదయం 10.30 గంటలకు జరిగే ధర్నా కార్యక్రమంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని ...13లో

ఇండియాను గెలిపిస్తే దేశవ్యాప్తంగా కుల గణన



- రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగింపు : 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో రాహుల్ హామీ
- జార్ఖండ్‌లో నాలుగో రోజు పర్యటన

రాంచీ : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల కూటమి 'ఇండియా'ను గెలిపిస్తే దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. అలాగే, రిజర్వేషన్లపై 50 శాతం ...13లో

ప్రతిపక్షాలపై విమర్శలకే ప్రాధాన్యత

- ఈడీ, సీబీఐలతో రాజకీయ కక్ష సాధింపులపై నోరు మెదపని ప్రధాని
- రాష్ట్రపతి ప్రసంగంపై లోక్‌సభను వాడుకున్న మోడీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానం ఇవ్వాల్సిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. రాజకీయ ప్రసంగమే చేశారు. ఈ ఐదేండ్లలో తానేం చేశానో చెప్పడం కంటే, ప్రతిపక్షాలపై ...3లో

అంతా ఒట్టిదే..!

నినాదంగానే 'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్'

- సమన్యాయం అందని ద్రాక్షే..!
- దేశంలో ప్రబలుతున్న విద్వేష రాజకీయం
- భయం గుప్పెట్లో మైనారిటీలు

నైతికంగా పతనమైన, గౌరవాన్ని కోల్పోయిన ఈ ప్రభుత్వం తాజాగా రామ మందిరాన్ని నిర్మించి గొప్పలు చెప్పుకుంటోంది. శ్రీరాముడు ఏం బోధించాడన్న విషయాన్ని మాత్రం మరచిపోతోంది. న్యాయం, సమానత్వం, అహింస ఆధారంగానే రామరాజ్యం సాగింది. కానీ నేడు మోడీ రాజ్యం ఎలా వుంది? వీరు రామ మందిరాన్ని నిర్మించింది ఆయన చూపిన మార్గంలో పయనించడానికి కాదు... ప్రజలను మరింతగా విభజించడానికి. తన దృష్టిలో అందరూ సమానులేనని చెప్పుకునే మోడీ ఏలుబడిలో ముస్లింలు, క్రైస్తవుల విశ్వాసాలను అవమానిస్తూ మెజారిటీ ప్రజల ప్రాపకం కోసం వారి ప్రార్థనా స్థలాలను కూల్చేయడం ఎంత వరకూ సమర్థనీయం? తాజాగా జ్ఞానవాపి మసీదులో పూజలు మొదలయ్యాయి. మనం అంతం లేని నిశీధిలోకి జారిపోతున్నాం.




న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. దేశ చరిత్రలో ఇవి ఎంతో కీలకమైన ఎన్నికలు. భారతదేశం ప్రజాస్వామ్య వ్యవస్థగా కొనసాగాలా లేక హిందూ రాష్ట్రంగా ఆవిర్భవించాలా అనేది తేల్చే జీవన్మరణ పోరాటం. ప్రధాని నరేంద్ర మోడీ అందిపుచ్చుకున్న 'సబ్‌కా సాత్... సబ్‌కా వికాస్' నినాదం ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. దేశంలోని మైనారిటీలు భయం గుప్పిట్లో కాలం గడుపుతూ జీవనాన్ని సాగిస్తున్నారు. తన ప్రభుత్వం విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఏ మతాన్ని అనుమతించబోదని మోడీ 2015లో ప్రకటించారు. హిందూ ముస్లింలు కలిసికట్టుగా కృషి చేసి దేశం నుండి పేదరికాన్ని పాలద్రోలాలని కూడా ఆయన హితవు పలికారు. కొద్ది నెలల క్రితం బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి మోడీ ప్రసంగిస్తూ సమాజంలోని ప్రతి వర్గానికీ చేరువ కావాలని సూచించారు. కానీ ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది ఏమిటి?

2022లో కాశ్మీర్ ఫైల్స్ చిత్రాన్ని ప్రధాని బహిరంగంగానే సమర్థించారు. 1990లో లోయ నుండి తరలిపోయిన ఓ కాశ్మీర్ పండిట్ కథ ఇది. ఈ చిత్రంలో ముస్లింలపై విషం చిమ్మారు. ముస్లింలందరినీ ఉగ్రవాదులుగా చిత్రీకరించారు. హిందువులపై ప్రశంసలు కురిపించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నప్పటికీ ఈ చిత్రాన్ని మోడీ కొనియాడారు. అంతేకాదు...దానికి ఓ ప్రచారకుడిగా కూడా వ్యవహరించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా దేశంలో హిందూ జాతీయతావాదం ప్రబలిపోతోంది. దీనికి అనేక రూపాలు...దాడి చేసి కొట్టడం, ఘర్ వాపసీ, రోమియో వ్యతిరేక బృందాలు, గో సంరక్షణ, బుల్డోజర్ భయం, మసీదులపై దాడులు...ఇవన్నీ హిందూ జాతీయతావాదం, మతోన్మాదం ప్రబలుతున్నాయనడానికి ఉదాహరణలే.

కోవిడ్ మహమ్మారికి ప్రజలు పెద్ద ఎత్తున బలై ప్రాణాలు కోల్పోతుంటే ఈ ప్రభుత్వం కార్పొరేట్ మీడియా సాయంతో తబ్లీకీ జమాత్‌పై ...13లో

ఇరవై కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి?

లోక్‌సభలో సీపీఐ(ఎం) ఎంపీ ఎ.ఎం ఆరీఫ్



నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగమంతా ఉత్తుత్తి వాదనలే తప్ప ఏమీ లేదని సీపీఐ(ఎం) లోక్‌సభ ఎంపీ ఎ.ఎం. ఆరీఫ్ విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఈ పదేండ్లలో కోటి ఉద్యోగాలు కూడా కల్పించలేదన్నారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపే తీర్మానంపై సోమవారం జరిగిన చర్చలో సీపీఐ(ఎం) తరపున ఎ.ఎం. ఆరీఫ్ మాట్లాడారు. ఈ తీర్మానం పట్ల తాను భిన్నాభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నానని అన్నారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించలేదనీ, ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. రామమందిర నిర్మాణం శతాబ్దాల ఆకాంక్షల నెరవేర్పు అంటూ ప్రసంగంలో పొందుపరిచిన అంశాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26న దేశ 'ప్రాణ ప్రతిష్ఠ' జరిగిందని నమ్ముతారు. లౌకిక దేశమైన భారత్‌ను పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ మాదిరి మత దేశంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. దేశ స్వాతంత్ర్యం కోసం వేలాది మంది ప్రాణ త్యాగం చేశారు. వారువ్వరూ ఇలాంటి మత రాజ్యాన్ని అనుమతించలేదు' అన్నారు. సామాన్య ప్రజల ఆకాంక్షలను తీర్చే విజన్ ఈ ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. బ్రిటిష్ వారు విభజించు పాలించు వలే, ప్రభుత్వం భాష ప్రాతిపదికన ...13లో

ముఖ్యమంత్రివన్నీ అబద్ధాలే..

ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగించి నిందలు మాపై సరికాదు

- పోతిరెడ్డిపాడుపై కొట్లాడింది బీఆర్ఎస్ పార్టీనే
- తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు : మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పదేండ్లలో రాష్ట్రానికి చెందిన ఏ ప్రాజెక్ట్‌నూ కేంద్రానికి కేసీఆర్ అప్పగించలేదని అన్నారు. అధికారం చేపట్టిన రెండు నెలలకే సీఎం రెండు ప్రాజెక్టులను అప్పగించి తప్పులను తమపైకి నెడుతున్నారని ఆరోపించారు. జనవరి 17న ఢిల్లీలో జరిగిన మీటింగ్‌లో ప్రాజెక్టుల అప్పగింతకు ఆమోదం తెలిపారన్నారు. మినిట్స్‌లో అది స్పష్టంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వానికి ఉలుకూ పలుకూ లేదని విమర్శించారు. 19న తాము ప్రశ్నించడంతో ఒప్పుకోలేదని లేఖ రాశారని చెప్పారు. ఫిబ్రవరి ఒకటో తేదీన రెండో కేఆర్ఎంబీ మీటింగ్ జరిగిందనీ, ఆ మీటింగులోనూ ప్రాజెక్టులు ఇవ్వడానికి ఒప్పుకున్నట్టు మినిట్స్‌లో ఉందని గుర్తు చేశారు. పవర్ హౌజ్‌ల అప్పగింతకు మాత్రమే అభ్యంతరం చెప్పారనీ, నీటి ప్రాజెక్టులపై మాత్రం అభ్యంతరం చెప్పలేదని విమర్శించారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్టు రెండు రాష్ట్రాల ఈఎన్సీలు చెప్పారన్నారు. "నెల రోజుల్లో అప్పగిస్తామని ప్రభుత్వం చెప్పింది. సీఆర్‌పీఎఫ్ పర్మిషన్‌తో ప్రాజెక్టుల వద్దకు ఇంజినీర్లు వెళ్లాలని అందులో ఉంది. రెండు రాష్ట్రాలు నిర్వహణ చేయాలని మినిట్స్‌లో ఉంది" అని హరీష్ రావు తెలిపారు. 16, 17 మీటింగ్‌లలో అప్పగిస్తామని మేమెక్కడా చెప్పక పోయినా కేసీఆర్ స్వయంగా సంతకాలు చేశారని అబద్దాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్యాలను ప్రజలు, మేధావులు గుర్తించాలని కోరారు. పోతిరెడ్డి పాడు ...3లో

బలపరీక్ష నెగ్గిన చంపయ్ సోరెన్

బాసటగా నిలిచిన కాంగ్రెస్, సీపీఐ (ఎంఎల్)



రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత చంపయ్ సోరెన్ సోమవారం శాసనసభ విశ్వాసాన్ని పొందారు. సోరెన్ ప్రతిపాదించిన విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 47 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయగా 29 మంది వ్యతిరేకించారు. జార్ఖండ్ శాసనసభలో మొత్తం 81 మంది ఎమ్మెల్యేలు ఉండగా 77 మంది సభకు హాజరయ్యారు. వారిలో ఓ స్వతంత్ర ఎమ్మెల్యే ఓటింగ్ సమయంలో గైర్హాజరు అయ్యారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్‌ను గత నెల 31న ఈడీ అధికారులు అరెస్ట్ చేయడంతో చంపయ్ సోరెన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

పార్టీ ఫిరాయింపులు జరుగుతాయేమోనన్న అనుమానంతో జేఎంఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో మకాం వేశారు. బలపరీక్ష ...13లో

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం

రెండు గ్యారంటీలు అమలు చేస్తున్నాం

- మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తాం : సోనియా గాంధీకి తెలిపిన రేవంత్ రెడ్డి
- తెలంగాణ నుంచి పోటీ చేయాలని సీఎం, డిప్యూటీ సీఎం విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని సోనియా గాంధీకి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరుతూ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ(పీఏసీ) తీర్మానం చేసి పంపిన విషయాన్ని సోనియా గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఇచ్చిన తల్లిగా రాష్ట్ర ప్రజలు గుర్తిస్తున్నందున రాష్ట్రం నుంచి పోటీ చేయాలని కోరారు. స్పందించిన సోనియా గాంధీ సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. జార్ఖండ్ పర్యటనకు వెళ్లన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం ఢిల్లీలోని జన్ పథ్ 10లో సోనియా గాంధీని ఆమె నివాసంలో సీఎం కలిశారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, ప్రసార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలను సోనియా దృష్టికి తీసుకెళ్ళారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచడాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. బస్సుల్లో ఇప్పటికే 14 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ తాజా భేటిలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కే గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్ అమలు చేయనున్నామని సోనియా దృష్టికి తీసుకెళ్లారు. బీసీ ...13లో

టీజీగా మార్పు

- తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకే : సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 13లో

హరీషే అబద్ధాలు చెబుతున్నారు



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతి విమర్శ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే విషయంలో మాజీ ఇరిగేషన్ మినిస్టర్ హరీష్‌రావు అబద్ధాలు చెబుతున్నారని రాష్ట్ర సాగునీటి పారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కన్నా తెలంగాణ ఏర్పడ్డాకే కృష్ణానీటి వాటాకు సంబంధించి తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ పరిపాలనా అసమర్థత వల్లనే కృష్ణాజలాల్లో రైతులకు వాటా దక్కలేదన్నారు.

నీటి వాటాల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతివిమర్శలు చేసిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ స్పందించారు. సోమవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఏ ప్రతిపదిక తీసుకున్నా బీఆర్ఎస్ సర్కారు, కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు తప్పేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆన్‌రికార్డ్స్‌లో కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించడానికి ఒప్పుకుని నిర్వహణ కింద రూ. 200 కోట్లు కేటాయిస్తున్నట్టుగా పేర్కొన్నారని గుర్తుచేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ప్రాజెక్ట్ ఇవ్వడానికి ఈ 56 రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా ఒప్పుకోలేదని స్పష్టం చేశారు.

ఐదు, మే 2020న ఏపీ సర్కారు జీవో నెంబర్ 203 ద్వారా రోజుకు 8 టీఎంసీల నీటిని తీసుకుపోయేలా సహకరించారని అన్నారు. అపెక్స్ కౌన్సిల్‌కు ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులను పిలిస్తే కేసీఆర్ వెళ్లలేదని వివరించారు. ఏపీ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కట్టుకోవటానికి అగ్రిమెంట్ మీద సంతకాలు పెట్టడానికే ఆ మీటింగ్‌కు కేసీఆర్ డుమ్మా కొట్టారని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ఒక్క ప్రాజెక్ట్ కూడా 10 ఏండ్లల్లో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.

తెలంగాణకు నీటి కేటాయింపుల్లో మోసం చేశారన్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్ట్‌లు అప్పగించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. గ్రావిటీ ద్వారా రావలసిన ఎనిమిది టీఎంసీల కృష్ణా జలాల నీటిని కేసీఆర్, జగన్ ఏకాంతంగా మాట్లాడుకుని ఏపీకి తరలించుకుపోవడానికి కుట్ర చేశారని ఆరోపించారు. మేము ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రాజెక్ట్‌లు ఇవ్వడానికి ఒప్పుకునేది లేదని అన్నారు. కేంద్ర మంత్రి ...13లో

ప్రాజెక్టుల తనిఖీకి ఎన్‌డీఎస్‌ఏ రాక

- నేడు శ్రీశైలానికి,16న సాగర్‌కు
- ప్రోటోకాల్ ప్రకారమేనంటున్న అధికారులు

వివరాలు 13లో

మేడారం జాతరకు 6 వేల ప్రత్యేక బస్సులు

31లక్షల మంది తరలివస్తారని అంచనా : మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క



నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు ఆరు వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, 31లక్షల మంది సందర్శకులు తరలివస్తారని అంచనా వేసినట్టు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తెలిపారు. సోమవారం టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను టీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. తాడ్వాయిలోని టికెట్ ఇష్యూయింగ్ కౌంటర్లు, కామారంలో మూడు బస్సుల పార్కింగ్ పాయింట్లు, మేడారంలో 55 ఎకరాల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండ్, బేస్ క్యాంప్, 48 క్యూ రెయిలింగ్స్‌ను పరిశీలించారు. అనంతరం మేడారంలోని హరిత హోటల్‌లో ...13లో

రిజర్వేషన్ల పేరుతో బీజేపీ మోసం

- భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం మహిళలను మోసం చేస్తున్నదని భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యాలయంలో సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నీ రాజా మాట్లాడుతూ ప్రధాని మోడీకి మహిళలపై గౌరవం ఉంటె రిజర్వేషన్లను 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాటి సీపీఐ పార్లమెంట్ సభ్యురాలు గీతా ముఖర్జీ అనేక సార్లు పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ అనుకూల ఎంపీలు అడ్డుకున్నారనీ, నాటి నుంచి నేటివరకు మహిళలను మోసం చేయడం ఆ నేతల రక్తంలోనే ఉందని విమర్శించారు. మణిపూర్‌లో ఘోర మానవ విషాదం చోటు చేసుకోవడానికి కారణం కేంద్ర, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలేనని తెలిపారు. కొన్ని నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసను, హత్యలను, లైంగిక దాడులను అరికట్టటంలో, శాంతిని పునరుద్ధరించడంలో మణిపూర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. మోడీ పాలనలో నవ భారతంలో మహిళలకు ఎలాంటి మార్పు వచ్చిందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. భారత ప్రపంచ ఛాంపియన్‌లైన మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడటం ఇందుకు నిదర్శనమని తెలిపారు. సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షులు పి దుర్గా భవాని, శ్రామిక మహిళా ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ పి. ప్రేమ్ పావని, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సదాలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎస్. ఛాయాదేవి, ముడుపు నళిని, బి. జంగమ్మ, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సహాయ కార్యదర్శి ఫైమీద తదితరులు పాల్గొన్నారు..

మోడీ హటావో - దేశ్‌కీ బచావో నినాదంతో ప్రచారం

- ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ పాలనంతా రాజ్యాంగ హక్కులను హరించడమేననీ, మోడీ హటావో - దేశ్‌కీ బచావో నినాదంతో దేశమంతటా ప్రచారం నిర్వహిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలై రామన్ మాట్లాడుతూ యువతరం దేశానికి ఇంధనం, ప్రగతికి రథచక్రం లాంటిదన్నారు. చరిత్రలో ఏ మార్పు సంభవించినా అది యువతవల్లే సాధ్యమని చెప్పారు. పాలకుల విధానాల వల్ల యువశక్తి నిర్వీర్యమౌతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 16 శాతం నిరుద్యోగం పెరిగిందని చెప్పారు. చదువుకు తగ్గ ఉద్యోగాల్లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలమయిందన్నారు.

మోడీ చెప్పిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలెందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. పైగా లక్షలాది పరిశ్రమలు మూతపడి కోట్లాదిమంది ప్రజలు ఉద్యోగాలు పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఇండియా, 'బేటీ బచావో- బేటీ పడావో', అచ్చేస్‌లు శుష్క వాగ్దానాలుగా మిగిలిపోయాయని విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్లు వెంకటేశ్వర్లు,రామకృష్ణ, మహేందర్, శ్రీమాన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం : బూర

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ చేస్తున్నాయని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పదేండ్ల కాలంలో నల్లగొండ జిల్లాకు ఉపయోగపడే ఎస్ఎల్‌బీసీకి ఐదారొందల కోట్ల రూపాయలు కేటాయించడానికి కేసీఆర్‌కు చేతులు రాలేదని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సమయంలో యూపీఏ-2 ప్రభుత్వం ఎన్నో లింకులను పెట్టిందన్నారు. బీజేపీ మాత్రం లింకుల్లేకుండా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే శూన్యమేననీ, గల్లీలో లేని పార్టీ ఢిల్లీకి పోయి ఏం చేస్తుందని ప్రశ్నించారు. బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించబోతున్నదని చెప్పారు. మోడీ ప్రభుత్వం రూ.13 వేల కోట్ల బడ్జెట్‌తో విశ్వకర్మ యోజన పథకాన్ని తీసుకొచ్చిందనీ, ఎన్నికల కారణంగా కొంత ఆలస్యమైనా ఇప్పటికే అందులో 1.20 లక్షల మంది చేరారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వెరిఫికేషన్లు చేయకుండా ఆలస్యం చేస్తున్నదని విమర్శించారు. వాటిని పంచాయతీ, మున్సిపల్ అధికారులతో త్వరగా పూర్తిచేయించాలని కోరారు.

ప్రపంచ శాంతి ఉద్యమంలో కలిసిరండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ శాంతి కోసం పార్టీలకతీతంగా విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులతో పాటు ప్రతి ఒక్కరూ శాంతి ఉద్యమం బలోపేతం కోసం కలిసి రావాలని అఖిల భారత శాంతి సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ డి. సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రష్యా ఉక్రెయిన్, పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధం వల్ల ప్రపంచంలో అస్థిరత వాతావరణం నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి కాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ తమ ఉద్యమానికి మద్దతు పలకాని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11న తమ సంస్థ జాతీయ సమావేశాలు ఢిల్లీలో జరగనున్నాయని, ఆ సమావేశాల్లో శాంతి ఉద్యమ బలోపేతం, యుద్ధాలకు వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. డాక్టర్ సమత రోషిని రచించిన "స్వాతంత్ర సమరయోధులు పడాల శ్యాంసుందర్ రావు" పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీఎల్, బొమ్మగాని ప్రభాకర్, రఘుపాల్, జి. నాగేశ్వరరావు, గురు బచ్చన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నాసా డిజైన్ కాంపిటేషన్ చాంపియన్‌గా శ్రీచైత్యన్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాసాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్) 12 నుంచి 18 ఏండ్ల విద్యార్థులకు నిర్వహించిన అగ్రికల్చర్ మాడ్యూల్ డిజైన్ పోటీల్లో శ్రీచైతన్య ప్రపంచ చాంపి యన్‌గా నిలిచినట్టు ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పోటీల్లో మొత్తం 47 ప్రాజెక్టులు రాగా 31 ప్రాజెక్టులు ఇండియా నుంచి ఎంపికైనట్టు తెలిపారు. కాగా ఇందులో 28 శ్రీచైతన్య విద్యార్థులవే ఎంపికైనట్టు వివరిం చారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలుకుతూ కాన్సెప్ట్యువల్ టీచింగ్ మెథడాలజీ, యాక్టివిటీస్, ప్రాక్టికల్ ఓరియంటెడ్ టీచింగ్ ద్వారా మంచి ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు.

నా అరెస్టులో గవర్నర్ ప్రమేయం

జార్ఖండ్ శాసనసభలో హేమంత్ సోరెన్ ఆరోపణ...జనవరి 31 చీకటి రోజని వ్యాఖ్య

- ఆరోపణలు నిరూపించాలని ఈడీకి సవాల్
- అడవి బిడ్డలంటే చులకన ఎందుకని నిలదీత
- తల వంచడం తనకు తెలీదని వ్యాఖ్య
- సుదీర్ఘ పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపు



రాంచీ : జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్ బీజేపీ పైన, రాష్ట్ర గవర్నర్ పైన విరుచుకుపడ్డారు. నూతన ముఖ్యమంత్రి చంపయి సోరెన్ సోమవారం ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానంపై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా హేమంత్ ప్రసంగించారు. కోర్టు అనుమతితో విశ్వాస పరీక్షలో ఓటేసేందుకు ఆయన సభకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ గత నెల 31న జరిగిన తన అరెస్టు వెనుక గవర్నర్ ప్రమేయం ఉన్నదని ఆరోపించారు. 'జనవరి 31వ తేదీ రాత్రి దేశ చరిత్రలోనే తొలిసారి ఓ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేశారు. ఈ ఉదంతం వెనుక రాజ్‌భవన్ ప్రమేయం ఉన్నదని నేను నమ్ముతున్నాను. ఆ రోజు దేశ చరిత్రలో చీకటి రోజు' అని అన్నారు.

భూ కుంభకోణం కేసులో ఈడీ తనపై మోపిన ఆరోపణలన్నింటినీ హేమంత్ తోసిపుచ్చారు. తనపై మోపిన ఆరోపణల్లో ఏ ఒక్క దానినైనా ఈడీ నిరూపిస్తే రాజకీయ జీవితానికి స్వస్తి చెబుతానని అన్నారు. 'హేమంత్ సోరెన్ పేరిట భూమి ఎక్కడుంది?' అని ప్రశ్నించారు. ఆరోపణలు నిరూపించాల్సిందిగా ఈడీని సవాలు చేశారు. 'నేను కన్నీరు కార్చను. సమయం వచ్చే వరకూ దానిని అలాగే దాచుకుంటాను. ఆదివాసీల కష్టాలు, కన్నీరు మీకు పట్టదు. జార్ఖండ్‌లో ఓ గిరిజన ముఖ్యమంత్రి ఐదు సంవత్సరాల పూర్తి కాలం పదవిలో కొనసాగడం బీజేపీకి ఇష్టం లేదు. తన హయాంలో అందుకు అనుమతించదు' అని మండిపడ్డారు.

రాష్ట్రంలోని ఆదివాసీలు, దళితులను బీజేపీ గౌరవించదని హేమంత్ ఆరోపించారు. హుందాగా జీవించేందుకు వారికి ఉన్న హక్కును నిరాకరిస్తోందని అన్నారు. 'వీరందరూ అడవి నుండే వచ్చారు...అడవిలోనే ఉండాలి అని చెప్పేందుకు బీజేపీ నేతలు సిగ్గు పడరు. మేము అడవి నుండే వచ్చి ఈ స్థాయికి చేరుకున్నాము. అయితే వారు మమ్మల్ని అంటరానివారుగా చూస్తారు. ఈ అభిప్రాయాన్ని రూపుమాపేందుకు నేను ప్రయత్నిస్తున్నాను. ఈ సమూహాలను అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తూనే ఉంటుంది' అని చెప్పారు.

భీరువుగా పారిపోయే ప్రశ్నే లేదని హేమంత్ స్పష్టం చేశారు. తనను జైలులో పెడితే విజయం సాధించగలనని బీజేపీ అనుకున్నదని, కానీ ఇది జార్ఖండ్ అని అన్నారు. ఈ రాష్ట్రంలోని ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వారు తమ సమాజాల కోసం జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న వారు గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాల వారిని అణచివేసేందుకు ప్రయత్నించారని అంటూ పూర్తి కాలం పదవిలో ఉండనివ్వబోరన్న విషయం తనకు ముందే తెలుసునని చెప్పారు. తన వంటి వారు ముఖ్యమంత్రులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు కావడం వారు చూడలేరని వ్యాఖ్యానించారు. తల వంచి నడవడం తనకు తెలియదని అన్నారు. 'నేను అధికారంలోకి వచ్చినప్పటి నుండి నన్ను హేళన చేస్తూనే ఉన్నారు. ఎద్దేవా చేస్తూనే ఉన్నారు. నన్ను చూసి నవ్వుతూనే ఉన్నారు. నేను విమానంలో ప్రయాణించినా, హోటల్‌లో ఉన్నా, కారు నడుపుతున్నా ఇదే తీరు' అని చెప్పారు.

ఇది దీర్ఘకాలిక పోరాటమని హేమంత్ తెలిపారు. 'రామరాజ్యం వచ్చేసిందని జనవరి 22న చెప్పారు. అందులో తొలి అడుగు బీహార్. రెండో అడుగు జార్ఖండ్. జరిగిన దానికి నేనేమీ చింతించడం లేదు. నేను ఎన్నికల్లో పోటీ చేయలేనని ఇప్పుడు వారు చెప్పుకోవచ్చు. అయితే జేఎంఎం ఎప్పుడూ రాష్ట్ర గౌరవం, హక్కుల కోసం పోరాడుతూనే ఉంటుంది. ఎన్నికల్లో అయినా, న్యాయస్థానంలో అయినా, లేక ఇతర రూపంలో అయినా పోరాటం మాత్రం ఆగదు. ఇప్పుడూ అంతే. వెనకడుగు వేసే ప్రశ్నే లేదు' అని స్పష్టం చేశారు. మీడియాతో మాట్లాడకూడదని కోర్టు, శాసనసభలో మాట్లాడకూడదని ఈడీ చెప్పిందని అంటూ ఇప్పుడు మనం ఏ పరిస్థితిలో ఉన్నామని ప్రశ్నించారు. దీర్ఘకాల పోరాటానికి సిద్ధం కావాలని హేమంత్ ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ఇప్పుడు ఆ పని చేయకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించబోవని హెచ్చరించారు.

హేమంత్ పిటిషన్‌పై సమాధానం ఇవ్వండి

- ఈడీని ఆదేశించిన జార్ఖండ్ హైకోర్టు
- తదుపరి విచారణ 12కు వాయిదా



రాంచీ : తన అరెస్టును సవాలు చేస్తూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 9వ తేదీ నాటికి సమాధానం ఇవ్వాలని జార్ఖండ్ హైకోర్టు సోమవారం ఈడీని ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను 12వ తేదీకి వాయిదా వేసింది. తనను ఈడీ అధికారులు వేధిస్తున్నారని, వారిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ హేమంత్ అందజేసిన ఫిర్యాదును పురస్కరించుకొని ఆ అధికారులపై జార్ఖండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే దీనిని వ్యతిరేకిస్తూ ఈడీ సోమవారం నాడే జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించింది. భూ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో హేమంత్‌ను ఐదు రోజుల ఈడీ కస్టడీకి పంపుతూ ఈ నెల 2న పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. సోరెన్‌ను ఏడు గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించిన అనంతరం ఈడీ అధికారులు ఆయన్ని గత నెల 31న అరెస్ట్ చేశారు. తన అరెస్టును సవాలు చేస్తూ హేమంత్ శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే దీనిని విచారించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. సంబంధిత హైకోర్టులోనే పిటిషన్ వేయాలని సూచించింది.

సమాచార శాఖ కమిషనర్‌గా హనుమంతరావు బాధ్యతల స్వీకరణ

- ప్రభుత్వ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సమాచార, పౌరసంబంధాల శాఖ నూతన ప్రత్యేక కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎం హనుమంతరావు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లోని సమాచార్ భవన్‌కు వచ్చారు. పాత స్పెషల్ కమిషనర్ అశోక్‌రెడ్డి హార్టికల్చర్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కమిషనర్‌గా హనుమంతరావు నియమితులైన సంగతి తెలిసిందే. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కమిషనర్ ఆ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాఖాపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా అట్టడుగు స్థాయిలో ప్రచారం చేయడంలో సమాచార శాఖదే కీలక పాత్ర అని చెప్పారు. అధికారులు అందుకు అణుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. అలాగే సచివాలయంలో సమాచార శాఖ ఎక్స్‌అఫిసియో ప్రత్యేక కార్యదర్శిగా కూడా ఆయన బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్‌బాబు, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లే, జాయింట్ డైరెక్టర్లు జగన్, వెంకట్‌రమణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, సీఐఈ రాధాకిష్ణ, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల హక్కులను కాపాడుకుందాం

- 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎల్ఐసీని రక్షించుకోవడం కోసం, హక్కుల పరిరక్షణ కోసం ఎల్ఐసీ ఏజెంట్లు ఐక్యంగా పోరాటాల్లోకి రావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కేఎమ్ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను, గ్రామీణ భారత బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎల్ఐసీ ఏఓఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌వీఎస్ రెడ్డి అధ్యక్షతన ఎల్ఐసీ ఏజెంట్ల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ..

మోడీ సర్కారు ఆర్థిక విధానాలు, వ్యూహాత్మక అమ్మకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ చర్యలతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు బలహీనపడుతున్నాయన్నారు. ప్రభుత్వరంగాన్ని ఆధారం చేసుకొని విదేశీ, స్వదేశీ బహుళజాతి సంస్థలు లక్షల కోట్ల రూపాయల లాభాలను ఆర్జిస్తున్నాయనీ, భారతదేశ స్వావలంబనను బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడిచిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వరంగమంటే కేవలం ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల ప్రయోజనాలను మాత్రమే చూడటం పాక్షిక దృష్టేనని అన్నారు. దేశ మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు లభ్యమవుతున్న అంశాన్ని విశాల దృష్టితో చూడాలని కోరారు. ప్రభుత్వరంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని చెప్పారు. ఎల్ఐసీ ఏఓఐ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థల వల్ల కోట్లాది ప్రజల ప్రజా ధనానికి భద్రత లభిస్తున్నదనీ, వాటి ద్వారా సమాజంలో అణగారిన తరగతుల హక్కులను, సామాజిక న్యాయం కొంత మేరకు కాపాడుకోగలిగామని అన్నారు. దేశ ఆర్థిక సార్వభౌమత్వం, ప్రజల ఐక్యత కోసం శ్రమజీవులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బ్రాంచి స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎల్ఐసీ ఏజెంట్లను ప్రత్యక్షంగా కలిసి కరపత్ర ప్రచారంతో పాటు సదస్సులు, సమావేశాలు, సంతకాల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొనాలనీ, 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

ప్రతిపక్షాలపై విమర్శలకే ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలకే అధిక ప్రాధాన్యతనిచ్చారు. ఊకదంపుడు విమర్శలతో ప్రసంగమంతా సాగింది. ఈడీ, సీబీఐలతో రాజకీయ కక్ష సాధింపులపై నోరు మెదపని ప్రధాని మోడీ, ప్రతిపక్షాలపై నోరు పారేసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలపైనా చౌకబారు విమర్శలతో రెచ్చిపోయారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై నరేంద్ర మోడీ సోమవారం సమాధానమిచ్చారు. ప్రతిపక్షాలు ఎన్నికల్లో పోటీకి దూరంగా జరుగుతున్నాయనీ, పోటీ చేయాలనే సంకల్పమే లోపించిందని అన్నారు. చాలామంది లోక్‌సభకు బదులు రాజ్యసభకు వెళ్లాలని అనుకుంటున్నారని తాను విన్నాననీ, పరిస్థితిని అంచనా వేయడంతో వారు తమ మార్గాలను వెతుకుతున్నారని వ్యాఖ్యానించారు.

దేశంలో నాలుగు వ్యవస్థలు పటిష్టంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ప్రధాని అన్నారు. తమ ప్రభుత్వంపై పదే పదే ఆరోపణలు చేయడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయని, ఎన్నికల్లో ఓటమి కోసమే ప్రతిపక్షాలు తీవ్రంగా కష్టపడుతున్నాయని అన్నారు. ప్రతిపక్షాల దుస్థితికి కాంగ్రెస్సే కారణమని చెప్పారు. మైనారిటీలంటూ ఎంతకాలం విభజన రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. తోటి ప్రతిపక్షాలను కాంగ్రెస్ ఎదగనీయలేదని, కాంగ్రెస్ తీరు దేశానికి, ప్రజాస్వామ్యానికి నష్టమని అన్నారు.

ప్రాంతీయ జనాభా ఆధారంగా మైనారిటీ నిర్వచనం మారవచ్చని నొక్కి చెప్పిన ఆయన.. మత్స్యకారులు, జంతువుల కాపరులు, రైతులు, మహిళలు మైనారిటీలు కారా? అని ప్రశ్నించారు. విభజించు పాలించుని పక్కనపెట్టేసి.. అందరినీ కలుపుకుపోయే పాలనపై దృష్టి పెట్టాలని ప్రతిపక్షాలను కోరారు. విభజనల గురించి ఎంతకాలం ఆలోచిస్తారు? సమాజాన్ని విడదీస్తూ ఇంకెంతకాలం ఉంటారు? అని ప్రశ్నించారు.

ఎన్డీయే మూడోసారి అధికారంలోకి రాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయే తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అబ్ కీ బార్ మోడీ సర్కార్ అని ఖర్గే కూడా అంటున్నారని నవ్వుతూ చెప్పారు. బీజేపీకి 370కి పైగా సీట్లు వస్తాయనీ, ఎన్డీయేకు 400కు పైనే సీట్లు వస్తాయన్నారు. ప్రతిపక్షాలు ఈసారి కూడా ప్రతిపక్షంలోనే ఉంటారని అన్నారు. ప్రతిపక్షంలో ఉండటం కాంగ్రెస్ నేతలకు అలవాటైందని విమర్శించారు.

మీ వాళ్లే మీ ప్రభుత్వాన్ని కూల్చేస్తారు..?

- హామీలు అమలు చేయకపోతే ప్రజలే తేలుస్తారు
- ప్రాజెక్టును కాపాడుకోకపోతే మీరు దద్దమ్మలే..
- సాగర్ ప్రాజెక్టు అప్పగింతపై అబద్ధపు ప్రచారం
- రేవంత్ భాష మార్చుకో :మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేమెందుకు కూలుస్తాం.. మాకు అవసరం లేదు.. మీ వాళ్లే మీ ప్రభుత్వాన్ని కూలుస్తారు.. అసంతృప్తి మొదలైంది.. లేదంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలే ప్రభుత్వాన్ని కులుస్తారు' అని మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీఆర్ఎస్ నియోజవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిన్న జరిగిన క్యాబినెట్లో ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయని, అప్పుడే లుకలుకలు మొదలయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రబాబు శిష్యుడని, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశాడని, ఆ హామీలను అమలు చేయలేక కేసీఆర్‌పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి 'నువ్వు ఉన్నది మూడు ఫీట్లే.. భాష మార్చుకోవాలి.. మంచిగా మాట్లాడాలి' అని హితవు పలికారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టును కాపాడుకోలేక కేంద్రం చేతిలోకి పెట్టారని, ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలపై ఏమాత్రం ప్రేమ, చిత్తశుద్ధి ఉన్నా మంగళవారం సాయంత్రం నాటికి సాగర్ డ్యాంపై పోలీసు బలగాల ఉంచి ప్రాజెక్టును స్వాధీనపర్చుకోవాలని సూచించారు. లేకపోతే 'నువ్వు, నీ మంత్రివర్గం' చేతకాని దద్దమ్మలుగా మిగిలిపోతారన్నారు.

ఎంతో కష్టపడి కేసీఆర్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టు తీసుకొస్తే దానిని ఆపేస్తామని జిల్లాకు చెందిన మంత్రి ఒకరు పదే పదే చెబుతున్నారని, దమ్ముంటే పవర్ ప్లాంట్‌ను ఆపాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉద్దేశించి సవాల్ విసిరారు. అమలు కాని హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని, ఇది ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కేసీఆర్ త్వరలోనే ప్రజల మధ్యలోకి వస్తారని, సాగర్ ప్రాజెక్టుని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతారని చెప్పారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచిందని.. ఆ పార్టీని తొక్కడం చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి వల్లనే కాలేదు.. నువ్వెంత అని అన్నారు. ఏ పార్టీ కూడా రాష్ట్రంలో పది సంవత్సరాలకు మించి అధికారంలో లేదని, ఒకసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇద్దామని ఓట్లు వేశారు తప్ప కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకత కాదన్నారు. రాబోయే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల పదవీ కాలం ముగిసిన సర్పంచులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు గుత్తా అమిత్ రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, అలుగుబెల్లి అమరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ తిరునగర్ భార్గవ్, యువజన నాయకులు నల్లమోతు సిద్ధార్థ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రివన్నీ అబద్ధాలే..

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో సైతం తామెన్నడూ రాజీ పడలేదని చెప్పారు. ఆ జీఓ వచ్చినప్పుడు ముందుండి పోరాటం చేశామనీ, పదవులను వదులుకున్నామని తెలిపారు. జూలై 4, 2005న మంత్రి పదవులకు రాజీనామా చేస్తే, 13 సెప్టెంబర్ 2005న జీఓ వచ్చిందనీ, పదవుల్లో ఉన్నపుడు పోతిరెడ్డిపాడు జీఓ వచ్చిందని రేవంత్ ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. రెండో అపెక్స్ కమిటీ మినిట్స్‌లో రాయలసీమ, పోతిరెడ్డి పాడులపై అభ్యంతరం చెప్పామని మినిట్స్‌లో ఉందనీ, కావాలంటే చెక్ చేసుకోవాలని సూచించారు. విభజన చట్టం రూపొందించిన కాంగ్రెస్ పార్టీని కాదని నిందలు తమపై వేయడం సబబని అన్నారు. తమకు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని తేల్చి చెప్పారు. వాస్తవాలను పక్కదోవ పట్టించేందు కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము చర్చనుంచి పారిపోమనీ, అసెంబ్లీలో ఆధారాలతో సహా నిరూపిస్తామని చెప్పారు.

బీజేపీ పాలనలో దేశం దివాలా

- ఈ నెల 16నగ్రామీణ బంద్‌కు సన్నద్ధం : ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం పూర్తిగా దివాలా తీసిందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ అధ్యక్షులు వేముల పల్లి వెంకట్రామయ్య తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కోటేశ్వరరావు అధ్యక్షతన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామయ్య మాట్లాడుతూ ఈ నెల 16న గ్రామీణ బంద్, దేశవ్యాప్త కార్మికుల సమ్మెకు కార్మికులు, కర్షకులు సన్నద్ధవుతున్నారన్నారు. పదేండ్ల బీజేపీ ప్రభుత్వం మోసపూరిత నినాదాలతో ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతాంగం పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చెల్లిస్తామన్న హామీని మోడీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. రైతాంగ పోరాటానికి తలొగ్గి మూడు రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకున్న సందర్భంగా ఇచ్చిన హామీలను ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన 2024- 25 బడ్జెట్‌లో రైతాంగానికి మొండి చేయి చూపించారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయించకుండా దానిని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, నాయకులు ఎం డేవిడ్ కుమార్, నందగిరి వెంకటేశ్వర్లు, సురేందర్, ఉమర్, లాల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల ఊసేదీ?

మంత్రివర్గ నిర్ణయాలపై ఆవేదన

- నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగుల ఎదురుచూపు
- మూడో వారంలో పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం
- డీఎస్సీ అనుబంధ ప్రకటన ఇవ్వాలంటూ అభ్యర్థుల డిమాండ్
- గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను ఏం చేస్తారు...పలువురి ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత చూపు ఉద్యోగాల భర్తీపైనే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వారు ఎదురుచూస్తున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అందుకనుగుణంగా ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చింది. మొదటి క్యాబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీని ప్రకటిస్తామని చెప్పింది. ఇంకోవైపు జాబ్‌క్యాలెండర్‌లో భాగంగా ఈనెల ఒకటో తేదీన గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రెండునెలలు పూర్తయింది. అయినా ఇచ్చిన హామీలేవీ కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. ఆదివారం మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగాల భర్తీపై కీలక నిర్ణయాలుంటాయని నిరుద్యోగులు ఎంతో ఆశించారు. కానీ ఆ దిశగా మంత్రివర్గం చర్చించలేదు. ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈనెల మూడో వారంలో పార్లమెంటు సాధారణ ఎన్నికల షెడ్యూల్ రాబోతుందనీ, అందుకనుగుణంగా ఈసీ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఆ షెడ్యూల్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిలిచిపోతుంది. ఇదే అంశం నిరుద్యోగులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నది. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు నోటిఫికేషన్లను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల ఎనిమిది నుంచి అసెంబ్లీ సమావేశాలుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటనలు ఇస్తుందో చూడాలి.

గ్రూప్-1పై ఏం చేద్దాం? : టీఎస్‌పీఎస్సీ తర్జనభర్జన

గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను ఏం చేయాలనే దానిపై టీఎస్‌పీఎస్సీ తర్జన భర్జన పడుతున్నది. హైకోర్టు ఆదేశాల ప్రకారం పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలా? లేదంటే సుప్రీం కోర్టులో ఉన్న కేసుకు సంబంధించి తీర్పు వచ్చే వరకు వేచిచూడాలా? అన్నది ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. టీఎస్‌పీఎస్సీకి కొత్తగా చైర్మెన్, సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమ్స్ అంశంపై న్యాయనిపుణుల సలహాలను తీసుకుంటున్నది. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 2022. ఏప్రిల్ 26న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. గ్రూప్-2 రాతపరీక్షలు పలు కారణాలతో మూడుసార్లు వాయిదా పడ్డాయి. టీఎస్‌పీఎస్సీకి కొత్త పాలకమండలి రావడంతో రాతపరీక్షల తేదీలను ప్రకటించే అవకాశమున్నది. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ తొలి గ్రూప్-3 ద్వారా 1,388 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గ్రూప్-3 రాతపరీక్షల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించిన రాతపరీక్ష గతేడాది జులై ఒకటిన నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం 2022, డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ కసరత్తును వేగవంతం చేసింది.

డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ వచ్చేనా?

పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ వస్తుందా? లేదా? అన్న ఆందోళన అభ్యర్థులను వేధిస్తున్నది. ఒకవేళ ఎన్నికల కోడ్ వస్తే ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ఆలస్యమవుతుంది. అందుకే వెంటనే అనుబంధ నోటిఫికేషన్ ఇవ్వాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. అయితే మరో ఐదు వేల ఉపాధ్యాయ పోస్టులను కలిపి పది వేల ఉపాధ్యాయ పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్ ఇవ్వాలని విద్యాశాఖ భావిస్తున్నది. ఇందుకోసం డీఈవోల నుంచి వివరాలను సేకరిస్తున్నది. ఈ ఏడాదిలో సుమారు 3,800 మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందుతారు. ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియను చేపట్టాల్సి ఉన్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి ఆమోదం తీసుకుని డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశముందని తెలిసింది. రాష్ట్రంలో 1.22 లక్షల ఉపాధ్యాయ పోస్టులున్నాయి. 1.03 లక్షల మంది ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్నారు. 19 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు ఆలస్యమైతే వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యావాలంటీర్లను నియమించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది.



సంపాదకీయం

అదే జరిగి వుంటే ?

'ఎంతటి శక్తిమంతులైనా అవినీతిపరుల్ని తేలిగ్గా వదిలిపెట్టవద్దు' అని ఏడాదిన్నర క్రితం సీవీసీ (కేంద్ర విజిలెన్స్ కమిషన్) ఏర్పాటు చేసిన నిఘా అవగాహనా వారోత్సవాల్లో ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. వాస్తవిక కార్యాచరణ అందుకు అనుగుణంగా జరిగి వుంటే పరిస్థితి మరోలా ఉండేది. ప్రభుత్వ స్థాయిలో అవినీతి ఏ మేరకు

ఏది ఏమైనా మన 'ప్రజాస్వామ్యం' గాదె కింద పంది కొక్కుల ఒరవడి మాత్రం దాదాపు నాలుగు దశాబ్దాలుగా నిర్విఘ్నంగా సాగుతోంది. సుప్రీంకోర్టు తాజాగా వ్యాఖ్యానించినట్టు 'అవినీతిపరుల మూలంగా దేశం సర్వనాశన మవుతోంది. మందిని ముంచి దోచుకున్న డబ్బుతోనే చట్టం కళ్లకు గంతలుకట్టే బడా బాబుల దిలాసాతనంతో స్థానికంగా అవినీతి వ్యతిరేక పోరాటమంతా కొండలను తవ్వి ఎలుకలను పట్టిన చందమవుతోంది!'

విస్తరించిందో నిపుణులు, వ్యాపారవేత్తల అభిప్రాయాల ప్రాతిపదికన ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ఏటా దేశదేశాల్లో సమాచారనిధి క్రోడీకరిస్తూ ఉంటుంది. ఆ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2021లో, ఆ మరుసటి ఏడాది ఇండియాకు అందులో 85వ ర్యాంకు 'సాధిస్తే'... 2023లో ఎనిమిది స్థానాలు దిగజారి 93వ స్థానాన్ని కైవసం' చేసుకుంది. ఈ సర్వేలో పాల్గొన్న ప్రతి ఇద్దరిలో ఒకరు సర్కారీ కార్యాలయాల్లో తమ పనులు చక్కబెట్టుకోవడానికి ముడుపులు ముట్టజెప్పినట్టు వెల్లడించారు. దేశీయంగా అవినీతి విశృంఖలత్వం పెచ్చుమీరు తోందనడానికి ఇంతకంటే వేరే దృష్టాంతం అవసరం లేదు.

దేశంలో అవినీతికి పర్యాయపదంగా కాంగ్రెస్ పార్టీని నేటికీ బీజేపీ పెద్దలు చూపుతున్నారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి కుంభకోణాలు జరిగిన మాట వాస్తవం. ఆ రెండు పార్టీలు అవినీతి పరులతో అంటకాగడం, వత్తాసు పలకడంలోనూ ఎవరికెవరూ తీసిపోరు. కార్పొరేట్లకు దోచిపెట్టడానికి వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తుంటారు. మళ్లీ వారే అవినీతి గురించి గురివింద నైతిక విలువలను బోధిస్తూంటారు. నేడు దేశంలో అవినీతి వ్యవస్థీకృతం అయిపోయింది. సరళీకృత ఆర్థిక విధానాల పుణ్యమిది. 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో కణిమొళి, రాజాల గురించి దేశంలో జరిగినంత చర్చ, ఆ స్పెక్ట్రమ్ వల్ల ప్రయోజనం పొందిన టాటా, అనీల్ అంబానీల గురించి జరగదు. భగవాన్ సత్యసాయి బాబా మరణవార్త అధికారయుత ప్రకటన వచ్చేలోపు డబ్బు మూటలు, బంగారు బిస్కెట్లు తరలించుకు పోయిన వారి గురించి ఎవరూ చప్పుడు చేయరు. ఆరోజు మీడియా కెమెరాలకు చిక్కిన ఒక 'పారిశ్రామిక దిగ్గజం' గురించి చర్చే లేదు.



లాక్‌హీడ్, కాంట్రా, వాటర్ గేట్ వంటి కుంభకోణాలు అమెరికాలో జరిగాయి. అధ్యక్షుడు నిక్సన్‌కి, ఆయన సలహాదారుడు హెన్రీ కిసింజర్‌ల ఉద్యోగాలు పోయాయి. కాని మన దేశంలో హిండెన్ బర్గ్ నివేదిక మన ప్రధానిని వెంట్రుకవాసి కూడా కదిలించలేకపోయింది. మన్మోహన్ సింగ్ కాలంలో జరిగిన 'కోల్ గేట్' కుంభకోణానికి నేడు జరుగుతున్న దానికి తేడా ఏమిటి? కాంగ్రెస్ చేసింది చేతగాని కుంభకోణం అయితే ఇప్పుడు బీజేపీ చేస్తున్నది పక్క ప్రభుత్వరంగంలోని బొగ్గు గనుల్లోని ప్రయివేటు వారు తవ్వుకుపోవడానికి దగ్గరుండి సహకరిస్తుంది.

ఏది ఏమైనా మన 'ప్రజాస్వామ్యం' గాదె కింద పంది కొక్కుల ఒరవడి మాత్రం దాదాపు నాలుగు దశాబ్దాలుగా నిర్విఘ్నంగా సాగుతోంది. సుప్రీంకోర్టు తాజాగా వ్యాఖ్యా నించినట్టు 'అవినీతిపరుల మూలంగా దేశం సర్వనాశన మవుతోంది. మందిని ముంచి దోచుకున్న డబ్బుతోనే చట్టం కళ్లకు గంతలుకట్టే బడా బాబుల దిలాసాతనంతో స్థానికం గా అవినీతి వ్యతిరేక పోరాటమంతా కొండలను తవ్వి ఎలుకలను పట్టిన చందమవుతోంది!'


సామాజిక ప్రగతిఫలాలను గుటకాయ స్వాహా చేస్తున్న ఆ చెదపురుగుకు విరుగుడు మందు వేసేవారు ఇక్కడ అక్కడక్కడా కనబడుతున్నారు. తాజాగా విజయన్ కేరళను అవినీతిరహిత రాష్ట్రంగా రూపొందించి 'తలెత్తుకు తిరుగుతున్నామన్న' మాట కూడా విధానాలకి సంబం ధించే! కేవలం అవినీతి గురించి కాదు లంచం తీసు కుంటూ పట్టుబడిన ఉద్యోగులపై వంద రోజుల్లోనే చర్యలు తీసుకుంటాం, సర్కారీ కార్యాలయాల్లో పారదర్శకతకోసం ప్రాణమిస్తాం.. లంచమడిగితే చెప్పుతో కొట్టండి వంటి ఊక దంపుడు ప్రకటనలు చేయడానికి చాలా ప్రభుత్వాలెప్పుడూ ఉవ్విళ్లూరుతుంటాయి. కానీ, అన్ని రకాల అక్రమాలకు తల్లివేరు లాంటి పెట్టుబడిదార్ల అవినీతిపై రాజీలేని పోరాటమంటే మాత్రం వారి నోళ్లకు చప్పున తాళాలు పడిపోతాయి.

అవినీతిపరులుగా వాసికెక్కిన వాళ్లకు వంత పాడేందుకు, అటువంటి వారితో ఫొటోలు దిగేందుకు ఎంతమాత్రం సిగ్గుపడని కొంతమంది గురించి ప్రధాని మోడీ ఇటీవల ప్రస్తావించారు. ఆయన స్పష్టీకరించినట్టుగా అటువంటి ధోర ణులు భారతీయ సమాజానికి శ్రేయస్కరం కానే కావు. కానీ, తీవ్ర స్థాయి ఆర్థిక నేరాలకు పాల్ప డినట్టుగా అభియోగాలను వీపున మోస్తున్న జగ త్కంత్రీలు వీరి హయాం లోనే బెయిళ్లపై దర్జాగా బయట తిరుగుతున్నారు. కొందరు బెయిలు అవసరమే లేకుండా నెట్టుకొస్తున్నారు. అటువంటి అవినీతి అనకొండల నాట్యాలకు నాగస్వరాలూదే స్వార్థ రాజకీయాలు నేడు దేశీయంగా రాజ్యం చేస్తున్నాయి. వాటికి చరమగీతం పాడగలగాలి. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టి తీరాలన్నప్పుడు భారీ భుజంగాలను యథేచ్ఛగా తిరగనివ్వడం సమాజానికి పెనుప్రమాదకరమే కదా!

జీడీపీ లెక్కలు దాచిపెడుతున్నది ఎందుకు?

స్థూల దేశీయోత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) లేదా జీడీపీ అనే భావనతో, దానిని లెక్కించే పద్ధతితో చాలా సమస్యలు ముడిపడి వున్నాయి. సేవా రంగాన్ని కూడా లెక్కలోకి తీసుకోవడం అనే పద్ధతిని ఆడమ్ స్మిత్ ఉండి వుంటే మాత్రం తప్పకుండా వ్యతిరేకించేవాడు. సేవారంగంలో పని చేసేవారు అదనంగా ఉత్పత్తి చేసే సరుకులు ఏమీ ఉండవు అన్న భావన ప్రాతిపదికన అతని వ్యతిరేకత ఉంటుంది. గతంలో సోషలిస్టు దేశాలుగా ఉన్నప్పుడు సోవియట్ యూనియన్‌లో, తక్కిన తూర్పు యూరప్ దేశాలలో జీడీపీ అని కాకుండా, స్థూల పాదార్థిక ఉత్పత్తి (గ్రాస్ మెటీరియల్ ప్రొడక్ట్)ని లెక్కించేవారు. అందులో సేవారంగం లెక్కలోకి వచ్చేది కాదు.

ఒకవేళ సేవా రంగాన్ని కూడా కలిపి జీడీపీని లెక్కించాలనుకున్నా, ఆ సేవా రంగం ద్వారా జరిగేపని విలువని (ఔట్‌పుట్) లెక్కించడం ఎలా అన్నది కూడా ఒక సమస్యే. ఏది "సేవ చేయడం" కింద వస్తుందన్నది ప్రశ్న. సేవలు అందిం చడానికి, (రవాణా లేదా టెలిఫోన్ సేవ) సొమ్మును ఒకరి ఖాతా నుండి మరొకరి ఖాతాకు బదిలీ చేయడానికి మధ్య తేడాను చూడాలా? వద్దా? అన్నది సమస్య. ఒక సంగీత కచేరీని ఆస్వాదించినవారు తద్వారా కొంత సంతృప్తిని పొందుతారు. దానికి ప్రతిఫలం చెల్లించడం అర్థం చేసుకోవచ్చు. ఆ ప్రతిఫలాన్ని చెల్లించే లావాదేవీని నిర్వహించడాన్ని కూడా లెక్కలోకి తీసు కోగలమా? ఇటువంటి అవగాహనతో ముడిపడిన సమస్యలతోబాటు చిన్నస్థాయి ఉత్పత్తి రంగంలో నమ్మకమైన, క్రమబద్ధమైన గణాంకాలు సకాలంలో లభించే పరిస్థితి లేదు. దానివలన కూడా జీడీపీ లెక్కలు వేయడం సమస్య అవుతుంది. మన దేశంలో చాలామంది ఆర్థికవేత్తలు మన జీడీపీ వృద్ధి రేటు లెక్కలు వాస్తవ వృద్ధి కన్నా చాలా ఎక్కువ చూపిస్తున్నాయని భావిస్తున్నారు.


ప్రభాత్ పట్నాయక్


జీడీపీ వృద్ధి బాగుంటే దేశం సుభిక్షంగా ఉన్నట్టే అని అనుకోలేం. ఎందుకంటే పెరిగిన సంపదను పంపిణీ చేయడంలో అసమానతలు చోటు చేసుకోవచ్చు. సామ్రాజ్య వాదం వ్యవహరించే తీరు కారణంగా ఒకానొక మూడవ ప్రపంచ దేశంలో నిట్టనిలువుగా అంతరాలు ఏర్పడతాయి. దాని వలన ఆ దేశపు ఆర్థిక పురోగతిని కొలవడానికి జీడీపీ ఏ మాత్రమూ ఉపయోగ పడదు. వాస్తవానికి జీడీపీ దేశంలో ఏర్పడిన అంతరాలను దాచిపెట్టడానికి తోడ్పడుతుంది.

ప్రస్తుత కాలంలో మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ మీద సామ్రాజ్యవాదం రెండు విభిన్న రకాల ప్రభావాలను కలిగిస్తుంది. ఎక్కువ మూడవ ప్రపంచ దేశాలు ఉష్ణ మండల ప్రాంతాలలో ఉన్నాయి. అక్కడ మాత్రమే పండే వివిధ రకాల పంటలు (ఖనిజాలు ఎటుతిరిగీ కావాలి) పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలకు అవసరం. పెట్టుబడిదారీ విధానానికి పుట్టిల్లు అయిన శీతల దేశాలు మంచుతో స్తంభించిపోయివున్న రుతువులలో సైతం ఉష్ణ మండల ప్రదేశాలలో భూమి మీద చాలా పంటలు పండుతాయి. ఆ విధంగా గోధుమ, మొక్కజొన్న మినహా తక్కిన అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులూ ఈ పారిశ్రామిక, సంపన్న దేశాలకు కావాలి. అయితే ఉష్ణ మండలాలలో వ్యవసాయానికి పనికొచ్చే భూమి విస్తీర్ణం పరిమితంగా ఉంటుంది. అటువంటప్పుడు ఇతర దేశాలకు ఎగుమతులు కూడా చేయడానికి తగినంత పంటలు పండించాలంటే ఆ భూమి దిగుబడి సామర్థ్యాన్ని పెంచాలి. సాగునీటి సదుపాయం కల్పించాలి. నీటి ప్రాజెక్టులను నిర్మించాలంటే అందుకు ప్రభుత్వాలే పూను కోవాలి. కాని నయా ఉదారవాద విధానాలు ప్రభుత్వం ఈ విధంగా ప్రాజెక్టుల నిర్మాణాల ద్వారా జోక్యం చేసుకోడానికి అను మతించదు. ఆ కారణంగా ఆ ఉష్ణ మండల దేశాలలో భూమ్మీద దిగుబడిని పెంపొందించే కార్యక్రమాలు అవసరమైన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఈ పరిస్థితిలో సంపన్న పెట్టుబడిదారీ దేశాల అవసరాలు తీరడానికి ఆ మూడవ ప్రపంచ దేశాల నుండి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడం ఎలా? ఇందుకోసం దేశీయంగా ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల విని యోగాన్ని తగ్గించడమే మార్గంగా నయా ఉదారవాదం ఎంచుకుంది. అందుకోసం అది మూడవ ప్రపంచ దేశాలలోని అధిక సంఖ్యాకుల ఆదాయాలను కుదించే విధంగా షరతులను విధిస్తుంది. ఆదాయాలు తగ్గిపోవడంతో మూడవ ప్రపంచ దేశాల ప్రజల ఆహార వినియోగం, వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం తగ్గిపోతుంది.

ఆ పరిస్థితుల్లో మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలో అంతవరకూ ఉండే నియంత్రణలన్నింటినీ సడలించి నిత్యా వసర వ్యవసాయోత్పత్తుల ఎగమతులు ఏ ఆంక్షలూ లేకుండా జరిగేలా చేయడం నయా ఉదారవాద వ్యవస్థ నిర్వహించే ముఖ్య మైన పనుల్లో ఒకటి. ఆ ఎగుమతులు సాఫీగా జరిగిపోతూ వుండడానికి వీలుగా మూడవ ప్రపంచ దేశాలలో ఆ ఉత్పత్తులకు ఉండే డిమాండ్‌ను కుదించివేయడంతోబాటు ఏయే పంటలు పండించాలన్న విషయాన్ని ఆయా రైతుల ఇష్టాలతోగాని, దేశపు అవసరాలతోగాని నిమిత్తం లేకుండా కేవలం "మార్కెట్" అవసరాలే నిర్ణయిస్తాయి. ఇక్కడ మార్కెట్ అంటే సంపన్న పెట్టుబడి దారీ దేశాల కొనుగోలుశక్తి అని గ్రహించాలి. ఆ సంపన్న పశ్చిమ దేశాలకు అనుకూలంగా ఉండేలా మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు అంతవరకూ తమ దేశ రైతులకు అందిస్తున్న మద్దతు ధరలను ఉపసంహరించుకునేలా నయా ఉదారవాదం ఒత్తిడి చేస్తుంది. దానితోబాటు ప్రజా పంపిణీ కోసం ఆహార ధాన్యాలను నిలవ చేయడాన్ని వ్యతిరేకిస్తుంది. ఎగుమతి సుంకాలను పూర్తిగా రద్దు చేసేలా, అంతర్జాతీయ ధరలకు సమానంగా ధరలు ఉండేలా, ఎగుమతి చేసే ఉత్పత్తుల పరిమాణం మీద ఎటు వంటి ఆంక్షలూ లేకుండా ఉండేలా చూస్తుంది. సరిగ్గా ఈ పనిచేయడానికే ప్రపంచ వాణిజ్య సంస్థ ఉంది. ఇదే సమయంలో సంపన్న దేశాలలోని రైతులకు మాత్రం చాలా హెచ్చు స్థాయిలో నగదు బదిలీలు చేపడతారు. ముఖ్యంగా ఆహారధాన్యాలను, పత్తిని పండించే రైతుల విషయంలో ఇది ఎక్కువగా జరుగుతుంది. ఈ తరహా సబ్సిడీలు తమ రైతులకు అందించడం వలన అంతర్జాతీయ ధరల మీద ప్రభావం ఏమీ పడదని సంపన్న దేశాలు వాదిస్తాయి.

ఈ మొత్తం క్రమంలో మూడవ ప్రపంచ దేశాలలో దేశీయ డిమాండ్ తగ్గిపోవడంతోబాటు సంపన్న పారిశ్రామిక దేశాలకు కావలసినంత సరఫరా జరుగుతుంది. మూడవ ప్రపంచ దేశాలలో తలసరి ఆహార లభ్యత తగ్గిపోవడంతోబాటు ఆ దేశాలలో ఏ యే పంటలను పండించాలో దానిని కూడా ఆ సంపన్న పారిశ్రామిక దేశాలే నిర్ణయిస్తాయి. ప్రస్తుతం మన దేశంలో మనకి కనిపిస్తున్నది ఇదే.

ఇక సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాలపై కలిగిస్తున్న రెండో ప్రభావాన్ని చూద్దాం. మూడవ ప్రపంచ దేశాలు వలసలుగా ఉన్న కాలంలో వాటిలో భారీగా స్థానిక పరిశ్రమలు, వృత్తులు దెబ్బతిన్నాయి. దాని ఫలితంగా పెద్ద స్థాయిలో నిరుద్యోగం పెరిగింది. దాని వలన నిజ వేతనాల స్థాయి కనీస స్థాయికే పరిమితం అయిపోయింది. ఇదే కాలంలో సంపన్న పారిశ్రామిక దేశాలలో వేతనాలు శ్రామిక ఉత్పాదకతలో వచ్చే పెరుగుదలకు అనుగుణంగా పెరుగుతూ వచ్చాయి. అందుచేత సంపన్న దేశాలకు, మూడవ ప్రపంచ దేశాలకు మధ్య కార్మికుల వేతనాల స్థాయిలో అంతరాలు పెరిగిపోయాయి. అందుకే నయా ఉదారవాద విధానాలు వచ్చాక బహుళజాతి సంస్థలు తమ ఫ్యాక్టరీలను సంపన్న దేశాలనుండి మూడవ ప్రపంచ దేశాలకు తరలించడానికి సుముఖంగా ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేసేది ఆ మూడవ ప్రపంచ దేశాల అవసరాల కోసం మాత్రం కాదు. ప్రపంచ మార్కెట్‌కు ఎగుమతి చేయడం కోసం. ఐతే ఈ విధంగా ఫ్యాక్టరీలను తరలించినందువలన ఆ మూడవ ప్రపంచ దేశా లలో ఉన్న నిరుద్యోగులందరికీ ఉపాధి లభించదు. పైగా లభించే ఉద్యోగాలలో ఎక్కువ భాగం నైపుణ్యం పెద్దగా అవసరం లేని ఉద్యోగాలే. అందుచేత ఫాక్టరీలు తరలివచ్చినా,



దేశంలో రెండు తరగతుల ప్రజల మధ్య అంతరాలు ఇంత కొట్టవచ్చినట్టుగా తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో జీడీపీ అనే ఒకే ఒక కొలబద్ద, సర్వరోగ నివారిణి మందు లాగా, దేశ పురోగతికి ప్రాతిపదికగా పరిగణించడం అంటే వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి ఉపయోగించే సాధనంగా జీడీపీని ఉపయోగించడమే ఔతుంది. ఈ జీడీపీ లెక్కలు కప్పిపుచ్చుతున్నది కేవలం పెరుగుతున్న ఆర్థిక అసమానతలను మాత్రమే కాదు. నయా ఉదారవాద విధానాల పెత్తనంలో సమాజంలో పెరుగుతున్న అంత రాల రూపంలో సామ్రాజ్యవాదం ఆధిపత్యాన్ని మనపై చెలాయిస్తున్న తీరును కూడా కప్పిపుచ్చుతోంది. ఒక్క ముక్కలో చెప్పా లంటే సామ్రాజ్యవాద దోపిడీని కప్పిపుచ్చే సాధనంగా జీడీపీ లెక్కలున్నాయి.

ఇక్కడ కార్మికుల వేతనాల స్థాయి మాత్రం పెరగదు. దీనికి తోడు ముందు చెప్పు కున్నట్టు ఆదాయాల కుదింపు ఉండనే వుంది. ఈ విధంగా ఫ్యాక్టరీలను తరలించినందువలన ఆ మూడవ ప్రపంచ దేశాలలో పట్టణీకరణ పెరుగుతుంది, ఉన్నత మధ్య తరగతి ఆదాయాలు పెరుగుతాయి. అంతే.

సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాలపై కలిగించే ఈ రెండు రకాల ప్రభావం వలన మూడవ ప్రపంచ దేశాలలో రెండు రకాల వ్యవస్థలు ఏర్పడతాయి. రెండింటి నడుమ అంతరాలు పెరిగిపోతాయి. వలస పాలన కొనసాగుతున్నప్పుడే ఈ విధమైన అంతరాలు ఏర్పడ్డాయి. వలస విముక్తి పోరాటాలు ఆ అంతరాలను తొలగించాలనే లక్ష్యంతో నడిచాయి. ఆ దిశగానే స్వాతంత్ర్యం సాధించాక ఏర్పడిన ప్రభుత్వాలు ఆర్థిక అసమానతలను తగ్గించే దిశగా జోక్యం కొంతవరకైనా కల్పించుకున్నాయి. ఐతే నయా ఉదారవాదం అమలు లోకి రావడంతో ప్రభుత్వ జోక్యం లేకుండా పోతోంది. దీని ఫలితంగా మళ్లీ అంతరాలు పెరిగిపోతున్న సమాజాలుగా మూడవ ప్రపంచ దేశాలు మార్పు చెందుతున్నాయి.

ఐతే, మూడవ ప్రపంచ దేశాలలో కొత్తగా తరలివచ్చిన పరిశ్రమలలోని కార్మికులకు, ఎదుగూ బొదుగూ లేకుండా మందగించిపోయిన చిన్న రైతుల వ్యవసాయానికీ పోల్చి చూసుకుంటే వారి ఆదాయాల నడుమ అంతరాలు అంతగా పెరిగి పోలేదు. రెండు రంగాలలోని శ్రమజీవులూ నయా ఉదార విధానాల బాధితులే. రెండు రంగాలలోనూ పనులు లేనివారి సంఖ్య భారీగా పెరిగిపోతూ వారి వేతనాల స్థాయిని అంతకంతకూ తగ్గించివేస్తోంది. దీని వలన వారి కొనుగోలుశక్తి పడిపోతోంది. అందువలన సంపన్న పారిశ్రామిక దేశాలలోని డిమాండును తీర్చేలా వారికి ఇక్కడినుండి వ్యవసాయోత్పత్తులు ఎగుమతి ఔతు న్నాయి. అదే సమయంలో ద్రవ్యోల్బణం కూడా అదుపులోనే ఉంది. కాని, స్థానిక బడా బూర్జువా వర్గాల, ఉన్నత మధ్యతరగతి వర్గాల ప్రజానీకానికి, మరోపక్క పాత, కొత్త పరిశ్రమలలోని కార్మికులకు మధ్య అంతరాలు బాగా పెరుగుతున్నాయి. భౌగోళి కంగా కూడా పట్టణాలకు, గ్రామాలకు నడుమ అంతరాలు కూడా పెరుగుతున్నాయి.

ఈ విధంగా పెరుగుతున్న అంతరాలు అధికారికంగా భారత ప్రభుత్వం విడుదల చేసే గణాంకాలలో సైతం కనిపి స్తున్నాయి. కనీస పౌష్టికాహారం పొందలేకపోతున్నవారు పట్టణ ప్రాంతాలలో 1993-94లో 57 శాతం ఉంటే 2017-18 నాటికి 60 శాతం ఉన్నారు. అదే గ్రామీణ ప్రాంతాలలోనైతే ఇదే కాలంలో వారు 58 శాతం నుండి 80 శాతానికి పెరిగారు. నయా ఉదారవాద విధానాలను సిగ్గూఎగ్గూ లేకుండా దూకుడుగా అమలు చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఈ అంతరాలు మరింత వేగంగా పెరుగుతున్నాయి.

దేశంలో రెండు తరగతుల ప్రజల మధ్య అంతరాలు ఇంత కొట్టవచ్చినట్టుగా తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో జీడీపీ అనే ఒకే ఒక కొలబద్ద, సర్వరోగ నివారిణి మందు లాగా, దేశ పురోగతికి ప్రాతిపదికగా పరిగణించడం అంటే వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి ఉపయోగించే సాధనంగా జీడీపీని ఉపయో గించడమే ఔతుంది. ఈ జీడీపీ లెక్కలు కప్పిపుచ్చుతున్నది కేవలం పెరుగుతున్న ఆర్థిక అసమానతలను మాత్రమే కాదు. నయా ఉదారవాద విధానాల పెత్తనంలో సమాజంలో పెరుగు తున్న అంతరాల రూపంలో సామ్రాజ్యవాదం ఆధిపత్యాన్ని మనపై చెలాయిస్తున్న తీరును కూడా కప్పిపుచ్చుతోంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సామ్రాజ్యవాద దోపిడీని కప్పిపుచ్చే సాధనంగా జీడీపీ లెక్కలున్నాయి.

అంతే కాదు. ఈ జీడీపీ లెక్కలు అన్నీ ప్రాథమికంగా భారీ పరిశ్రమల నుండి లభించే గణాంకాల ఆధారంగానే రూపొందుతాయి. భారీ పరిశ్రమలలో అభివృద్ధి ఉంటే దాదాపుగా అదే స్థాయిలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలలోనూ ఉంటుందన్న లెక్కతో జీడీపీని అంచనా వేస్తారు. కాని, వాస్తవానికి చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వృద్ధి చెందడం లేదు సరికదా కునారిల్లుతున్నాయి. ఆ విధంగా జీడీపీ లెక్కలు వాస్తవానికి దూరంగా ఉంటున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

నేడు అంతర్జాలం(ఇంటర్నెట్) లేకుండా క్షణం గడవదు. ఎనిమిది బిలియన్స్‌కు పైగా ప్రపంచ మానవాళిని క్షణాల్లో ఏకం చేయగల సామర్థ్యం అంతర్జాలానికి మాత్రమే సొంతం. 'నెట్ వర్క్స్ ఆఫ్ నెట్‌వర్క్'గా పిలువబడుతున్న ఇంటర్నెట్ ద్వారా ప్రపంచ నలుమూలల ఉన్న కంప్యూటర్లను అనుసంధానం చేస్తూ ప్రామాణిక సమాచార వితరణ సాధనంగా క్షణాల్లో ఒకరి నుంచి మరొకరికి సమాచారాన్ని చేర్చుతున్న మహత్తర శక్తివంతమైన మాధ్యమంగా మానవాళిపై విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకుంది. అయితే అంతర్జాల వినియోగం మానవాళి శ్రేయస్సుకు మరింత ఊతమివ్వాలని, ఇంటర్నెట్ వాడకంతో మోసాలు, అక్రమాలకు తావివ్వకూడదని విస్తృతంగా ప్రచారం చేయ డానికి ప్రతి యేటా 06 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు 'సురక్షిత అంతర్జాల దినం (సేఫర్ ఇంటర్నెట్ డే)' నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాదికి గాను 'మెరుగైన అంతర్జాలం కోసం అందరం కలుద్దాం (టుగెదర్ ఫర్ ఏ బెట్టర్ ఇంటర్నెట్)' అనబడే నినాదంతో ప్రచారం చేస్తున్నారు.

అంతర్జాలం నేడు కనీస అవసరాల జాబితాలో ప్రథమ స్థానంలో నిలుస్తున్నది. అన్నం, నీరు లేకుండా బతకొచ్చేమోగాని ఇంటర్నెట్ కనెక్ట్ గానీ, స్మార్ట్‌ఫోన్ గానీ లేకుండా క్షణం కూడా గడవడం లేదంటే అతిశయోక్తి కాదు. నేటి సమాజంలో పిల్లల నుంచి మొదులకుని యువత, పెద్దలు, అన్ని వర్గాల ప్రజలు ఇంటర్నెట్‌లో మునిగి తేలుతున్నారు. దీంతో అంతర్జాలాన్ని దుర్వినియోగమై చాలాచోట్ల ఇంటర్నెట్

అంతర్జాలం..జరపైలం

మోసాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరాల్లో సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ అడిక్షన్, తప్పుడు సమాచార వితరణ, వ్యక్తిగత సమాచార చోరీ, సమాచార,నగదు దోపిడీ, సైబర్ మోసాలు, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల రవాణా, అశ్లీల వెబ్‌సైట్లు, చట్టవిరుద్ధ కార్యాలు, సేవలు, ఏఐ ఆధారిత డీప్ ఫేక్ వీడియోలు లాంటి పలు అంశాలు వస్తాయి. దీనికి తోడుగా అంతర్జాల దుర్విని యోగంతో మానవ సంబంధాలు కొన్ని సన్నగిల్లడం, ఈర్ష్యాద్వేషాలు పెరగడం, విభేదాల సంక్షోభాలు అంకురించడం, అభద్రతాభావం పెరగడం, ఆందోళన, మూడ్ స్వింగ్, మానసిక ఒత్తిడి, ఒంటరితనం వెంటాడడం, ఏకాగ్రత తగ్గడం, పనిలో శ్రద్ధ కోల్పోవడం లాంటి పలు ప్రతికూలతలు కూడా ఉన్నాయని గమనించాలి.

పూర్తి పరిజ్ఞానం లేకుండా ఇంటర్నెట్ వేదికలను వినియోగిస్తే మనకు తెలియకుండానే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవలసి వస్తుందని తెలుసుకోవాలి. అంతర్జాలం పట్ల కనీస అవగాహన కలిగి ఉండడం, పరిమితులను తెలుసుకోవడం, సైబర్ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి. ఆన్‌లైన్ సేఫ్ టూల్స్ గురించి తెలుసుకోవడం, సైబర్ నేరాల పట్ల సమాజాన్ని జాగృత పరచడం, వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరుచుకోవడం లాంటి పలు జాగ్ర త్తలు ప్రతి ఒక్క ఇంటర్నెట్ వినియోగదారుడికి తెలిపే పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని అంతర్జాల నిపుణులు సూచి స్తున్నారు. కనీస ఆన్‌లైన్ అవగాహనలతో సురక్షితమైన అంతర్జాల అనంత అద్భుత ప్రయోజనాలను ఆస్వాదిద్దాం, విశ్వ మానవాళితో అనుసంధానంలో ఉందాం.

(06 ఫిబ్రవరి 'సురక్షిత అంతర్జాల' దినం)

- బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

మూలస్తంభాలు - వాస్తవాలు

పేదలు, రైతులు, మహిళలు, యువత - ఈ నాలుగు మూలస్తంభాలపైనే మన భారతదేశం విరాజిల్లుతుందని కేంద్రంలోని మోడీ ప్రభుత్వ మాటలుగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పార్లమెంటు వేదికగా ఉటంకించారు. తద్వారా సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్టు ఆమె చెప్పుకొచ్చారు. పార్లమెంటు నూతనభవనంలో ఉభయ సభలనుద్దేశించి 75 నిముషాల పాటు సాగిన రాష్ట్రపతి ప్రసం గానికి పాలకపక్షం పలుమార్లు పదే పదే హర్షధ్వానాలు ప్రకటించడంలో వింతేమీ ఉండదు. అయోధ్య రామాల యంలో బాలరామ విగ్రహ ప్రాణప్రతిష్టాపన గురించి ప్రస్తావించినప్పుడయితే బల్లలు చరిచి మరీ కేరింతలు కొట్టడం బహిరంగసభను తలపించింది. అయితే భవి ష్యత్ కార్యాచరణ ప్రణాళిక గురించి కాకుండా కేవలం గత పదేళ్ల కృషికే రాష్ట్రపతి పరిమితి కావడం గమనర్హం.


కె. శాంతారావు

న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలు మూలస్తంభాలుగా మనం భారత రాజ్యాంగాన్ని బాబా సాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో రూపొందించుకు న్నాము. మన దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకున్నాము. 75 ఏండ్ల అమృతోత్సవ వేడుకల వేళ, ఈ మూలస్తంభాల ప్రస్తావన ఎలా మారుతున్నదీ (అదీ పార్లమెంటు వేదికగా) మనం గమనించవచ్చు. కాగా, ఈ తొమ్మిదేండ్ల వ్యవధిలో పాతిక కోట్లమంది పేదలు (మొదటి స్తంభం) దారిద్ర్యరేఖ ఊబి నుండి బయటపడినట్టు నిటిఅయోగ్ చర్చా పత్రం చెబు తున్నది. 2013-14లో 29.7 శాతంగా నమోదైన పేదరికం 2022-23 నాటికి 11.28 శాతానికి తగ్గినట్టు అది పేర్కొంది. 2030 నాటికల్లా ఆకలి బాధకు తాళలేని, తావులేని సుందర ప్రపంచాన్ని సృష్టించాలనే ఐ.రా.స సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగానే భారత్ వడివడిగా అడుగులో వేస్తున్నట్టు వివరించింది.

మరైతే దేశవ్యాప్తంగా 81 కోట్లమంది అన్నార్తులకు మరో ఐదేళ్ల పాటు ఉచితంగా తిండిగింజల పంపిణీని మోడీ ప్రభుత్వం ఎందుకు ప్రకటించినట్టు? అని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. బహుముఖ పేదరిక సూచిలో మన భారతదేశం పొరుగునున్న బంగ్లాదేశ్, శ్రీలంక కన్నా దిగువనే ఉంటున్నదని వారు ఆందోళన పడుతున్నారు. దేశంలో దాదాపు 23కోట్ల మంది కటిక పేదరికంలో జీవిస్తున్నారని, వారిలో 15కోట్ల మందికి పైగా ప్రజానీకానికి నూరు రోజులపని (ఉపాధి హామీ పథకం) మాత్రమే దిక్కు అని తెలిపారు. వ్యవసాయ కూలీలు, రోడ్డు మీద రోజువారీ అడ్డా కూలీలు. పేవ్‌మెంట్ వెండర్స్ (చిన్న చిన్న విక్రయ దారులు) పని మనుషులు, ఒంటరి మహిళలు, నిరాధార వృద్ధు లు, పండ్లు, కూరగాయలు అమ్ముకునే వాళ్లు, చేతి వృత్తుల వాళ్లు, సఫాయి కార్మికులు, గనులు, సున్నపు రాయి, కంకర, గ్రానేడ్ వంటి ప్రమాదకర రాళ్లపనివాళ్లు, నిర్మాణ కార్మికులు, మృతకళేబరాల చర్మాలను శు భ్రపరిచేవారు, చెత్తా చెదారం (గార్బేజ్) ఏరుకునేవారు, సముద్రం- నదులు జలాల మధ్య పనిచేసుకునే మత్స్యకారులు, అటవీ ఉత్ప త్తులు సేకరించుకునే గిరిజనులు - ఇలా ఎంతో మంది పేదలు నిత్య జీవితంలో మనకు తారసపడుతూనే ఉంటారు. విషయం ఏమంటే మనదేశంలో సంపన్నులు ఏడు శాతం మంది మాత్రమే ఉంటే మిగిలిన 93 శాతం మంది మధ్యతరగతి, పేదవారు అన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని ఇటీవల మాజీ ఆర్థికశాఖ మంత్రి చిదంబరం కూడా వక్కాణించారు.

ఇక రైతులు (రెండవస్తంభం) విషయానికొస్తే మనం ఒకటి కచ్చితంగా చెప్పు కోవాలి. ఈసారి గణతంత్ర వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ వ్యూహాత్మక రాజకీయాల్లో అనుసరించే ఆయుధ సైనిక పాటవాల్లో భాగంగా ఈ పర్యటనను భావించాలని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ - ఫ్రాన్స్ ఉభయ దేశాల మధ్య జరుగుతున్న ఒప్పందాలు ఆత్మనిర్భర్ భారత్‌కే కాకుండా మేక్ ఇన్ ఇండియాకు కూడా ఉపకరిస్తుందని గోదీ మీడియా ప్రగల్భాలు పలుకుతున్నది. ఎందుకంటే రాఫెల్ యుద్ధ విమా నాల తయారీ, ఇంజన్‌లు విడిభాగాల నిర్వహణ - మరమ్మతు వంటి అంశాలు కూడా ఇందులో కీలకం మరి.అయితే మనదేశంలో మాదిరి ఫ్రాన్స్ రైతులు కూడా తమ ప్రభుత్వంపై కత్తులు దూస్తున్నారు. ఇదో సారూ ప్యత, ఎంత దాచిపెట్టినా ఈ వార్తలు బయటకు పొక్కుతూనే ఉన్నాయి. ఇటీవల ఇద్దరు మహిళా ఉద్యమకారులు తమ నిరసనగా పారిస్ మ్యూజియంలోని మోనాలిసా



యువతను నిర్వీర్యం గావించేందుకే పెద్ద ఎత్తున కుట్రలు సాగుతున్నయనడం సత్యదూరం కాదు. యంగ్ ఇండియాను డ్రగ్ ఇండియాలా మార్చేలా గ్రామా లకు సైతం మత్తు-మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా ప్రవహిస్తున్నాయి. మరో పక్క సెల్‌ఫోన్స్‌లో ఆవరించిన బూతు చిత్రాలు యువతను విషతుల్యం చేస్తున్నాయి. తాగడం, తిరగడం, అత్యాచారాలు చేయడం, హింసా ఉన్మాదచర్యలకు యువత పాల్పడటం అతి సామాన్యమైపోయింది. నిరుద్యోగం సరేసరి. మనదేశ నిరుద్యోగ రేటు 2023 జూలై నాటికి 7.95 శాతానికి చేరుకున్నది. నిరుద్యోగ యువమేధ అనివార్యంగా వెరిత్రలలు వేస్తుందని మానసిక నిపుణుల అభిప్రాయం.

పెయింటింగ్‌పై సూప్ విరజిమ్మారు. సుస్థిరమైన ప్రజా రోగ్యానికి కావాల్సింది ఆహారభద్రతా? కళాఖండాలా? ఏది ముఖ్యం? అని ప్రశ్నించారు. 'మనదేశ (ఫ్రాన్స్) వ్యవసాయరంగ పెను సంక్షో భంలో చిక్కుకున్నది. రైతులు చనిపోతూ ఉన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించాలి' అని వారు ఆ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇంధన ధరలు మోయలేని విధంగా పెరిగాయంటూ రైతులు ట్రాక్టర్‌లతో పారిస్ నగరాన్ని దిగ్బంధించారు. ఇది సాక్షాత్తు ఢిల్లీలో ఏడాదిన్నర పాటు సాగిన మన కిసాన్ ఉద్యమాన్ని గుర్తుకుతెస్తున్నది. 700 మందికి పైగా రైతులు ఆ ఉద్యమంలో బలైపోయిన విషయం తెలిసిందే. నల్లచట్టాల రద్దు విషయంలో అప్పుడు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చనపుడు ఇక మోడీ ప్రభుత్వాన్ని నమ్మేదెలా..? భారత రైతుల ఆక్రోశం ఇది.

మరి మహిళలు (మూడవస్తంభం) విషయానికి వస్తే బిల్కిస్‌బానో ఉదంతం ఒక్కటిచాలు.2002 గుజరాత్ నరమేధం ఘటనలో బిల్కిస్‌బానో అనే గర్భవతిపై అరాచక ఉన్మాదమూకలు దాడి చేసాయి. మూడేళ్ల కుమార్తెతో పాటు ఆమె కుటుంబ సభ్యులు మొత్తం ఏడుగురిని ఆ మూకలు అమానుషంగా హత్య చేసాయి. అక్కడితో ఆగక ఆమెపై పైశాచికంగా సామూహిక అత్యాచారం చేసారు. చెప్పనలవికాని ఈ దుర్మార్గంపై బిల్కిస్‌బానో ఒంటరిగా సుదీర్ఘ కాలం పాటు న్యాయ పోరాటం చేసింది. ఎట్టకేలకు ముంబై హైకోర్టు ఈ కేసులో 11 మందిని దోషులుగా నిర్ధారించి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. 2008 జనవరిలో ఈ తీర్పు వచ్చింది. కానీ ప్రధాని మోడీ 2022 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఎర్రకోటపై నుండి భారత నారీశక్తికి దేశమంతా గర్వించాలని ఉద్ఘాటించిన కొద్ది సేపటికే గుజరాత్ ప్రభుత్వం, మిగతా శిక్షకాలం రద్దు చేసి ఆ నేరస్తులను రెమిషన్‌పై విడుదల చేసింది. విడు దలైన వారిలో ఏ ఒక్కరూ పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు సరికదా, వారిలో కొం దరిని వారి అనుచరులు మేళ తాళాలతో ఊరేగించారు. మరికొందరైతే వారి 'ఘనకార్యానికి' హారతులిచ్చి సాష్టాంగ ప్రాణమిల్లారు. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానం గతనెల 8వ తేదీన విస్పష్టమైన తీర్పు ఇస్తూ...ఆ పదకొండు మంది నేరస్తులు వెంటనే లొంగిపోయి జైలుకు వెళ్లాలని ఆదే శించింది. ప్రస్తుతం కొందరు పరారీలో ఉన్నట్టు తెలుస్తున్నది. 'నేను మళ్లీ ఊపిరి పీల్చుకుంటున్నాను' అని ఈ సందర్భంగా బిల్కిస్ బానో పలికిన మాటలు నారీ, ధర్మ పక్షపాతుల గుండెల్లో నిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి.

చివరగా (నాల్గవస్తంభం) యువత. ప్రపంచంలో అతిపెద్ద జనాభా కలిగిన (141 కోట్లు) భారతదేశంలో ముప్పైఏండ్లలోపు ఉన్న యువ-బాలలు 60 శాతం మంది. అందులో సగం 16-30 ఏండ్లు కలిగిగన యువత ఉన్నారనుకుంటే, వారిసంఖ్య 42 కోట్లు. అందుకే మన దేశాన్ని యంగ్ ఇండియా (యువభారత్)గా పిలుస్తున్నారు. నిజమే - కానీ యువతను దేశ నిర్మాణ పథంవైపు నడిపించే ప్రణాళికలేవీ పాలకుల వద్ద లేవు. నేడు కార్పోరేట్ ప్రపంచీకరణ పడగనీడన ఎల్లెడలా ఉపాధి రహిత అభివృద్ధే వ్యాపిస్తున్నది. అది పర్యావరణాన్ని, సహజ వనరులను, మానవ వనరులను విధ్వంసం చేసే దిశగానే సాగుతున్నది.

ఈ నేపథ్యంలో యువతను నిర్వీర్యం గావించేందుకే పెద్ద ఎత్తున కుట్రలు సాగుతున్నయనడం సత్యదూరం కాదు. యంగ్ ఇండియాను డ్రగ్ ఇండియాలా మార్చేలా గ్రామా లకు సైతం మత్తు-మాదకద్రవ్యాలు విచ్చల విడిగా ప్రవహిస్తున్నాయి. మరో పక్క సెల్‌ఫోన్స్‌లో ఆవరించిన బూతు చిత్రాలు యువతను విషతుల్యం చేస్తున్నాయి. తాగడం, తిరగడం, అత్యాచారాలు చేయడం, హింసా ఉన్మాదచర్యలకు యువత పాల్పడటం అతి సామాన్యమైపోయింది. నిరుద్యోగం సరేసరి. మనదేశ నిరుద్యోగ రేటు 2023 జూలై నాటికి 7.95 శాతానికి చేరుకున్నది. నిరుద్యోగ యువమేధ అనివార్యంగా వెర్రితలలు వేస్తుందని మానసిక నిపుణుల అభిప్రాయం.

ఇవన్నీ కళ్లముందు జరుగుతున్న కఠోర వాస్తవాలు. ముంజేతి కంకణానికి అద్దమేల? అన్నట్టు ప్రత్యేకించి చూప క్కర్లేదు. ప్రతి ఒక్కరికీ స్వానుభవమే. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్టు పాలకులు భావిస్తే ఏం చేస్తలేం. మరి ఏ శాస్త్రీయ చర్యలతో ఈ మూలస్తంభాలను ఉద్ధరిస్తారో పాలకులే చెప్పాలి. లేని పక్షంలో ఈ సంక్షోభాలు, ముదిరి ముదిరి అంత ర్యుద్ధాలకు దారితీసే ప్రమాద పరిస్థితులు అతిదగ్గర్లోనే ఉన్నాయనేది చరిత్ర చెప్పే పాఠం.

సెల్: 9959745723

మల్లన్నసాగర్ నిర్వాసితులపై కేసుల కొట్టివేత

- నిర్వాసితులు, నాయకులను సన్మానించిన సీపీఐ(ఎం)



నవతెలంగాణ-సిద్దిపేట

మల్లన్న సాగర్ నిర్వాసిత రైతులు, సీపీఐ(ఎం), ఇతర రాజకీయ పార్టీల నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను సిద్దిపేట కోర్టులో జడ్జి సోమవారం కొట్టేశారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో అప్పటికే పోరాటం చేస్తున్న నిర్వాసితులపైనా, వారికి మద్దతు తెలిపిన సీపీఐ(ఎం), ఇతర రాజకీయ పార్టీల నాయకులపైనా 2016లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపింది. 8 సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లా కోర్టుకు తిరుగుతున్నామని, సోమవారం సిద్దిపేట జిల్లా కోర్టులో కేసులను కొట్టేశారని బాధితులు తెలిపారు. వారందరికీ సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ కోసం 14 గ్రామాల ప్రజల నుంచి అక్రమంగా భూసేకరణకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందని, దానికి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) ముందు నిలిచి ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటం చేసిందన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న వారిపై అప్పటి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులు బనాయించిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మల్లన్న సాగర్ నిర్వాసితులకు రావలసిన న్యాయమైన నష్ట పరిహారాలను వెంటనే మంజూరు చేసి, నిర్వాసితులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ పోరాటంలో సహకరించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, కోర్టులో వాదించిన న్యాయవాది రాజలింగం, వారి బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పంజాగుట్ట మాజీ సీఐ అరెస్ట్

- బోధన్ మాజీ ఎమ్మెల్యే కొడుకు కేసులో..

నవతెలంగాణ-సిటీబ్యూరో

పరారీలో ఉన్న పంజాగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావును వెస్ట్‌జోన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు చేసిన రోడ్డు ప్రమాదం కేసు వ్యవహారంలో దుర్గారావు నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. షకీల్ కొడుకు పారిపోయేందుకు సహకరించాడని ఉన్నతాధికారులు తేల్చడంతో దుర్గారావును సీపీ కొత్తకోట శ్రీనివాస్ సస్పెండ్ చేశారు. ఇక అరెస్టు తప్పదన్న వార్తల నేపథ్యంలో ఆయన పరారీలో ఉన్నారు. అప్పటి నుంచి గాలిస్తున్న పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్లులో దుర్గారావును పట్టుకున్నారు.

డిసెంబర్ 24న అర్ధరాత్రి ప్రజా భవన్ వద్ద తన కారుతో బారికేడ్‌ను ఢీకొట్టిన మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమా రుడు సాహిల్ అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసు లు పలువురిని అరెస్టు చేశారు. అయితే సాహిల్ దేశం విడిచి వెళ్లేందుకు సహకరించాడని దుర్గారావుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దుర్గా రావు హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు అరెస్టు చేస్తే తన కెరీర్‌కు తీవ్ర నష్టం జరుగుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ కేసులో సీఐను ఏ11గా చేర్చారు. ఎట్టకేలకు తాజాగా సీఐను పోలీసులు అరెస్టు చేశారు.

కేస్లాపూర్‌కు.. మెస్రం వంశీయుల పయనం

- 9న నాగోబా జాతర ప్రారంభం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ జాతరకు నెల రోజుల ముందు నుంచే మెస్రం వంశీయులు సంప్రదాయాలకు శ్రీకారం చుట్టారు. గత నెల 21న మెస్రం ఖటోడ (పూజారి) కోసేరావ్, హన్మంతు, దర్ము, కొత్వాల్ తిరుపతి, దాదేరావ్ ఆధ్వర్యంలో కేస్లాపూర్‌లోని మురాడి (పురాతన దేవాలయం) వద్ద వారి పూజలు చేసి జన్నారం మండలంలోని పవిత్ర గోదావరి గంగా జలం కోసం బయలుదేరారు. గంగా జలం సేకరించి, దారిలో ఆయా గ్రామాల పొలిమేరలో బస చేస్తూ 15 రోజుల సుదీర్ఘ కాలి నడక ప్రయాణంతో సోమవారం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ఖటోడ (పూజారులు) మెస్రం కోసేరావ్, ధర్ము, హన్మంతుల ఆధ్వర్యంలో నవధాన్యాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారి సంప్రదాయ వాయిద్యాలైన కాలికొమ్, తుడుం వాయించారు.

గారెలతో ప్రసాదం

ఇంద్రాదేవి ఆలయం వద్ద మహిళలు ప్రత్యేకంగా గారెలు, జొన్న గటకతో నైవేద్యాన్ని సమర్పించారు. అక్కడ మధ్యాహ్నం ఉపవాస దీక్షలు విడిచిన తరువాత సాయంత్రం బండెనక బండి కట్టి కేస్లాపూర్‌కు పయనమయ్యారు. అక్కడ వట వృక్షం వద్ద పూజ అయ్యే వరకు మూడ్రోజుల పాటు బస చేస్తారు. మంగళవారం నాగోబా పీఠాధిపతి పటేల్ మెస్రం వెంకట్ రావ్‌కు పూజకు రావాలని ఆహ్వానం పలుకుతారు. 9న అర్ధరాత్రి నాగోబాకు పవిత్ర గంగా జలంతో అభిషేకం చేసి జాతరను ప్రారంభిస్తారు.

మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు మృతి

నవతెలంగాణ-సుల్తానాబాద్

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కొద్దిరోజులుగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. గ్రామపంచాయతీలో చిన్న ఉద్యోగంతో తన జీవనాన్ని ప్రారంభించారు ఆయన. అంచెలంచెలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేగా గెలుపొంది ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. రాజమల్లు భౌతిక కాయానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవం, 47వ వార్షిక సంగీతోత్సవం

నవతెలంగాణ-హైదరాబాద్



విజ్ఞాన సమితి (రిజి.) ఆనంద నగర్ కమ్యూనిటీ హాల్, ఖైరతాబాద్, హైదరాబాద్‌లో గత నెల 29 నుంచి ప్రారంభమైన 177వ శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవం, 47వ వార్షిక సంగీతోత్సవం ఈ నెల 4వ తేదీ (ఆదివారం) తో ముగిసింది. ఈ ఉత్సవం మొదటి రోజు శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, పీ. పూర్ణచందర్‌ను సత్కరించారు. "సంగీత విజ్ఞాన విశారద" బిరుదును ప్రదానం చేశారు. అనంతరం జంట నగరాలకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు "త్యాగరాజ ఘనరాగ పంచరత్న కృతులు" సమూహ ప్రదర్శనను అందించారు. "మల్లాది బ్రదర్స్" గా ప్రసిద్ధి చెందిన మల్లాది శ్రీ రామ్ ప్రసాద్, డా. మల్లాది రవి కుమార్ స్వర యుగళగీతం ఏర్పాటు చేయబడింది. మల్లాది బ్రదర్స్ అద్భుతమైన వైవిధ్యమైన త్యాగరాజ కృతుల ప్రదర్శనతో ఆదర్శప్రాయమైన ప్రదర్శన. క్లాసిసిజం మరియు భక్తితో నిండిన నిజంగా అత్యుత్తమ సంగీత కచేరీ. వీరికి వయోలిన్‌పై ఆర్. దినకర్, మృదంగంపై డా. డి.ఎస్.ఆర్. మూర్తి, కంజీరాపై కె. శ్యామ్ కుమార్ చక్కటి సహకారం అందించారు. ఇలా ప్రతి రోజూ నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. చివరి రోజు సాయంత్రం హారతి, ప్రసాద వితరణతో వార్షిక సంగీత ఉత్సవం ముగిసింది.

ఏజెన్సీ ప్రాజెక్టులపై పట్టింపేదీ..?

పాలెం ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రారంభం

లైనింగ్ పగుళ్లు.. కాల్వలకు గండ్లు

- 10,132 ఎకరాలు.. రూ.221 కోట్ల ఖర్చు
- తట్టమట్టి తీయకుండానే మోడికుంట ప్రాజెక్టుకు రూ.65 కోట్ల ఖర్చు
- అతీగతీ లేని గుండ్లవాగు
- పనులు ప్రారంభించాలని రైతు సంఘాల వేడుకోలు..



నవతెలంగాణ -వెంకటాపురం

పాలకులు మారిన రైతుల తలరాతలు మాత్రం మారడం లేదు. తలాపునే గోదావరి నది ప్రవహిస్తున్నా రైతుల పొలాలకు చుక్క నీరందించిన దాఖలాలు లేవు. సాగునీటి ప్రాజెక్టులను కడితే నీళ్ల పారి రైతుల కష్టాలు తీరుతాయి. కానీ, ఏజెన్సీ మారుమూల ప్రాంతమైన ములుగు జిల్లాలోని కొన్ని ప్రాజెక్టుల్లో డబ్బులే పారుతున్నాయి. చుక్కనీరు ఇవ్వని ప్రాజెక్టుల కోసం కోట్ల డబ్బులు కుమ్మరించినా ఇంతవరకు వాటిపై సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించలేదు. ఉన్నతాధికారులైనా కదులుతారనుకుంటే అది అత్యాశగానే మారింది. అనాలోచిత నిర్ణయాలు, పర్యవేక్షణా లోపంతో చేపట్టిన పనులు అక్కరకు రాకుండా తయారయ్యాయి. దశాబ్దాల కాలంగా ప్రభుత్వం ఉడతా భక్తిగా ఎంతో కొంత వ్యయం చేయడమే తప్ప ఒక్క చుక్క నీటిని గిరిజన ప్రాంతాల ప్రజలకు అందివ్వలేదు. నిధుల వ్యయం చేసినా ఏమాత్రం అక్కరకు వచ్చేలా పనులు సాగడంలేదు. మూడు మధ్యతరహా ప్రాజెక్టులకు కోట్లల్లో ప్రజాధనం ఖర్చు పెట్టారు. అంతేకాదు, మరో రూ.300 కోట్లకు రీ డిజైన్ ప్రతిపాదనలు పంపారు.

ములుగు జిల్లా వెంకటాపురం మండలం మల్లాపురం వద్ద పాలెంవాగుపై 2005లో రూ.70.99 కోట్ల అంచనా వ్యయంతో పాలెం ప్రాజెక్టును ప్రారంభించారు. ఆ పనులను ఎల్ఎస్, కేవీఆర్ కంపెనీలు దక్కించుకున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే 10,132 ఎకరా లకు సాగునీరు అందుతుం ది. వెంకటాపురం, వాజేడు మండలాల్లో 13.5కిలో మీటర్ల కాలువ నిర్మాణం జరిగింది. అధికారుల ప్రణాళిక లేమి, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మించిన మట్టికట్ట 2006, 2008లో రెండు ధపాలు గండి పడి కొట్టుకుపోయింది. దాంతో అప్పటి ప్రభుత్వా నికి తీవ్ర అవినీతి విమర్శలు వచ్చాయి. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో అంచనా వేయకుండా ఇష్టారాజ్యం గా పనులు చేసిన కాంట్రాక్టర్, అధికా రులపై గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా తిరిగి ప్రాజెక్టు పనులను వారికే కట్టబెట్టారు. పైగా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.100.29 కోట్లకు పెరిగింది. అది కాస్తా 2017 నాటికి రూ.221.48కోట్లకు చేరింది. ఈ ప్రాజెక్టు పురోగతిని 17-4-2017 న పరిశీలించిన అప్పటి భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అయినా కాల్వల పనులు, ప్రాజెక్టు పనులు పూర్తిస్థాయి లో జరగలేదు. పాలెం ప్రాజెక్టు నుంచి మరికాల పంచాయతీ రామకృష్ణాపురం మధ్య లో ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు 5 మీటర్ల మేర జరగాల్సి ఉన్నా జరగక ఎ౦వ డ౦ ల పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందిం చని పరిస్థితి నెలకొంది. దానికి తోడు ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరగడంతో కాలువ లైనింగ్‌లన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్న పాటి వరదలు వచ్చినా పాలెం ప్రాజెక్టు ప్రధాన కాలువకు గండ్లు పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కడగం(గుం)డ్ల వాగు..

వాజేడు మండలంలోని గుండ్లవాగువద్ద 2.580 ఎకరాల సాగునీరు అందించే లక్ష్యంతో 1977-79 మధ్య రూ.4.10 కోట్లతో ప్రాజెక్టు పూర్తి చేసినా ఇప్పటివరకు 100 ఎకరాలకు నీరు అందించిన దాఖలాలు లేవు. 2013 వరకు ఈ ప్రాజెక్టుకు రూ.30 కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ప్రాజెక్టులోకి వచ్చిననీరు రెండు రోజుల కంటే ఎక్కువ నిల్వఉండదు. ఈ ప్రాజెక్టు పరిధిలో ఇప్పటికే 12 బుంగలున్నాయి. ప్రతి వర్షాకాలం 100 నుంచి 150 ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ప్రధాన కాల్వకు గండ్లు పడుతూనే ఉంటాయి.

కాగితాలు దాటని మోడికుంట వాగు..

వాజేడు మండలంలోని కృష్ణాపురం మోడికుంట వాగుపై ప్రాజెక్టు నిర్మాణానికి 2005లో రూ.120 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. 2.142 టీఎంసీల నీటి మట్టం 13,591 ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. 0.12 టీఎంసీల నీటిని 35 గ్రామాలకు తాగునీరు అందించేందుకు 1.2మీటర్ల పొడవు 44.315 మీటర్ల ఎత్తులో కట్ట నిర్మించాలని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతి పాదనలు సిద్ధం చేశారు. కానీ ప్రాజెక్టులో తట్ట మట్టి తీయకుండానే రూ.65 కోట్లు ఖర్చు చేశారు. 2005లో రూ.118.95 కోట్లకు గామన్ ఇండియా కంపెనీ టెండరు దక్కించుకుంది. అటవీ శాఖ అనుమతులకు రూ.62.34 కోట్లు, డీపీఆర్, భూసర్వేల ఖర్చుల కోసం రూ2.5 కోట్లు మొత్తం రూ65 కోట్లు ఖర్చు చేసింది. కాగా, 2018లో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ425.16 కోట్లకు.. అనంతరం 2021లో రూ527.66 కోట్లు, ఇప్పుడు ఆ వ్యయం రూ.700.21 కోట్లకు చేరిందే తప్ప ప్రాజెక్టు పనులు నేటికీ ప్రారంభించిన దాఖలాలు లేవు. ప్రాజెక్టు పనులు ప్రారంభించి రైతులకు సాగునీరు, త్రాగునీరు అందించాలని వాజేడు మండల ప్రజలు కోరుతున్నారు.

మోడి కుంట పనులు ప్రారంభించాలి



వాజేడు, వెంకటాపురం మండలాల్లో ప్రారంభించిన ఒక్క ప్రాజెక్టూ పూర్తికాలేదు. పాలెం ప్రాజెక్టు పనులు పూర్తి కాకుండానే రాజకీయ లబ్ధి కోసం హడావుడిగా ప్రారంభించారు. వాజేడు మండలంలోని మోడికుంట ప్రాజెక్టు పూర్త యితే గిరిజన రైతుల పొలాలు సస్యశ్యామలమవుతాయి. ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలి.

చిట్టెం ఆదినారాయణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు

పాలెం ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలి



అసంపూర్తి పనులతో ప్రాజెక్టును హడావుడిగా ప్రారం భించారు. కాలువలు అసంపూర్తిగా దర్శనమిస్తు న్నాయి. ప్రతి ఏడాది కాలువకు ప్రాజెక్టు ప్రధాన కాలువలకు గండ్లు పడి రైతుల పంట పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయి. ప్రాజెక్టు కాలువ పనులు పూర్తి చేయాలి. కాలువ మరమ్మతులు చేపట్టి రైతులకు సాగు నీరు అందించాలి. ఇరిగేషన్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

నల్లగొండ జిల్లాను సర్వనాశనం చేశారు



ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ దోచుకున్నారు

- ప్రజలకు క్షమాపణ చెప్పాకే నల్లగొండకు రావాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లాను సర్వనాశనం చేసింది కేసీఆరే అని, దక్షిణ తెలంగాణను నట్టేట ముంచి ఇక్కడ ప్రస్తుతం తాగునీరు లేకపోవడానికి కారణమయ్యారని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కుర్చీ వేసుకుని ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తామని చెప్పిన కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. కాళేశ్వరం కంటే ఏడాది ముందు మొదలుపెట్టిన డిండి ప్రాజెక్ట్ ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. 10 ఏండ్లలో ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ దోచుకున్నారని, ఏనాడూ ప్రాజెక్టులను సందర్శించలేదని విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో సోమవారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. 811టీఎంసీల కృష్ణానీటిలో తెలంగాణకు 299టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ వాటా 512 టీఎంసీల చొప్పున పంచుకోవాలని 2015 జూన్ 18, 19 తేదీల్లో జరిగిన కృష్ణారివర్ బోర్డు మేనేజ్‌మెంట్ సమావేశంలో ఒప్పందంపై సంతకం చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాజకీయ అనుభవం లేని, సాయంత్రం పూట కంపెనీ ఇచ్చే పనికిమాలిన వ్యక్తికి మంత్రి పదవి ఇచ్చారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయలను దోచుకున్నారని ఆరోపించారు. సూర్యాపేటలో కలెక్టర్ కార్యాలయాన్ని ఎస్పీ ఆఫీస్ పక్కన అసైన్డ్ భూముల్లో కట్టి అక్కడా వందల కోట్ల రూపాయలను సంపాదించారన్నారు. సూర్యాపేటలో తాగునీరు లేక నేడు మూసీ నీళ్లనే ప్రజలు తాగే పరిస్థితి దాపురించిందన్నారు. 70 శాతం పూర్తయిన సొరంగాన్ని ముట్టుకోలేదని, 95 శాతం పూర్తయిన బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టును పూర్తి చేయలేదని అన్నారు.

ఉత్తర తెలంగాణలో అవసరం లేకున్నా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, మూడు సంవత్సరాలు గడవక ముందుకే మేడిగడ్డ కుంగిపోయిందని, దీంతో ఇది కమీషన్ల కోసం కట్టిన ప్రాజెక్టు అని ఇట్టే తెలుస్తోందని చెప్పారు. గతంలో మేము కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యాంలు నేటికీ చెక్కుచెదరలేదన్నారు. రెండు లక్షల కోట్లు ఖర్చు పెడితే ఆయకట్టు 96 వేల ఎకరాలకు వచ్చిందని, 4 వేల కోట్లు ఖర్చు పెడితే సొరంగం పూర్తవుతుందని, 30 ఏండ్ల కిందట ఎన్టీ రామారావు తీసిన ఏఎంఆర్పీ మెయిన్ కెనాల్‌కు రూ.500 కోట్లతో లైనింగ్, డిస్ట్రిబ్యూటర్ కెనాల్‌కు రూ.400 కోట్లు కేటాయిస్తే పూర్తయ్యేదని వివరించారు. సొరంగం పూర్తి కాకపోవడం వల్లే నేడు నల్లగొండ జిల్లాకు నీళ్ల లేని కర్మ పట్టిందన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి



డెహ్రాడూన్: అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు నిరసనకు దిగారు. డెహ్రాడూన్‌లోని ఉత్తరాఖండ్ శాసనసభ వెలుపల అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా భద్రతా సిబ్బంది వారిని అదుపు చేసేందుకు ప్రయత్నించగా..స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. హక్కుల కోసం జరిగే పోరాటం విజయం సాధించేదాక వదలమని సంఘం నేతలు స్పష్టం చేశారు.

పసుపునకు మద్దతు ధర రూ.18 వేలివ్వాలి

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి : రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పసుపు పంట క్వింటాలుకు రూ.18వేల మద్దతు ధర నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, పసుపు బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. పసుపు రైతులు, అధికారులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పసుపు పండించిన రైతులకు గిట్టుబాటు ధరలేక అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు. పసుపు పంట ఖరీదైందని, అంతర్జాతీయ మార్కెట్లో మంచి రేటు ఉన్నప్పటికీ దుంప తెగుళ్లు, మర్రాకు తెగుళ్ల వల్ల దిగుబడి 30శాతం తగ్గిపోయిందన్నారు. ఎకరాకు సుమారు రూ.లక్ష 50 వేల వరకు ఖర్చవుతుందన్నారు. అడ్తిదారులు కుమ్మక్కై ధరలను తగ్గించి రైతులను నిలువునా మోసం చేస్తున్నారన్నారు. మార్కెట్‌లో క్వింటాలుకు రూ.8-12వేలు మాత్రమే రైతులకు లభిస్తున్నదన్నారు. తేమ పేరుతో కోతలు పెడుతున్నారన్నారు. రైతులకు పెట్టుబడి కూడా చేతికి రావడం లేదన్నారు. ఈ సంవత్సరం మార్కెట్‌కు 2వేల క్వింటాళ్ల పసుపు పంట వచ్చిందని తెలిపారు. పసుపు కొనుగోళ్లకు పసుపు బోర్డును ఏర్పాటు చేసి దాని ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాలన్నారు. పసుపు మద్దతు ధర రూ.18వేలు నిర్ణయించాలని, పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని రైతులు పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన కనీస మద్దతు ధర హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఆయన వెంట తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.గంగాధరప్పా, పల్లపు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రాములు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.దేవేందర్ సింగ్, ఈ సాయిలు, పసుపు రైతులు ఆకుల నరేష్, కుంట నగేష్‌రెడ్డి, రాజేశ్వర్, గడ్డం పెద్దదేవన్న ఉన్నారు.



బ్యాలెట్ పేపర్ల తారుమారుపై ఆగ్రహం

- ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: బ్యాలెట్ పేపర్లను ప్రెసిడింగ్ అధికారి తారుమారు చేయడం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని సుప్రీంకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఆ ప్రెసిడింగ్ అధికారిని విచారణ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. జనవరి 30న జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికపై దాఖలైన పిటీషన్ విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారి వ్యవహార శైలి చూసి తాను భయపడ్డానని అన్నారు. ఈ నెల 19న విచారణకు స్వయంగా హాజరుకావాలని అధికారిని ఆదేశించారు. చండీగఢ్ మేయర్ ఎన్నికలకు వ్యతిరేకంగా ఆప్ కౌన్సిలర్ కుల్దీప్ కుమార్ టిటా (మేయర్ ఎన్నికల్లో ఓటమి చెందిన అభ్యర్థి) సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చండీగఢ్ కార్పొరేషన్‌లో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు.

వీరిలో బిజెపికి 14 మంది, ఆప్‌కు 13 మంది, కాంగ్రెస్‌కు ఏడుగురు, శిరోమణి అకాలీదళ్‌కు ఒక్కరు ఉన్నారు. అయితే మేయర్ ఎన్నికల్లో ఓటు వేసిన ఆప్, కాంగ్రెస్‌లకు చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్ల బ్యాలెట్ పత్రాలను ప్రెసిడింగ్ అధికారి తారుమారు చేసి వాటి చెల్లవని ప్రకటించారు. తద్వారా కుల్దీప్‌పై బిజెపి అభ్యర్థి మనోజ్ సోంకర్ విజయం సాధించినట్లు డిక్లేర్ చేశారు. ఈ ఎన్నికపై స్టే ఇవ్వాలని కుల్దీప్ ముందుగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నిరాకరించడంతో సుప్రీం కోర్టులో పిటీషన్ వేశారు. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పర్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం ఈ పిటీషన్‌ను విచారించింది. మేయర్ ఎన్నికకు సంబంధించిన రికార్డులు, బ్యాలెట్లు, వీడియోగ్రఫీలను పంజాబ్-హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వద్ద భద్రపరచాలని చండీగఢ్ డిప్యూటీ కమిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ (సీఐటీయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య



నవతెలంగాణ - ముషీరాబాద్

ఈ నెల 16న దేశవ్యాప్తంగా తలపెట్టిన రవాణారంగ కార్మికుల సమ్మె బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్(సీఐటీయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ హైదరాబాద్ కార్యదర్శి అజయ్‌బాబు అధ్యక్షతన సీఐటీయూ సిటీ కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ రౌండ్ టేబుల్ జరిగింది. ఈ సమావేశంలో ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'భారత న్యాయ సంహిత- 2023' చట్టంలో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించిన సెక్షన్స్ 106(1),(2)కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రవాణా కార్మికులు, గ్యాస్, ఆయిల్ ట్రక్కు డ్రైవర్లు వెంటనే ఉద్యమించిన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. ప్రస్తుతానికి ఇవి అమలు చేయడం లేదని, భవిష్యత్‌లో అమలు చేయబోయే ముందు ట్రాన్స్‌పోర్ట్, ట్రేడ్ యూనియన్స్‌తో చర్చించాకే అమలు చేస్తామని కేంద్ర హోంశాఖ సెక్రటరీ అజయ్ బల్ల ప్రకటించారని గుర్తు చేశారు. అందువల్ల దాని ప్రమాదం ఇంకా పోలేదని హెచ్చరించారు. 2024 పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో 106(1),(2)ల సవరణను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్యాబ్ జేఏసీ కోకన్వీనర్ షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ.. భారత న్యాయ సంహిత చట్టంలోని ఈ సెక్షన్స్106 (1),(2) డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయని, కేవలం హైవేలపై మాత్రమే గాక సిటీల్లో, గ్రామాల్లో కూడా వర్తిస్తాయని తెలిపారు. టూ వీలర్ నుంచి ఆటో, క్యాబ్, ట్రాలీ, బస్, స్కూల్ బస్, అంబులెన్స్ సహా అన్ని వాహనాల డ్రైవర్లకు వర్తిస్తాయని వివరించారు. ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ,, ఆల్ ట్రేడ్ యూనియన్స్, అనుబంధ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్, జాతీయ స్థాయి సంఘాలన్నీ దేశవ్యాప్తంగా రవాణా రంగ సమ్మెకు పిలుపునిచ్చాయని.. ఈ సమ్మెకు రాష్ట్రంలో బీఆర్టీయూ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఆర్టీసీ సంఘాలు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు జి.లింగంగౌడ్, ఐఎన్‌టీయూసీ నాయకులు దయానంద్ రామకృష్ణారెడ్డి, బీఆర్‌టీయూ క్యాబ్ సెక్టార్ నాయకులు నగేష్ కుమార్, టీఆర్పీటీయూ నాయకులు కె.సతీష్, టీడీఓప ప్రేమ్‌చంద్ రెడ్డి, సీసీడీప కిరణ్, తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ యూనియన్ నాయకులు గోపాల్ రెడ్డి, బాల్‌రెడ్డి, తెలంగాణ ఆల్ డ్రైవర్స్ యూనియన్ నాయకుల జి.రాజు తదితరులు పాల్గొన్నారు.



మతతత్వ విధానాలను ప్రతిఘటించండి

- మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- 16న సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కాప్రా

కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలను కార్మికులు, ప్రజలు ప్రతిఘటించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల దగ్గరకు వెళ్ళి సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ చేయాలని కార్యకర్తలకు సూచించారు. సోమవారం హైదరాబాద్ చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని ఎపిరాకు మైనింగ్ ఇండియా కంపెనీ వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతోందని, అయినా రైతాంగ, కార్మికవర్గ, ప్రజల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. మోసపూరిత విధానాలతో ఇంకా కాలం వెళ్లదీస్తోందన్నారు. గత 50 సంవత్సరాల కన్నా నిరుద్యోగం ఎక్కువగా పెరిగిందని, శ్రామికుల నిజ వేతనాలు ఇరవై శాతం తగ్గిపోయాయని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. అధికారానికి రాకముందు ధరలను నియంత్రిస్తామని చెప్పిన బీజేపీ ఇప్పుడు విచ్చలవిడిగా ధరలు పెంచిందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నియంత్రించకపోగా వాటిపై 243 శాతం పన్ను వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, ఎపిరాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బివి. సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన వీరయ్య, ఆఫీస్ బేరర్స్ కోదండరామ్, శివ, మల్లిఖార్జున్, గంప నారాయణ, పవన్, శ్రీనివాసు, శివప్రా క్రేన్స్ ప్రధాన కార్యదర్శి ఎండి.రసూల్ పాల్గొన్నారు.

షాపింగ్ మాల్ పై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

- కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన యాజమాన్యం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హైదరాబాద్ కూకట్‌పల్లిలో విషాదం చోటుచేసుకుంది. ది చెన్నై సిల్క్స్ షాపింగ్ మాల్‌లో హౌస్ కీపింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళ అదే మాల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన రమణమ్మ (50) ఐదేండ్లుగా కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ది చెన్నై సిల్క్స్ షాపింగ్ మాల్‌లో హౌస్ కీపింగ్ ఉద్యోగం చేస్తోంది. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లిన ఆరో అంతస్తు పైకి ఎక్కి కిందకు దూకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, మృతురాలి బంధువులు షాపింగ్ మాల్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోయిజ్, బీజేపీ నాయకులు కిషోర్ అక్కడకు చేరుకుని వారికి మద్దతుగా నిలిచారు. చివరకు షాపింగ్ మాల్ యాజమాన్యం మృతురాలి కుటుంబానికి రూ.3 లక్షలు సహాయం చేసింది. రమణమ్మ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

భయంతో కేటీఆర్, హరీశ్ రావు

- చారగొండ వెంకటేష్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దోచుకున్న సొమ్మును కక్కిస్తామన్న భయంతోనే బీఆర్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు పిచ్చి, పిచ్చిగా మాట్లాడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు చారగొండ వెంకటేష్, పున్న కైలాష్ నేత విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టులపై శాస్త్రీయ ఆధారాలతో మాట్లాడారని తెలిపారు. బాల్క సుమన్‌కు రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదని తెలిపారు. బాల్క సుమన్ దళిత ద్రోహి అని విమర్శించారు. బాల్క సుమన్‌కు వేల కోట్ల రూపాయలు ఎక్కడ్నుంచి వచ్చాయని వారు ప్రశ్నించారు. అమరవీరుల స్థూపం దగ్గర చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు.

అప్పులు చేసి అన్నం పెడుతున్న అమ్మలు

- ఆర్థిక కష్టాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- ఐదు నెలలుగా వేతనాల్లేవ్..
- మార్కెట్‌లో పెరిగిన గుడ్లు, నిత్యావసరాల ధరలు
- రూ.5కే రెండు సార్లు గుడ్లు పెట్టాలనడం భావ్యమా..
- కనీస వేతనం రూ.26 వేలివ్వాలని డిమాండ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'మేం తిన్నా తినకపోయినా అప్పులు చేసి పిల్లలకు అన్నం పెడుతున్నాం. ఐదు నెలలుగా జీతాల్లేవు. రూ.5 ఇచ్చి వారానికి రెండు గుడ్లు పెట్టాలంటే ఎట్ల..? మార్కెట్లో కూరగాయలు, గ్యాస్, నూనెలు, పప్పులు, గుడ్ల ధరలు మండిపోతున్నాయి. అయినా పిల్లల కడుపు నింపుతన్నం. బిల్లులు సమయానికి రావట్లేదు. సర్కారిచ్చే రూ.3 వేలతో బతికేదెట్ల..? ఉచితంగా గ్యాస్ ఇవ్వాలి. కనీస వేతనం రూ.26 వేలివ్వాలి. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలేమీలేవు. కనీసం మేమెరమనేది చెప్పుకోడానికి గుర్తింపు కార్డులైనా ఇవ్వట్లేదు. గత ప్రభుత్వంలో ఎంతో కొట్లాడినం. ఈ ప్రభుత్వమైనా మా గోడు పట్టించుకోవాలి..' ఇదీ..! మధ్యాహ్న భోజన కార్మికుల ఆవేదన.



పాఠశాల విద్యను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆయా ప్రభుత్వాలు పలు పథకాల్ని అమలు చేస్తూ వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు తాజాగా వండిన మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో అమలవుతున్న పథకమిది. తెలంగాణలోని ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రతి స్కూల్స్‌లో వంటలు వండి పెట్టే పనిని సమభావన గ్రూపుల్లోని మహిళా ఏజెన్సీలకు అప్పజెప్పారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు అల్పాహార పథకాన్ని కూడా ప్రారంభించింది. ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఇద్దరు ముగ్గురు చొప్పున మధ్యాహ్న భోజన కార్మికులున్నాయి. మూడు జిల్లాల్లో కలిపి 3500 మంది వరకు కార్మికులున్నారు. వీరికి ప్రభుత్వం గౌరవ వేతనంగా నెలకు రూ.వెయ్యి ఇచ్చేది. అనేక ఏండ్లు పోరాడిన ఫలితంగా మూడు వేలు ఇస్తోంది. అయితే, ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు ఇవ్వట్లేదు. పెంచిన వేతనమూ దక్కట్లేదు.

సంగారెడ్డి జిల్లాలో 1262 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా.. వీటిల్లో 1.35 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మెదక్ జిల్లాలో 923 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా, వీటిల్లో 85 వేల మంది, సిద్దిపేట జిల్లాలో 976 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా 93 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజన పథకం కింద ఒక్క పూట భోజనం అందిస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల ఏజెన్సీకి ప్రభుత్వం నుంచి ఉచిత బియ్యం సరఫరా చేస్తారు. కూరగాయలు, గుడ్లు, గ్యాస్ ఏజెన్సీ వాళ్లే కొనుగోలు చేసుకుని వంట వండి పెడుతున్నారు. అయితే, వారికి నెల నెలా రావాల్సిన బిల్లులు రావడం లేదు. నాలుగైదు నెలలకోసారి బిల్లులిస్తుండటంతో ఏజెన్సీ వాళ్లు భోజనానికి కావాల్సిన కూరగాయలు, పప్పులు, నూనెలు, గుడ్లు, గ్యాస్‌ను ఖాతా మీద కొనుగోలు చేస్తున్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో దుకాణాదారులు సరుకులివ్వట్లేదు. దీంతో ఏజెన్సీ వాళ్లు ప్రయివేట్‌గా అప్పులు తెచ్చి పిల్లలకు భోజనం పెడుతున్నారు. అప్పులకు వడ్డీ భారం పెరుగుతుండటంతో అనేక మంది మహిళా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెరుగుతున్న ధరల భారాలు

మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కోసం ఇస్తున్న బిల్లులు మాత్రం పెరగట్లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక కోడి గుడ్డు ధర రూ.7 వరకు ఉంది. ప్రభుత్వం మాత్రం గుడ్డు ధర రూ.5 మాత్రమే చెల్లిస్తోంది. వారానికి ఒక గుడ్డు పైసలు రూ.5 మాత్రమే ఇస్తూ ఏజెన్సీలను మాత్రం రెండు గుడ్లు వండి పెట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఐదు రూపాయలకు ఒక గుడ్డు రాని పరిస్థితి ఉంటే.. రెండు గుడ్లు ఎలా తెచ్చి పెట్టగలమని ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలివ్వాలని ఎప్పటి నుంచో పోరాడుతున్నారు. ఉద్యోగులుగా గుర్తించి.. ప్రమాద బీమా వర్తింపజేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సబ్సిడీ గ్యాస్ ఏజెన్సీలకూ ఇవ్వాలని కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలి: జి.సాయిలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలివ్వాలి. ఐదు నెలలుగా పెంచిన వేతనాలివ్వట్లేదు. కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులివ్వట్లేదు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయల్లేవు. కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నా ఎలాంటి బీమా సదుపాయం అందట్లేదు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం.

ఓట్ల కోసం శ్రీరాముడి పేరు దుర్వినియోగం

- రాష్ట్రాలను ఆర్థికంగా కుంగదీస్తోన్న కేంద్రం : రాష్ట్రపతి ప్రసంగంపై సీపీఐ(ఎం) ఎంపీ బ్రిట్టాస్



న్యూఢిల్లీ: రాష్ట్రాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆర్థికంగా కుంగదీస్తోందని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. సోమవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో జాన్ బ్రిట్టాస్ మాట్లాడారు. దేశాన్ని విభజించి చీకటి మధ్య యుగంలోకి నెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీన్ని దేశ ప్రజలు అనుమతించరని అన్నారు. అయోధ్యలో జరిగిన ప్రాణ ప్రతిష్ఠ వేడుకను మోడీ ప్రభుత్వం ఎన్నికల ప్రయోజనాల కోసం రాజకీయ కార్యక్రమంగా మార్చిందని విమర్శించారు. ఓట్ల కోసం శ్రీరాముడిని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'రాష్ట్రపతి ప్రసంగంలో అయోధ్య మూడుసార్లు ప్రస్తావనకు వచ్చింది. రాముడు అందరికీ చెందినవాడు. కరుణకు, సామరస్యానికి, ప్రేమకు ప్రతీక అయిన గాంధీజీ, రాముడు అందరివారు. కానీ మీరు దాన్ని విస్మరించారు. అయోధ్య వేడుకను బహిష్కరించడంపై ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారు. శంకరాచార్యులు ఎందుకు బహిష్కరించారు? ఇదంతా రాజకీయ డ్రామా కాబట్టే వారు పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదు' అని అన్నారు. 'మరి వారి వెంట కూడా ఈడీ, ఇతరులు వస్తారేమో చూడాలి. బీజేపీ సభ్యులంతా సుప్రీంకోర్టు గురించే మాట్లాడుతున్నారు. బాబ్రీ కూల్చివేత చట్టవిరుద్ధమని, నేరపూరిత చర్య అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఆ విషయాన్ని బీజేపీ సభ్యులు మరిచిపోతున్నారు. ప్రధాని అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ చేయకూడదు. ప్రాణం పోసుకోవాల్సింది ప్రజలే. ఆయన మణిపూర్ వెళ్లి అక్కడి ప్రజల కోసం ప్రాణ ప్రతిష్ఠ చేయాలి. రామ నామాన్ని జపించడం, రావణుడిని అనుసరించడం ద్రోహమని గాంధీ హరిజన్ పత్రికలో రాశారు. రాముడిని మోసం చేయలేరని గాంధీ కూడా రాశారు. శ్రీరాముడిని ముందుకుతెచ్చి ఎన్నికల్లో లబ్ది పొందాలని బీజేపీ చూస్తోంది' అని ఆయన విమర్శించారు'మోడీ ప్రభుత్వం అన్ని సంస్థలనూ నాశనం చేస్తోంది. పార్లమెంట్‌లో చర్చ లేదు. స్టాండింగ్ కమిటీలు సమావేశం కావడం లేదు. బిల్లులు హాట్ కేకుల్లా పాస్ అవుతున్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలో జీడీపీ వృద్ధి రేటు 6.8 శాతం. మోడీ పదేండ్ల పాలనలో జీడీపీ వృద్ధి 5.9 శాతం మాత్రమే. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారనే వాదన కపటమే. నిటి ఆయోగ్ లెక్కల్లో అన్నీ తప్పులే ఉన్నాయి. మరి ఆకలి సూచికలో దేశం ఎందుకు వెనుకబడి ఉంది. ఇతర సూచీల్లో కూడా భారత్ వెనుకంజలో ఉంది. ప్రభుత్వం రాష్ట్రాలను ఆర్థికంగా కుంగదీస్తోంది. దీనికి నిరసనగా కేరళ ప్రభుత్వం మొత్తం ఢిల్లీలో నిరసనకు దిగనుంది. కర్నాటకలో కూడా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అని జాన్ బ్రిట్టాస్ వివరించారు.

ఎన్నికలప్పుడే గుర్తొచ్చామా?

- కరీంనగర్ బీఆర్ఎస్ మీటింగ్‌లో ఓ కార్యకర్త రచ్చరచ్చ
- చెంచాగాళ్లకు పదవులు ఇచ్చారంటూ ఆగ్రహం
- సీనియర్లుగానూ కనీసం పట్టించుకోలేదంటూ ఆవేదన



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

'ఇన్నాళ్లు మమ్మల్ని పట్టించుకోలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ బాధ్యతలు ఇవ్వలేదు. పదేండ్లు అధికారంలో ఉన్నా ఉద్యమకారులకు న్యాయం జరగలేదు. ఇప్పుడు పార్టీ ఓడిపోయినంక మళ్లీ ఎన్నికల కోసం మేము గుర్తుకొచ్చామా?' అంటూ ఓ కార్యకర్త బీఆర్ఎస్ పెద్దలను నిలదీశాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశంలో జరిగింది.

మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతున్న సమయంలో నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన కామారపు శ్యాం అడ్డుకున్నాడు. వేదికపై ఉన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ సహా పలువురు ప్రముఖులను నిలదీశాడు. 'ఉద్యమం అప్పటి నుంచి పని చేస్తున్న నాలాంటి వారికి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గుర్తింపే లేకుండా పోయింది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఇంతకాలం ఎవరెవరో వచ్చారని, ఇప్పుడు ఎంపీ ఎన్నికల కోసం సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల గుర్తించి మాట్లాడుతున్నారంటూ నిలదీశాడు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ సముదా యించే ప్రయత్నం చేసినా వినకుండా సదరు కార్యకర్త పార్టీ నాయకుల తీరును ఎండగట్టాడు. గత ఎన్నికల్లో పని చేసేందుకు తాను, తనలాంటి వారు ముందుకొచ్చినా ఏ బాధ్యతలూ అప్పగించలేదని, అసలైన కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోయిందని అన్నాడు. బయట నుంచి వచ్చిన చెంచాగాళ్లకు ప్రాధాన్యం ఇచ్చారంటూ పరుష పదజాలంతో నిలదీశాడు.

అదే సమయంలో మరో సీనియర్ కార్యకర్త లేచి 'నేను గంగుల కమలాకర్ టిక్కెట్ కోసం ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకున్నాను' అని, అయినా తనను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. దాంతో వారిద్దరినీ కొందరు నాయకులు, పార్టీ శ్రేణులు సముదా యించే ప్రయత్నం చేశారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల, మాజీఎంపీ వినోద్ సహా పలువురు ప్రసంగించారు.

నల్లగొండ పట్టణ బైపాస్ కు రూ.700 కోట్లు

- నాలుగు లేన్లుగా అభివృద్ధి
- 11న కేంద్ర మంత్రి రాక !

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నల్లగొండ జిల్లా పట్టణ కేంద్రం చుట్టూ ఉన్న బైపాస్ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ బైపాస్ రోడ్డు విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. అవసరమైన మేర నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. నల్లగొండ చుట్టూ ఉన్న బైపాస్ రోడ్డు అభివృద్ధికి మరింత సొబగులు దిద్దనున్నారు. ఇందుకోసం కేంద్ర ఉపరితల రవాణాశాఖ నుంచి అనుమతులు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈమేకు ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి, ఉన్నతాధికారులు ఇటీవల పలుమార్లు ఢిల్లీ వెళ్లి వచ్చారు. మళ్లీ బుధవారం వెళుతున్నారు. ఈనెల 11న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీచే అభివృద్ధి పనులకు శంకుస్థాపన వేయించాలని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ఆయన్ను ఆహ్వానించినట్టు తెలిసింది. నల్లగొండ చుట్టూతా బైపాస్ రోడ్డు దాదాపు 15 కిలోమీటర్ల మేర ఉంది. ఈ రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధిచేయాలనే తలంపుతో రోడ్లు, భవనాల శాఖ ఉంది. ఈమేరకు ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించింది. ఇప్పుడు దాన్ని నాలుగు లేన్లుగా మలచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. ఈ నేపథ్యంలో పరిపాలనా అనుమతుల కోసం ప్రభుత్వం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నది. కాగా రూ. 700 కోట్లు ఖర్చవుతాయని అంచనా. ఈ నిధుల్లో రూ. 130 కోట్లు భూసేకరణ కోసం ఖర్చుపెట్టనున్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు, ఇతర విషయాలను దృష్టిలోపెట్టుకుని బైపాస్‌ను నాలుగు లేన్లుగా మార్చనున్నారు. ఈ మేరకు తుది అనుమతుల కోసం రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఐ గణపతిరెడ్డి ఢిల్లీకి వెళుతున్నారు.

ఎట్టకేలకు కదలిక..!

జోడేఘాట్‌లో మొదలైన డబుల్‌బెడ్‌రూంలు

- రూ.2.20లక్షలు అదనంగా పెంచిన ప్రభుత్వం
- సీఎం ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
- ఆగిన నిర్మాణాల పున్ణప్రారంభంతో లబ్దిదారుల్లో ఆనందం

అది పోరాటాల పురిటి గడ్డ.. నిజాం నవాబుపై పోరాటానికి కేంద్ర బిందువు ఆ గ్రామం. ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురంభీం నేలకొరిగిన ఈ గ్రామం ఇప్పటికీ దీనవాస్థలో ఉంది. అక్కడ ఏండ్లుగా నివసిస్తున్న వారికి ఇండ్లు కూడా లేని పరిస్థితి. పూరి గుడిసెల్లో నివాసముంటూ కాలం వెళ్లదీస్తున్న ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ఇండ్ల నిర్మాణాలు.. తాజాగా కొత్త ప్రభుత్వం తిరిగి ప్రారంభించింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి.. జోడేఘాట్‌లో ఆగిపోయిన ఇండ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దాంతోపాటు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.20లక్షల నిధులు పెంచారు. దీంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చి.. నిర్మాణాలను పున:ప్రారంభించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కెరమెరి

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్ చిన్న గ్రామం. మన్యం వీరుడు కుమురంభీం నేలకొరిగిన గ్రామం. ప్రతి ఏటా కుమురంభీం వర్ధంతి రోజు అనేక మంది ఈ గ్రామానికి వెళ్లి భీం విగ్రహానికి నివాళులర్పిస్తుంటారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కొలువుదీరిన బీఆర్ఎస్ ప్రభుత్వం జోడేఘాట్‌లో అధికారికంగా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించింది. రూ.25కోట్లతో కుమురంభీం స్మారక స్థూపం, మ్యూజియం, యాంపి థియేటర్, స్మృతివనం, హట్టి నుంచి జోడేఘాట్ వరకు తారు రోడ్డు నిర్మాణం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది. 2016లో మ్యూజియం ప్రారంభోత్సవానికి హాజరైన అప్పటి మంత్రి కేటీఆర్ జోడేఘాట్ వాసులకు 30 డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున కేటాయించారు. 2017లో ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో ఒకరిద్దరు ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. మరికొందరు బేస్‌మెంట్ వరకు.. ఇంకొందరు బేస్‌మెంట్‌కు కూడా డబ్బులు లేని కారణంగా నిర్మాణం చేపట్టలేదు. ఆ సమయంలో అధికారుల సాయంతో వీడీసీ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని భావించినా.. నిధులు రాకపోవడం మూలంగా ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. మిగతా ప్రాంతాల మాదిరిగానే ఈ గ్రామంలోనూ ఐదేండ్లుగా డబుల్ బెడ్‌రూంలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

ఎమ్మెల్యే చొరవ..సీఎం ఆదేశం..!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన కొద్ది రోజుల్లోనే జోడేఘాట్‌లో ఆగిపోయిన ఇండ్ల నిర్మాణాలతో పాటు ఇంద్రవెల్లి అమరుల స్థూపం వద్ద స్మృతి వనం ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇంటి నిర్మాణాలు పూర్తిచేయడంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రత్యేక దృష్టిసారించారు. ఈ విషయాన్ని నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. హుటాహుటిన గ్రామానికి వెళ్లిన జిల్లా ఉన్నతాధికారులు, ఐటీడీఏ అధికారులు సీఎంకు నివేదిక అందించారు. గత ప్రభుత్వం ఒక్కో ఇంటికి కేటాయించిన రూ.5లక్షల నిధులకు తోడు మరో రూ.2.20లక్షలు అదనంగా కేటాయించాలని సీఎం ఆదేశించారు. వెంటనే జీఓ విడుదల కావడంతో అధికారులు గుత్తేదారుతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని ఇండ్లు పూర్తి కావస్తుండగా.. మిగతా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. దీంతో లబ్దిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



చాలా సంతోషంగా ఉంది



ఐదేండ్ల కిందటే ఇంటి నిర్మాణాలు మంజూరైనా నిధులు సరిపోవడం లేదనే కారణంగా ఆగిపోయాయి. పూరి గుడిసెల్లో ఉంటూ చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం అదనంగా రూ.2.20లక్షలు పెంచడంతో మళ్లీ ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. ఇప్పటికైనా సొంతింటి కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది.

-పెందూర్ మారు, జోడేఘాట్

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగడం సంతోషంగా ఉంది. గతంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం అదనంగా మరో రూ.2.20లక్షలు నిధులు పెంచడంతో మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. కానీ వాటి నిర్మాణంలో వాడే సిమెంట్, కంకర, ఇసుకలో నాణ్యత పాటించాలి. సకాలంలో పూర్తి చేసి లబ్దిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

-పెందూర్ రాజేశ్వర్, భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మెన్

అనైతిక పద్ధతుల్లో గద్దె నెక్కేందుకు మోడీ యత్నం

- సంపత్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆయా రాష్ట్రాల్లో అనైతిక పద్ధతుల్లో గద్దెనెక్కాలని ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారని ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సంపత్ మీడియాతో మాట్లాడారు. జార్కండ్ ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో రక్ష కల్పించామనీ, దేశంలో ప్రజాస్వామ్యం గెలుస్తుందని ఆ రాష్ట్రంలో విషయంలో నిరూపితమైందని తెలిపారు. అదే విధంగా ఈ నెల 12న బీహార్‌లో మరోసారి ప్రజాస్వామ్యం గెలుస్తుందని తెలిపారు. ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలకు వచ్చే నెల 11 వరకు హైదరాబాద్‌లో రక్షణ కల్పిస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

బీసీ సంక్షేమానికి రూ.20 వేలకోట్లు కేటాయించండి

- ఆర్థిక శాఖ మంత్రి భట్టికి ఎమ్మెల్సీ కవిత లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ సంక్షేమం కోసం 2024-25 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె లేఖ రాశారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత, బీసీ సంక్షేమానికి రానున్న ఐదేండలో రూ. లక్ష కోట్ల కేటాయింపు, ఎంబీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రతి జిల్లా కేంద్రంలో రూ.50 కోట్ల వ్యయంతో ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యత భవనాల నిర్మాణం, తదితర హామీలను ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ హామీల అమలును ఈ బడ్జెట్ నుంచే చేపట్టాని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ప్రతి ఏటా రూ. 20 వేల కోట్లు అవసరమవుతాయని తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

రోడ్డు ఆక్రమణలను వెంటనే కూల్చివేయాలి



నవతెలంగాణ-హయత్‌నగర్

బాగ్ హయత్ నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో రోడ్డును ఆక్రమిస్తున్నారని కాలనీవాసులు కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి దృష్టికి తీసుకురాగా సోమవారం ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మించి పనులు పూర్తి చేస్తున్నా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదన్నారు. 25 ఫీట్ల రోడ్డును ఐదు ఫీట్లు ఆక్రమించి ఇనుప కంచె ఏర్పాటు చేశారని.. దానికి తోడుగా ఇనుప పట్టీలను భూమిలో పాతడం వల్ల వాహనదారులకు గాయాల పాలయ్యే విధంగా తయారయిందని, పక్కింటి కాంపౌండ్ వాల్‌ను ఆక్రమించి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి పై,అక్రమ నిర్మాణం పై చర్య తీసుకోవాలని కోరారు. రోడ్లను ఆక్రమిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఎంతటి వారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హస్తినాపురం డివిజన్ పరిధి లోని దేవకమ్మ తోట సమీపంలో గల భవిష్య ఇంటర్నేషనల్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దామోదర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నిత్యం యోగా ,వ్యాయామం చేయటం ద్వారా పిల్లలలో మంచి ఎదుగుదల ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలు జరపడం వలన విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గారు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గారు, అకాడమిక్ డైరెక్టర్ గారు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం

మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగిరేనా..!



- సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ సీటు కావడంతో పెరిగిన ఆసక్తి
- దరఖాస్తు చేసుకున్న ప్రముఖులు
- నియోజకవర్గంపై గురిపెట్టిన బీఆర్ఎస్
- సిట్టింగ్ సీటును తిరిగి సాధించాలని కాంగ్రెస్ ప్రయత్నం

నవతెలంగాణ -ఎల్బీనగర్

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్టింగ్ సీట్ కావడంతో మల్కాజిగిరి పార్ల మెంట్ నియోజకవర్గంలో తిరిగి కాంగ్రెస్ జెండా ఎగరవే స్తుందా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థిగా ఎవ్వరిని రంగంలోకి దించుతుందో అని రాష్ట్రంలో ఆసక్తిగా పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నారు.

భారతదేశంలో అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేకపోయింది . ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి మల్కాజి పార్లమెంటు మెంబర్‌గా పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిపై దాదాపు పదివేల ఓట్లతో విజయం సాధించారు. అయితే మల్కాజిగిరి పార్లమెంట్ మెంబర్‌గా రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో తనదైన ముద్ర వేయలేకపోయారని విమర్శలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా రాష్ట్ర రాజకీయాల్లో బిజీగా ఉండడంతో మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రత్యేకంగా దృష్టి సారించలేకపోయారని తెలుస్తోంది. అయితే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించలేకపోతే అది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మైనస్ పాయింట్ గా మారే అవకాశం ఉంది.

మల్కాజిగిరిపై గురిపెట్టిన బీఆర్ఎస్

బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం పై గురిపెట్టింది. గులాబీ జెండా ఎగరవేయాలని ఎత్తులు వేస్తోంది. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఉన్న ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి ,కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఆ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపొందింది. అయితే ప్రస్తుతం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు బలమైన అభ్యర్థి కనిపించడం లేదు. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కేటీఆర్ పోటీ చేస్తారని ప్రచారం కూడా జరుగుతోంది.

పోటీకి పలువురు ప్రముఖుల ఆసక్తి

మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. సినిమా నిర్మాత బండ్ల గణేష్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. అలాగే జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్న కూడా ఇదే స్థానం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే తెలంగాణ రాష్ట్రం నుండి దాదాపు పది నుంచి 12 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించాలని ఢిల్లీ పెద్దలు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించలేక పోతే రేవంత్ రెడ్డికి ఇబ్బందిగా మారే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారని బీఆర్ఎస్ పార్టీ విమర్శించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అందుకే కాంగ్రెస్ బలమైన అభ్యర్థిని దింపడానికి కసరత్తు చేస్తున్నది. ఏదిఏమైనా మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ తిరిగి విజయం సాధించలేకపోతే ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.



దేశంలోనే పెద్ద నియోజకవర్గం మల్కాజిగిరి

భారతదేశంలోని అతిపెద్ద నియోజకవర్గంగా మల్కాజిగిరి నియోజకవర్గం పేరు సంపాదించుకుంది. 15వ లోకసభకు 2009లో జరిగిన ఎన్నికల్లో సర్వే సత్యనారాయణ కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 201లో 16వ లోక్ సభకు జరిగిన ఎన్నికల్లో అప్పటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి విజయం సాధించారు. 17వ లోకసభకు జరిగిన ఎన్నికల్లో 2019లో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

2002లో ఏర్పాటైన డీలిమిటేషన్ కమిషన్ సిఫారసు ఆధారంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజ కవర్గం ఏర్పడింది. మల్కాజిగిరి నియోజకవర్గంలో షాపింగ్ మాల్స్ సినిమా థియేటర్స్, హోటల్స్, టింబర్ డిపోలు, కమ్యూనిటీ హాల్స్, అతి పెద్ద అపార్ట్మెంట్స్ తోపాటు రక్షణ దళాలున్న కంటోన్మెంట్ ఏరియా కూడా ఉంది.



యువత ఉపాధి అవకాశాలు కల్పించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

నేటి సమాజంలోని నిరుద్యోగ యువత వృత్తి, వ్యాపార రంగాల్లో రాణించి కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు.సోమవారం బడంగ్ పేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వీరభద్ర టిఫిన్ సెంటర్‌ను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చదువుకున్న యువత ఉద్యోగ అవకాశాలు కల్పించటంతో పాటు, వత్తి వ్యాపార రంగంలో రాణించటం కోసం చేయూత నివ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఎదురు చూడకుండా స్వయంగా వత్తి, వ్యాపార రంగంలో రాణించి కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్ద బావి సుదర్శన్ రెడ్డి,రాళ్ళగుడం సంతోష శ్రీనివాస్ రెడ్డి, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్

నవతెలంగాణ- నాగోల్

నాగోలు డివిజన్‌లో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అధికారులకు సూచించారు. సోమవారం కార్పొరేటర్ జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ కష్టయ్య, డీజీఎం మాధవి లతో కలిసి బండ్లగూడలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను ఆలస్యం చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవు తాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని నిర్మాణ పనులలో వేగం పెంచి త్వరలో పూర్తిచేసి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏరియా మేనేజర్ అలేఖ్య, నాయకులు శివ, రాజు ,ఎస్ఎన్‌డీపీ అధికారులు, ఆయా కాలనీలవాసులు ,తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పింఛన్ పంపిణీ

నవతెలంగాణ-నాగోల్

ఖైరతాబాద్‌లో గల వాసవి కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా వద్దులకు పింఛను డబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతినెలా 5వ తేదీన సుమారు 500 మందికి రూ. 1200 చొప్పున పంపిణీ చేసి వద్దుల జీవనానికి ఆసరగా నిలుస్తున్నటు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వాసవి సేవాకేంద్రం ప్రెసిడెంట్ రమేష్, కొండ్లే మల్లికార్జున్, జ్ఞాన చందర్ జనరల్ సెక్రెటరీ, ట్రెసరర్ నరేందర్ గుప్త, ఉప్పల రాజేశ్వర్ గుప్త, వాసవి సేవా కేంద్రం కమిటీ సభ్యులు ప్రభాకర్ గుప్తా, సదనందు గుప్త, వనం యాదయ్య,రవీందర్ గుప్తా ,సాంబయ్య, సభ్యులు, ట్రస్ట్ మేనేజ్మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నేటి సదస్సును విజయవంతం చేయాలి

- సీఐటీయూ రంగారెడ్డి ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి

నవతెలంగాణ-హాయత్ నగర్

ఆటోనగర్ లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం, ఆటోనగర్ మెకానిక్ అండ్ టెక్నికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) ఉదయం10 గంటలకు సదస్సు జరుగుతుందని దీనికి ఆటోనగర్ లోని మెకానికల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు లారీ ఓనర్ సంక్షేమ సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి వైస్ ప్రెసిడెంట్ కీసరి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్‌లో మెకానిక్ షర్ప్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వద్దకు వెళ్లి కలిసి కరపత్రములు పంపిణీ చేశారు. ప్రమాదాలు తగ్గించాలనే సాకులు చూపుతూ కేంద్ర ప్రభుత్వం ఎంవీ యాక్ట్ 2019ను తీసుకువచ్చింది కానీ చిన్న చిన్న పొరపాట్లను వేలాది రూపాయల జరిమానాలతో వసూలు చేయడానికి పూనుకుందన్నారు. ఎంవీ యాక్ట్ 2019ను రద్దు చేయాలని నాలుగేండ్ల నుంచి కార్మికులు, లారీ యజమానులు పోరాడుతున్నా ప్రధాని మోడీ పట్టించుకోకుండా పుండు మీద కారం చల్లినట్టుగా భారత న్యాయ సంహిత చట్టాన్ని తెచ్చారన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రక్షణ కోసం స్పాట్ నుంచి డ్రైవర్ వెళ్లిపోతే హిట్ రన్ కేసుగా పరిగణించి సెక్షన్ 106(1)(2) ద్వారా 10 సంవత్సరాల శిక్ష, రూ. 10 లక్షల జరిమానాలకు బీజేపీ ప్రభుత్వం చట్టాన్ని తెచ్చిందన్నారు. దీనితో ట్రాన్స్‌పోర్ట్ రంగంలో కార్మికులు చిన్న యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దానిని ఎదుర్కొనుటకు జరుగు సదస్సును అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ మెకానికల్ టెక్నికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నందగిరి ఆంజనేయులు, లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండి సలావుద్దీన్ పాల్గొన్నారు.

పోలీస్ అభ్యర్థులకు మెడికల్ పరీక్షలు



నవతెలంగాణ - ధూల్‌పేట్

పోలీస్ ఉద్యోగాల కోసం ఎంపికైన అభ్యర్థుల మెడికల్ పరీక్షలు ఉస్మానియా ఆస్పత్రిలో నిర్వహించారు. మొదటి రోజు ప్రారంభమైన పోలీసుల మెడికల్ పరీక్షలను పోలీస్ ఉన్నతాధికారులతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ ఆర్ఎంఓ లతో కలిసి పర్యవేక్షించారు.

విన్నపాలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్
- జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రోస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వ్యక్తిగత, సామాజిక విన్నపాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో 188 దరఖాస్తులు స్వీకరించారు. ఫోన్ ఇన్ కార్యక్రమంలో 18 కాల్స్ స్వీకరించారు.

ప్రజల నుంచి ఆయా సమస్యలపై వచ్చిన విన్నపాలను ఎన్ని రోజుల్లో పరిష్కారం అవుతుందో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అదే సమస్య పై తిరిగి అర్జీ సమర్పించిన పక్షంలో సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. సర్కిల్, జోనల్ స్థాయిలో కూడా ప్రజావాణి జరుగుతున్నందున వ్యయప్రయాసలకు గురై హెడ్ ఆఫీస్ కు రావద్దని ప్రజలను కోరారు. సర్కిల్ జోనల్ స్థాయిలో సమస్య పరిష్కారం జంగని వారు మాత్రమే ఇక్కడికి రావాలని కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసి మెసేజ్ అర్జీదారునితో పాటుగా సంబంధిత శాఖ హెచ్.ఓ.డికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అధికారులు ఎన్ని పరిష్కారం చేశారో నివేదిక తో తిరిగి ప్రజావాణికి హాజరయ్యే విధంగా

జోనల్ కార్యాలయాల్లో ప్రజావాణి




నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన కార్యక్రమంలో పలు సమస్యల పై బాధితులు ఫిర్యాదులు చేశారు. జోనల్ కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయములలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమము నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయంలోని సెక్షన్ అధికారులందరూ పాల్గొన్నారు. మొత్తం 26 దరఖాస్తులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 9 దరఖాస్తు లు రాగా ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 15 దరఖాస్తులు వచ్చాయి. శానిటేషన్ సమస్యపై 1 దరఖాస్తు, ఆర్‌టీఐ కోసం 1 ఫిర్యాదు వచ్చింది. సమస్యలు వెంటనే పరిష్కరించాలని జోనల్ కమిషనర్ పంకజం అధికారులను ఆదేశించారు.

చార్మినార్ జోనల్ కార్యాలయంలో..

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణ లో సోమవారం చాంద్రాయణ గుట్ట సర్కి ఫూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫలక్‌నుమా సర్కిల్ కి చెందిన పారిశుధ్య సమస్య పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీంచి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, జోన్ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ (యూ బి డి) అమీనా బీ, ఎ. యం సీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కామినేనిలో
అధునాతన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-హయత్‌నగర్

రక్త సంబంధిత వ్యాధుల చికిత్స కోసం అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను కామినేని హాస్పిటల్స్ ప్రారంభించింది. సోమవారం ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో ఇది ప్రారంభమైంది. రక్త క్యాన్సర్ అనేది రక్తం, ఎముక మజ్జ లేదా శోషరస వ్యవస్థను ప్రభావితం చేసే ఒక రకమైన క్యాన్సర్. ఇందులో లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా వంటి వివిధ రకాల రక్త క్యాన్సర్లను మాత్రమే కాకుండా, అప్లాస్టిక్ అనీమియా, ఇమ్యునో డెఫిషియెన్సీ డిజార్డర్స్, జెనెటిక్,మెటబాలిక్ డిజార్డర్స్, ఆటో ఇమ్యూన్ డయోడర్స్ వంటి క్యాన్సర్ కాని రక్త రుగ్మతలకు కూడా ఒకే దగ్గర చికిత్స అందించగల ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలతో ఈ అత్యాధునిక బోన్ మ్యారో అండ్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసామని కామినేని హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గాయత్రీ అన్నారు. తదనంతరం ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రక్తహీనతలు పెరుగుతున్న నేపథ్యంలో అధునాతన చికిత్సా కేంద్రాల ఏర్పాటు ఎంతో కీలకం. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆవిష్కరణలో ఉన్నతమైన వైద్యం అందించడంలో మా అంకితభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ స్థాయి వైద్య సేవలను వికేంద్రీకరించడం ద్వారా, సమాజంలోని అన్ని రకాల రుగ్మతలకు గురైన రోగుల ప్రాణాలను రక్షించేదుకు సకాలంలో వైద్యం అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు. బీఎమ్‌టీ విభాగం డైరెక్టర్ డాక్టర్ సచిన్ జాదవ్ మాట్లాడుతూ, "భారతదేశం రక్త సంబంధిత వ్యాధుల పెరుగుదలను ఎదుర్కొంటోంది, అధునాతన చికిత్స సౌకర్యాల తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతోంది. మా కొత్తగా ప్రారంభించబడిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ అత్యాధునిక సాంకేతికత ప్రత్యేక నైపుణ్యంతో ప్రాణాంతక,నిరపాయమైన రక్త సంబంధిత రుగ్మతలతో పోరాడుతున్న రోగులకు సమగ్ర సంరక్షణను అందించడానికి రూపొందించబడింది. రోగి ఫలితాలను మెరుగుపరచడం వారి జీవన నాణ్యతను మెరుగుపరచడమే మా లక్ష్యం " అని అన్నారు.ఎముక మజ్జ మార్పిడి ప్రాముఖ్యతను వివరిస్తూ, "ఎముక మజ్జ మార్పిడి అనేది బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులను రక్షిం చడంలో వైద్యపరమైన పురోగతికి పరాకాష్టగా నిలుస్తుంది. ఇందులో దెబ్బతిన్న లేదా వ్యాధికి గురైన మజ్జను ఆరోగ్యకరమైన మూలకణాలతో భర్తీ చేయడం, ఉత్పత్తిని పెంపొందించడం వంటివి ఉంటాయి. కొత్త రక్త కణాలు, మజ్జ పునరుత్పత్తిని సులభతరం చేస్తుంది." అని తెలిపారు.

ట్రంక్ లైన్ పనుల్లో వేగం పెంచండి

- ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నవతెలంగాణ-హాయత్‌నగర్

ప్రజల కోసం చేపడుతున్న ట్రంక్ లైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ట్రంక్ లైన్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇట్టి ట్రంక్ లైన్ ఈ కాలనీ గుండా మదర్ డైరీ నుంచి కుంట్లూరు వరకు కలపడం జరుగుతుందని తెలిపారు. అయితే మదర్ డైరీ అట్టి ట్రంక్ లైన్ లోపల నుండి తీసుకెళ్లడానికి అనుమతి ఇవ్వడం లేదని.. మరోదారి గుండా తీసుకెళ్లడానికి అవకాశం లేదని లెవెల్స్ కూడా కలవవు అన్నారు. కావున ఎట్టి పరిస్థితుల్లో మదర్ డైరీ లో నుంచి ట్రంక్ లైన్ తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మదర్ డైరీ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా అవసరాల కోసం ఇట్టి ట్రంక్ లైన్ నిర్మించడం జరుగుతుందన్నారు. కావున అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి,హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్,వాటర్ వర్క్స్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి,నాయకులు లక్ష్మణ్,ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి



- ఆర్టీవో సుభాష్ చంద్ర రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

వాహన డ్రైవర్లు అందరూ క్రమం తప్పకుండా కంటి చూపు పరీక్షు చేయించుకోవాలని మలక్‌పేట్ ఆర్టీవో సుభాష్ చంద్ర రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మలక్‌పేట్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఈ శిబిరాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. గ్లోబల్ ఐ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల్ రావు ఆధ్వర్యంలో క్యాబ్, ఆటో, ఇతర వాహన డ్రైవర్లతో పాటు వాహనదారులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ డ్రైవర్లు ప్రతీ సంవత్సరం కంటి పరీక్షలు విధిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమేష్ బాబు, అరుణ, ఉమ, నరేంద్రపాల్ సింగ్, ఏఎంవీఐ రజినీ, సైద, ఏవోలు విజయ్, ప్రవీణ్, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-నాగోల్

గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 10:00 గంటల ప్రాంతంలో నాగోల్‌లో చౌరస్తాలో గుర్తుతెలియని 60 సంవత్సరాల వ్యక్తి స్పృహ కోల్పోయి పడిపోయి ఉన్నాడు. వెంటనే అక్కడున్న వారు గుర్తించి స్పృహ కోల్పోయిన వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందినట్టు ఆసుపత్రి వైద్యులు తెలిపినట్టు నాగోల్ పోలీసులు పేర్కొన్నారు. మృతుడి చిరునామా తెలిసినచో 8712662751, 871262752 సెల్ ఫోన్ల ద్వారా నాగోల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- నక్షత్ర హాస్పిటల్స్ సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఎండీ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామనిసూట్స్ కేర్ నెట్‌వర్క్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ప్రజాజీవనం మారుతున్న కాలానుగుణంగా వ్యాధులు రూపాంతరం చెందుతూ వైద్యానికే సవాలు విసురు తున్నాయని ఇలాంటి తరుణంలో పేద మధ్యతరగతి ప్రజలకు అతితక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సదుపా యాలు అందించాలని లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు నేడు దేశంలో పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం ప్రతీ సంవత్సరం ప్రజల తలసరి ఆదాయంలో అధిక మొత్తం వైద్య ఆరోగ్య సంరక్షణకు ఖర్చు కావడంతో లక్షలాదిమంది పేదరికంలో మగ్గుతున్నట్టు తెలిపారు. డబ్ల్యూహెచ్ఓ ప్రాంతీయ సలహాదారు కథ్లీన్ ఏ హాలో నే సెంటర్ ఫర్ డీసీ కే డైనమిక్స్ ఎకనామిక్స్ పాలసీ నివేదిక ప్రకారం సుమారు 63 శాతం భారతీయులు ప్రతీ సంవత్సరం వైద్య ఆరోగ్య సంరక్షణకు ఖర్చు చేస్తున్నారని అన్నారు. పోరుగుదేశాలైన చైనా బంగ్లాదేశ్ శ్రీలంక భూటాన్ వంటి దేశాలను పరిశీలిస్తే ప్రపంచంలో195 దేశాల్లో మన భారత దేశం 145వ స్థానంలో ఉందని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సంరక్షణ సౌలభ్యంతో స్థితిగతులను అధ్యయనం చేశారని అన్నారు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు తీసుకురా వాలనే ప్రయత్నం గా సుట్స్ కేర్ నెట్వర్క్ సంస్థను స్థాపించామని అన్నారు తమ హాస్పిటల్ నందు నైబర్ కార్డు ప్రవేశ పెట్టామని అన్నారు ఈ కార్డు తీసుకున్న వారికి కుటుంబ మొత్తానికి 12 ఓపీలు ఉచితం , ఇన్వెస్టిగేషన్ టెస్ట్‌లో 15 శాతం రాయితీ ఇస్తున్నామని, ఫార్మసీలో 10 శాతం రాయతీ ఫిజియోథెరపీలో 15 శాతం రాయితీ ఇస్తున్నామని అన్నారు. తమ హాస్పిటల్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో అంబులెన్స్ ఉచిత సర్వీసులు అంది స్తున్నామని అన్నారు. నైబర్ కార్డు అందరూ వినియో గిం చుకోవాలని ఒకసారి నైబర్ కార్డులో రిజిస్ట్రేషన్ చేసుకుంటే సంవత్సరం వరకు ఉపయోగిం చుకోవచ్చని అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-ఉప్పల్
మంగళవారం | ఫిబ్రవరి 06, 2024 | www.navatelangana.com

సేవరత్న నేషనల్ అవార్డుకు ఎంపికైన మామిడాల సంతోష్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్ చెందిన మామిడాల సంతోష్ రెడ్డి సేవారత్న నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ తెలిపారు. సోమవారం అవార్డు ఆహ్వాన పత్రాన్ని ఆయనకు అందజేశారు. మామిడాల సంతోష్ రెడ్డి సంఘ సేవకులుగా, మాజీ సైనిక అధికారిగా పని చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న బహుజన రైటర్స్ ఏడవ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సమావేశంలో మామిడాల సంతోష్‌రెడ్డికి సేవారత్న అవార్డును అందజేయనున్నట్లు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు గౌతం, రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమాన్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

● ఉప్పల్ ఆర్టీవో రవీందర్ కుమార్



నవతెలంగాణ-ఉప్పల్

ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉప్పల్ ఆర్టీఓ రవీందర్ కుమార్ తెలిపారు. సోమవారం రోడ్డు భద్రత వారోత్స వాల్లో భాగంగా ఉప్పల్‌డిపోలో ఆర్టీసీ బస్ డ్రైవర్లకు ఉప్పల్ ఆర్టీవో రవీందర్ కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డిపో మేనేజర్ శ్రీనివాస్, ఏఎంవీఐలు అమృత వర్షిని, చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రాణం ఎంతో విలువైందని, బస్సు డ్రైవర్ల చేతులో వందలాది మంది ప్రజల ప్రాణాలు ఉంటాయని, రోడ్డు భద్రతను పాటించడం వల్ల సురక్షితంగా గమ్యం చేరుకుంటారన్నారు. ట్రాఫిక్ నియమాలను తూచ తప్పకుండా పాటించి ప్రజల ప్రాణాలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

'ఉప్పల్'ను అభివృద్ధి పథంలో నడిపిస్తా

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తా అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ డివిజన్ ఎస్‌వీ నగర్ కామన్ వద్ద డ్రయినేజ్ పైపు లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివద్దే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానన్నారు. ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివద్ధి చేస్తా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై ఏఈతో కార్పొరేటర్ సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ ఇంజనీరింగ్ ఏఈ కీర్తితో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సోమవారం సమీక్ష నిర్వహించారు. డివిజన్ లో నెలకొన్న పెండింగ్ పనులు.. గాంధీ నగర్ కల్వర్టు, ఐజీ కాలనీ అప్రోచ్ రోడ్డు, సైడ్ వాల్, కుషాయిగూడ లోని రోడ్లపై చర్చించి కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోయే బడ్జెట్‌లో డివిజన్ లోని మిగతా కాలనీలో మిగిలిన రోడ్లపై అంచనాలు రూపొందించి జోనల్ కమిషనర్‌కు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-కాప్రా

కాలనీలోని భూగర్భ డ్రయినేజీ సమస్య పరిష్కారానికి రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రయినేజీ పనులను సోమవారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ పర్యవేక్షించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని తొందరలోనే పూర్తి చేసి రోడ్డు కూడా వేయిస్తామని కాలనీవాసులకు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేకర్, సువర్ణ, సుగుణాకర్ రావు, కట్ట బుచ్చన్న గౌడ్, వాసు, సివరేజ్ సూపర్వైజర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఉదయ్ కిరణ్ కుమార్



నవతెలంగాణ-కాప్రా

కాంగ్రెస్ హెచ్‌బీకాలనీ-మీర్పేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఉదయ్ కిరణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సీనియర్ నాయకులు జలగం వెంకటేష్ సమక్షంలో డివిజన్ అధ్యక్షులు పోలెపాక అంజయ్య, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ రెడ్డిలు ఉదయ్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా అంజయ్య, గుర్రాల సంతోష్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కూడా ప్రజలకు చేరాలని, డివిజన్ లో ఉన్న ప్రజా సమస్యల అన్నిటికీ పరిష్కారాలు చూపుతూ ,అభివద్ధి పనులు చేపడుతూ త్వరలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

రసీదు ఇవ్వడం లేదని మున్సిపల్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-ఘట్కేసర్

ఇంటి పన్ను కట్టిన రసీదు ఇవ్వడం లేదని ఘట్కేసర్ మున్సిపల్‌లో ఓ ఇంటి యజమాని ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని మైసమ్మ గుట్ట బైపాస్ పక్కన 200 గజాల్లో ఓ ఇల్లుకు సంబంధించిన ఇంటి పన్ను రూ. 48 వేలు ఘట్కేసర్ మున్సిపల్ లో గత జులై 19న సంబంధిత సిబ్బందికి చెల్లించారు. అయితే దానికి సంబంధించిన రసీదు ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని బాధితుడు సోమవారం ఘట్కేసర్ మున్సిపల్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులను ఇంటి యజమాని నిలదీయడంతో ఆ వార్డుకు సంబంధించిన కౌన్సిలర్‌కు డబ్బులు ఇచ్చామని అతని వద్ద తీసుకోవాలనిలో అధికారి వివరించినట్టు ఇంటి యజమాని తెలిపారు అధికారులు స్పందించి వెంటనే తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.



రైల్వే బోర్డు మెంబర్‌గా నియమితులైన ఎం లక్ష్మణ్ గౌడ్, కొమ్ము నర్సింగరావు, డి నాదం, బీజేపీ మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ అధ్యక్షులు ఎనుముల మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గోపు రాజేశ్వర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల్ అసెంబ్లీ మీడియా సెల్ కన్వీనర్ తాళ్ల ఆనంద్ గౌడ్, సూరజ్, సహదేవ్ గౌడ్, వి రాంబాబు, శివరాజ్, నవ్య, నర్సింగ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

మున్సిపాల్టీల్లో ముసలం..!

- అవిశ్వాసం దిశగా అడుగులు
- కలెక్టర్‌కు నోటీసు అందజేసిన
- నాగారం, తూంకుంట కౌన్సిలర్లు
- అసంతృప్తిలో మరికొందరు..





నవతెలంగాణ-సిటీబ్యూరో

మున్సిపాల్టీల్లో 'అవిశ్వాసం' మరోసారి తెరపైకి వచ్చింది. అధికార మార్పిడికి అసంతృప్తి తోడు కావడంతో మున్సిపల్ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లను గద్దె దించేందుకు కౌన్సిలర్లు రెడీ అవుతున్నారు. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు అందజేయగా.. మరికొందరు సైతం రెడీగా ఉన్నట్టు సమాచారం. ఎన్నిసార్లు బుజ్జగించినా వినకపోవడంతో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సైతం చేతులెత్తేసినట్టు సమాచారం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 మున్సిపాల్టీలు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ మెజార్టీగా బీఆర్ఎస్‌కు చెందిన చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్లే ఉన్నారు. మున్సిపల్ పాలకవర్గాలు ఏర్పడి నాలుగేండ్లు కావస్తోంది. ఇన్ని రోజులు చైర్మెన్లు, వైస్ చైర్మెన్లపై వ్యతిరేకంగా ఉన్న వర్గాలు ఇప్పుడు అవిశ్వాస తీర్మాణాలకు పూనుకుంటున్నారు. దీనికి తోడు రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో జిల్లాలోని మిగతా మున్సిపాల్టీల్లోనూ అవిశ్వాసం పరంపర కొనసాగే అవకాశం ఉంది. కొత్త సర్కార్ కొలువు దీరడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొందరు కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో మున్సిపాల్టీల్లో రాజకీయం వేడెక్కుతోంది.

సొంత పార్టీలోనే అసమ్మతి

కొద్ది రోజులుగా సొంత పార్టీలోనే అసమ్మతి రాజుకుంది. మున్సిపల్ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్ల మధ్య వివేధాలు తలెత్తాయి. నిధుల కేటాయింపుల్లో పక్షపాతం, ప్రాధాన్యత కల్పించకపోవడం వల్ల పలువురు కౌన్సిలర్లు అసంతప్తితో రగిలిపోతున్నారు. దీనికి తోడు కొంత మందికే నిధులు కేటాయించి మరికొందరినివిస్మరించడంతో వివక్ష చూపుతున్నారంటూ కొందరు కౌన్సిలర్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. గతేడాదే మేడ్చల్, దమ్మాయిగూడ, మున్సిపల్ చైర్ పర్సన్లపై అవిశ్వాస నోటీసులిచ్చి తమ ఆగ్రహాన్ని బయటపెట్టారు. కానీ అధిష్టానం రంగ ప్రవేశం చేయడంతో అవిశ్వాసాలకు తాత్కాలికి బ్రేక్ పడింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసి పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ అవిశ్వాసం అంశం మరోసారి తెరపైకి వస్తుంది. దీంతో చైర్మెన్లు, వైస్ చైర్మెన్లను గద్దె దించేందుకు సొంత పార్టీ కౌన్సిలర్లే పావులు కదుపుతున్నారు.

చైర్మెన్లు, వైస్ చైర్మెన్లకు పదవీ గండం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపల్ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లకు పదవీ గండం పట్టుకుంది. సోమవారం నాగారం, తూంకుంట కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు కలిసి అవిశ్వాసం నోటీసు అందజేశారు. తమ వార్డుల్లో అభివృద్ధికి చైర్మెన్, వైస్ చైర్మెన్ సహకరించడం లేదని కౌన్సిలర్లు ఆరోపించారు. నాగారం మున్సిపాల్టీలో 20 మంది కౌన్సిలర్లకుగాను 14 మంది, తూంకుంట మున్సిపాల్టీలో 16 మంది కౌన్సిలరకుగాను 11 మంది అవిశ్వాసం తీర్మాణంపై సంతకాలు చేసి కలెక్టర్‌కు అందజేశారు. దమ్మాయిగూడ, మేడ్చల్, ఘట్కేసర్ మున్సిపాల్టీల్లోనూ ముసలం నెలకొంది. జిల్లాలోని మరికొన్ని మున్సిపాల్టీల్లోనూ అవిశ్వాసం సెగలు రాజుకునే అవకాశం ఉంది. కాగా ఘట్‌కేసర్ కౌన్సిలర్లతో సంప్రదింపులు జరిపినా ఫలించకపోవడంతో త్వరలోనే దుబాయ్ లేదా మలేషియా విహారయాత్రకు తీసుకెళ్లనున్నట్టు సమాచారం. ఈ అవిశ్వాసాల్లో ఎవరిదిపై చేయి అవుతుందో తెలియాలంటే మరికొద్ది రోజులు ఎదురు చూడాల్సిందే..!

యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్

యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ఏదైనా సరే ప్రజా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. సోమవారం రామంతపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తన గెలుపుకు కృషిచేసిన యాదవులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సర్వ బాబు యాదవ్ ,యాదవ కుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

జడ్పీ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి

నవతెలంగాణ-ఘట్‌కేసర్

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మాదారం, మరిపల్లిగూడ, ఎదులాబాద్ గ్రామాలలో జడ్పీ నిధులతో చేపట్టిన వివిధ పనులకు ఆయన ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరెడ్డి, ఎంపీఓ నందకిషోర్. ఎంపీటీసీ కొమ్మిడి శోభా రాణి, నాయకులు అంజిరెడ్డి, కందుల కుమార్ బొక్క ప్రభాకర్ రెడ్డి, వెంకటేష్, సాయిలు గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గరికపాటి రాజారావు, షేక్ నాజర్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి నిర్మాత గరికపాటి రాజారావు, బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ జయంతుల సందర్భంగా నివాళి కార్యక్రమం కమలానగర్ ఎన్వి భాస్కరరావు భవన్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ప్రారంభ సూచికగా స్ఫూర్తి గ్రూపు నాయకులు బొమ్మగాని రుక్కయ్య.. గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కేకే ప్రసాద్ బాబు.. షేక్ నాజర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు యాదగిరిరావు మాట్లాడుతూ రాజారావు ప్రజా నాట్యమండలి ఏర్పాటుచేసి ప్రజాకళలను పెంచి పోషించడమే కాకుండా ప్రజా ఉద్యమాలకు జీవకర్రగా నిలిచారని చెప్పారు. షేక్ నాజర్ ఎన్నో కష్టం నష్టాలు ఎదుర్కొని బుర్రకథను అనేక నాటకాలను అనేక వాయిద్య ప్రక్రియల మీద పట్టు సాధించారని ప్రజలను చైతన్య పరచడంలో వారు ఎంతో కషి చేశారని చెప్పారు. ప్రముఖ ప్రజాతంత్ర ఉద్యమ ప్రధాన వక్తగా ప్రసంగించారు. షేక్ నాజర్ కమ్యూనిస్టు ఉద్యమంలో సంబంధాలు ఏర్పరచుకొని వారి కనుబంధంగా బుర్రకథలు మాధ్యం ద్వారా ప్రజలను చైతన్య పరచడం అల్లూరి సీతారామరాజు, వీరనారి టాన్య, బెంగాల్ కరువు, బొబ్బిలి యుద్ధం ఇలాంటివి అనేకం ప్రదర్శించి ఎంతో పేరు గడించారని చెప్పారు. ప్రజలు చైతన్యం చేస్తున్నందుకు పలుమార్లు జైలుకు వెళ్ళవలసి వచ్చిందని అన్నారు. ఆ తర్వాత కాలంలో అగ్రవర్ణాల ద్వారానే గండ పెండేరాలు, అవార్డులు రివార్డులు పొందారని చివరకు పద్మశ్రీ కూడా పొందారని చెప్పారు. నాజర్ మాటలు చెప్పాలంటే ఇవన్నీ ప్రజల ఈలలు చప్పట్ల ముందు దిగదుడుపేనని చెప్పారన్నారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ రాజారావు చేసిన కషిని చెప్పారు. అంతేకాకుండా సాంస్కతిక రంగంలో కషి ద్వారానే సమాజం పురోగమిస్తుందని చైతన్యం చెందుతుందని చెప్పారు. పీబీ చారి , కోమటి రవి ప్రసాద్ బాబు ప్రసంగించారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు సభికులందరూ పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేకే ఉన్నికష్ణ, శ్రీనివాసరావు, రమణయ్య, వెంకటేశ్వరరావు, గౌసియా, శ్రీనివాస్, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

'పీర్జాదిగూడలో ప్రభుత్వ భూములను రక్షించాలి'



● ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన ప్రభుత్వ భూములను కబ్జాదారుల చేర నుండి కాపాడాలని కోరుతూ కాంగ్రెస్ పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అధికారులను కోరారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో నాయకులు, వివిధ కాలనీల వాసులతో కలసి కబ్జాకు గురైన భూముల వివరాలతో కూడిన ఫిర్యాదును అధికారులకు అందించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 'కాదేది అనర్హం కబ్జాలకు' అన్న చందంగా పరిస్థితులు తయారయ్యాయని ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు ప్రజలకు సేవ చేయడం మానుకోని ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతపూర్ లో స్మశాన వాటిక డంపింగ్ యార్డులకు కేటాయించిన సర్వే నం 1, 10, 11 లలో గల ప్రభుత్వ భూముల కబ్జాలకు గురైన విషయాన్ని గుర్తు చేశారు. పీర్జాగూడ కార్పొరేషన్ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరి రక్షించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ముందుకు పోతుందని, హిందూ, ముస్లిం,క్రిస్టియన్ మైనార్టీ నాయకులతో కలిసి ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసామని, త్వరలోనే కబ్జాకు గురైన భూములపై చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పీర్జాదిగూడ ప్రధాన కార్యదర్శి పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ముదిగొండ రమేష్,మజర్, నాగరాజు, యాసారం నగేష్,వంగూరి పరమేష్, ఉదయ్ రాజ్ గౌడ్,అమర్, కరీం మరియు క్రిస్టియన్ ముస్లిం కమిటీ సభ్యులు చార్లెస్, జాకిర్ హుస్సేన్, హసన్ చాచా, రంగా రావు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపడతాం

● కార్పొరేటర్ బన్నాల

నవతెలంగాణ-ఉప్పల్



హెచ్ఎంటీ చెరువులోని గుర్రపు డెకను తొలగింపునకు త్వరలో చర్యలు చేపడతామని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. అనంతరం సోమవారం వివిధ శాఖల అధికా రులతో కలిసి హైకోర్టు కాలనీ హెచ్ఎంటీ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లా డుతూ చెరువు పరిసర ప్రాంతాల్లో గుర్రపు డెక్క ఎక్కువగా పేరుకుపోయి ఉందని, గుర్రపు డెక్క ఎక్కువగా ఉండటం వలన దోమల బెడద ఎక్కువైందని, వెంటనే గుర్రపు డెక్కన్ తొలగించాలని శానిటేషన్ డిపార్టుమెంట్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం హైకోర్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు కార్పొరేటర్ బన్నాల గీత కాలనీలో విస్తృతంగా పర్యటించి వాటర్ పైపు లైన్ లేని వీధుల్లో వెంటనే ఏర్పాటు చేయాలని డీజీఎం రజనీకాంత్‌ని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం రజనీకాంత్ రెడ్డి, ఏఈ ఎంటమాలజీ నరేష్ రెడ్డి, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, హైకోర్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేశవరావు, మధుసూదన్ రాజ్, మోహన్ రెడ్డి, అరుణ, పుష్పలత, సుగుణ, అంజిరెడ్డి,సద్గుణ, రాధా, చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, బింగి శ్రీనివాస్, ముద్దం శ్రీనివాస్, రామాంజనేయులు, బాలు, శివ తదితరులు పాల్గొన్నారు,

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

● ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్



నవతెలంగాణ-బోడుప్పల్

దేశంలోని పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు విద్యను దూరం చేసే, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్ పిలుపునిచ్చారు. నూతన విద్యా పాలసీకి వ్యతిరేకంగా ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దినేష్ శ్రీ రంగరాజన్ మాట్లాడుతూ విద్యా కాషాయీకరణ, విద్యా ప్రయివేటీకరణ కోసమే నూతన విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం-2020 సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించాలని కోరారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యా విధానం-2020 తీసుకొచ్చారని విమర్శించారు. విద్యా కార్పొరేటికరణ, కాషాయికరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని అన్నారు. దేశంలో జాతీయ విద్యా విధానం వల్ల దాదాపు 90 శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి బదులు హిందుత్వ రాజ్యాన్ని స్థాపించడానికి బాటలు వేస్తున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో ప్రయివేటు విశ్వవిద్యాలయలను, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తారని తెలిపారు. ఇప్పటికే పేద వర్గాలకు అందని ద్రాక్షగా మారిన విద్య, ఎన్ఈపీ అమలుతో విద్యకు మరింత దూరం చేయబడుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఎన్ఈపీకి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార క్రాంతి , గ్యార నరేష్ , రెహమాన్ , నెల్లి సత్య ,మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉధ్యక్షుడు హరీష్, జిల్లా నాయకులు గోపి, అరవింద్, రాము, వెంకట్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



నవతెలంగాణ-కాప్రా

దేశం కోసం శ్రమిస్తున్న కార్మిక, రైతుల జీవితాలు, జీవనోపాధిపై నిరంతరాయంగా అనాగరిక దాడులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్నదని ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్. శంకర్ రావు అన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సమ్మె గోడ పత్రికను ఏఐటీయూసీ కాప్రా సమితి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిపాలనా అధికారాలను పూర్తిగా దుర్వినియోగం చేస్తూ, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజల హక్కులను కాలరాస్తోందన్నారు. సామాన్య ప్రజలు, విద్యార్థి, నిరుద్యోగులు, మహిళలు, కార్మికులు, రైతులు పెద్దఎత్తున పాల్గొని బంద్ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్. బోస్, సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి,ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు, కార్యవర్గ సభ్యులు ఎస్. నర్సింహా, కపాకర్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జవహర్‌నగర్



దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను16వ తేదీన నిర్వహించ తలపెట్టారని ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు దర్శనం యాదగిరి అన్నారు. సోమవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బాలాజీనగర్‌లో కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కార్మిక సం ఘాల నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్, మతత్వ విధానాలను ఎండకట్టి, మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిద్దామని పిలుపునిచ్చారు. జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో కరపత్రాల పంపిణీ చేశారు. ఈ నెల తొమ్మిదవ తేదీన బాలాజీ నగర్ లోని దళిత్ భవన్‌లో ట్రేడ్ యూనియన్లు నిర్వహించే సదస్సుకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివన్నారాయణ, ఐఎఫ్టీయూ నాయకులు శివ బాబు, వి. ప్రవీణ్, తిరుపతి, ధనరాజ్, ఎండి కైసర్ తదితరులు పాల్గొన్నారు.

16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాప్రా



16న జరిగే దేశవ్యాప్త కార్మిక కర్షక గ్రామీణ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఈపీఐఆర్‌ఓసీ మైనింగ్ ఇండియా కంపెనీ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్ జిల్లా కార్య దర్శి జే. చంద్రశేఖర్, చర్లపల్లి ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు ఎపిరాక్ జనరల్ సెక్రెటరీ బి వి సత్యనారాయణ వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ వీరయ్య, శివప్ప యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.డి. రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మజీద్ గడ్డ బస్తీ ఎన్నికలలో అబ్దుల్ బాకీ గెలుపు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ 118 పరిధిలోని ప్రభాకర్ రెడ్డి నగర్, రాంరెడ్డి నగర్‌లో బస్తీ అసోసియేషన్ సంక్షేమ సంఘం ఎన్నికలులో అధ్యక్షుడిగా అబ్దుల్ బాకీ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బస్తీ సంక్షేమ సంఘం అసోసియేషన్ ఎన్నికలకు నిర్వహించిన ఎన్నికలో అభ్యర్థుల మధ్య జరిగిన పోటాపోటీలో కప్పు సాసర్ గుర్తుపై పోటీచేసిన అభ్యర్థి అబ్దుల్ బాకీ సమీప అభ్యర్థి సాయికిరణ్ పై 23 ఓట్ల మెజారిటీతో అబ్దుల్ బాకీ గెలుపొందారు. సోమవారం ప్రభాకర్ రెడ్డి, రాంరెడ్డి నగర్, మజీద్ గడ్డ కమ్యూనిటీ హాలులో జరిగిన బస్తీ సంక్షేమ సంఘం అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధిండంపై గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ సెక్రటరీ ఎర్రవల్లి అశోక్ చారి, సీనియర్ నాయకుడు అరుణ్, దేవేందర్, చిటకోరు కృష్ణ, నరేష్ తదితరులు అబ్దుల్ బాకీకి శుభాకాంక్షలు తెలిపారు.

'చెరువుల పరిరక్షణ బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుంది'



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలోని ఎల్లమ్మను స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, చెరువుల అన్యాక్రాంతం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రతి డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ప్రతి అడుగు ముందుకు వేస్తాం అని పేర్కొన్నారు. జగదీశ్వర్ గౌడ్ సోమవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టాల్సిన సుందరీకరణ పనులను, చేపట్టిన పనులను ఇరిగేషన్ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భాను ప్రసాద్,నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, గపుర్, డివిజన్ అధ్యక్షులు మరేళ్ల శ్రీనివాస్, శ్రీదేవి, విజయ, కానక దుర్గ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ప్రజలకు రుణపడి ఉంటా



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎల్లావేలాల రుణపడి ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేపట్టిన కృతజ్ఞత యాత్ర 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సోమవారం 131 - కుత్బుల్లాపూర్ డివిజన్ మాణిక్య నగర్, మధుసూదన్ రెడ్డి నగర్, ద్వారకా నగర్ కాలనీలలో కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కే.ఎం.గౌరిష్‌తో కలిసి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద పర్యటిస్తూ కాలనీవాసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధిని గుర్తించి మా ప్రజా ప్రతినిధిగా మీరే ఉండాలంటూ ముచ్చటగా మూడవ సారి ఎమ్మెల్యేగా తనను గెలిపించిన కుత్బుల్లాపూర్ ప్రజ లకు ధన్యవాదాలు తెలిపేందుకు ఈ కృతజ్ఞత యాత్ర చేపడుతున్నానని తెలిపారు.

మాణిక్య నగర్ : అధ్యక్షులు బి.మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్, వైస్ ప్రెసిడెంట్ మధు, నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎండి.ఖలీల్ బాషా, కాలనీ సీనియర్ నాయకులు రామేశ్వర్ రెడ్డి, రఘునాథరెడ్డి, నారాయణరెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు సురేష్ ఉన్నారు.

మధుసూదన్ రెడ్డి నగర్ : అధ్యక్షులు కె.నాగన్న, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి మధు, కాలనీవాసులు కుమారస్వామి, రఘుమా రెడ్డి, ఎస్వీఎస్ మోహన్ కుమార్, రమేష్ తదితరులు ఉన్నారు.

ద్వారకా నగర్: శ్రీనాథ్, సాయిలు, అంజిరెడ్డి, జంగయ్య మల్లేష్ యాదవ్, కళ్యాం శ్రీనివాస్, కృష్ణ, వెంకట్ రెడ్డి, నరసింహ ఆంజనేయులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, సురేందర్ రెడ్డి, నజీర్, వెంకటేష్, అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహిళా విభాగం

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 125 - గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ కస్తూరి బాలరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు సంధ్యారెడ్డి, మంజుల, కుర్షిదా బేగం, మామి, ఊర్మిళ, దుర్గ, రమ తదితరులు పాల్గొన్నారు.



జీడిమెట్ల 132 డివిజన్ కుత్బుల్లాపూర్ విమానపురి కాలనీలోని "ది మాస్టర్ మైండ్ స్కూల్" రెండవ బ్లాక్ ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, అజీష్, కుంట వేణు, కస్తూరి బాల్ రాజ్, నార్ల కంటి శ్యామ్, బలరాం, సమ్మయ్య నేత, సిద్ధిక్, నదీమ్ రాయ్, స్కూల్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు యాదగిరి, జగత్, పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పారదర్శకంగా 'ఈవీఎం'ల ఎఫ్ఎల్‌సీ నిర్వహణ

- మొదటి స్థాయి పరిశీలనలో జాగ్రత్తగా ఉండాలి
- ఈవీఎంల పరిశీలనలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్ల మొదటి స్థాయి పరిశీలన (ఫస్ట్ లెవల్ చెకప్ అండ్ ఎఫ్ఎల్సీ) క్షుణ్ణంగా చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఫస్ట్ లెవల్ చెకప్ (ఎఫ్ఎల్సీ)ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో కలిసి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎమ్), వీవీ ప్యాట్ల మొదటి విడత తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడతగా ఈవీఎంలను పరిశీలించినట్టు పేర్కొన్నారు. ఫస్ట్ లెవల్ చెకప్ కార్యక్రమాన్ని ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్సీ) నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈవీఎంలపై ఎలాంటి అనుమానాలకు చోటు లేకుండా ప్రక్రియ జరుగుగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రాథమికంగా పరిశీలన (ఎఫ్ఎల్సీ) జరిపేందుకు ఈసీఎల్‌కు చెందిన 26 మంది సాంకేతిక నిపుణుల బందం జిల్లాకు చేరుకుని ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తూ, నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లాలోని ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ శాసనసభ నియోజకవర్గాలకు చెందిన ఎన్నికల గోడౌన్లను కలెక్టర్, ఆయా రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అందులోని ఈవీఎం యంత్రాలను పరిశీలించారు. ఇక మిగిలిన కూకట్‌పల్లి, మేడ్చల్ శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్షన్ పిటిషన్ ఉండటం వల్ల గోడౌన్లను తెరవలేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రజావాణికి 150 అర్జీలు



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 150 అర్జీలను స్వీకరించినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి తెలిపారు. స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ పరిధిలో 57 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూసాపేట సర్కిల్ నుంచి 6, కూకట్‌పల్లి సర్కిల్ నుంచి 1, కుత్బుల్లాపూర్ సర్కిల్ నుంచి 3, గాజులరామారం సర్కిల్ నుంచి 12, ఆల్వాల్ సర్కిల్ నుంచి 14, కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం నుంచి 21 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒకే ప్రాంతానికి చెందిన ముగ్గురు అదృశ్యం





నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఒకే ప్రాంతానికి చెందిన ముగ్గురు మైనర్లు అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లమ్మబండలోని పిజెఆర్ నగర్ ప్రాంతానికి చెందిన అస్లాం, షాహిద్, చింటూ వీరు ముగ్గురు స్నేహితులు. ఇదిలా ఉండగా ముగ్గురు ఆదివారం వారి వారి ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లి పోయారని తల్లిదండ్రులు తెలిపారు. సాయంత్రం రాత్రి వరకు చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో పలు సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ప్రతి సోమవారం ప్రజావాణి ఉంటుందని వివిధ శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ముఖ్యంగా డ్రయినేజీ సమస్యలు, జలమండలికి సంబంధించిన సమస్యలపై ప్రజలు దరఖాస్తులు అందజేస్తున్నారని తెలిపారు. అధికారులతో చర్చించి సమస్యలపై సానుకూలంగా స్పందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజు, డీసీపీ సాంబయ్య, ఏఎంసి నరసింహారెడ్డి, నారాయణ, డిఈ రంజిత్ రెడ్డి, ఏ ఈ లక్ష్మి, హార్టికల్చర్ అధికారి ప్రవీణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా దారుల పై చర్యలు తీసుకోవాలి

- వినతిపత్రం అందజేసిన పాపిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు
- రోడ్డు కబ్జా చేసి ఇంటి నిర్మాణం
- రోడ్డును కాపాడాలని కోరుతున్న కాలని వాసులు





నవతెలంగాణ-కూకట్‌పల్లి

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పాపిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు, ఎంఆర్‌ఓకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ "శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్‌పల్లి సర్కిల్, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్‌లోని, రోడ్ నంబర్ 5 సి బ్లాక్ లోని 30 అడుగుల రోడ్డు, ఆస్బెస్టాస్ కమాన్ వరకు రోడ్డు ఉంది. గతంలోనే కొంత మేర ఆక్రమించుకుని రోడ్డు స్థలంలో ఇండ్లు కట్టి అమ్ముకోవడం జరిగింది. మిగిలి ఉన్న రోడ్డును సైతం కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టారు.కాలనీ లేఔట్ కాపిలో స్పష్టంగా రోడ్డుకు కేటాయించి ఉన్నటువంటి, 30 అడుగుల రోడ్డును ఆక్రమించి కుల భవనం అని నామకరణం చేసి, కబ్జాకు తెర లేపారు.

ఇంత జరిగినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులలో చలనం లేకపోవడం గమనార్హం. రోడ్డు కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేవడుతున్నారని ఎంఆర్‌ఓకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు కి ఫిర్యాదు చేశాం. కబ్జా దారుల పై చర్యలు తీసుకొని కబ్జా చేయబడ్డ స్థలాన్ని కాపడలేకపోతున్నారు. ఇప్పటికైనా కాలని ప్రజల సౌకర్యార్థం, రోడ్డు కొరకు కేటాయించిన స్థలంలో కబ్జా దారులు చేపట్టిన అక్రమ నిర్మాణం తొలగించి, రోడ్డు స్థలాన్ని కాపాడాలి. ' అని కోరారు.

మైనంపల్లిని విమర్శిస్తే ఊరుకునేది లేదు



- కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పై విమర్శలు చేస్తే ఊరు కునేది లేదని మల్కాజిగిరి కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం ఆనంద్ బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నాయకులు పద్ధతి మారలేదని, మాజీమంత్రి కేటీఆర్ మల్కాజిగిరికి అవాకులు, చెవాకులు పేలుతున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరిలో మంచికి డబ్బుకు జరిగిన పోటీలో, డబ్బు ప్రలోభం మాత్రమే గెలిచిందన్నారు. మంచి చేసిన మాజీ ఎమ్మెల్యేను, మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలు ఏనాడూ మరచి పోబోరన్నారు. మల్కాజిగిరిలో ఈ రోజు అభివృద్ధి జరిగిందంటే మైనంపల్లి పుణ్యమేనని, నేడు పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుసుకున్న ప్రజలు బాధపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాక పోవడంతో కేటీఆర్ పిచ్చి పట్టినట్టుగా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నేనే సాధించానని కేసీఆర్, ఆయన కుటుంబం గొప్పలు చెప్పుకోవడం, ఆ పేరుపై గద్దెనెక్కడం తప్ప మీరు చేసింది ఏమీ లేదన్నారు. ముఖ్యంగా మైనంపల్లి గురించి మాట్లాడే స్థాయి నీది కాదన్నారు. గతంలో మీ పార్టీలో మైనంపల్లి గ్రేటర్ హైదరాబాద్‌ను ముందుండి నడిపించిన సంగతి నీకు తెలియదా కేటీఆర్...? అని వారు ప్రశ్నించారు. మల్కాజిగిరిలో అభివృద్ధి చేసింది ఎవరంటే మైనంపల్లి అని ప్రతి ఒక్కరూ చెప్తారని, అలాంటి వ్యక్తిపై అభాండాలు వేస్తే ఊరుకోబోమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, చంద్రశేఖర్, సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు సంపత్ గౌడ్, మైనాల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీలోని గాగిల్లాపూర్ 1వార్డులోని జగన్ వెంచర్‌లో సోమవారం రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ చైర్మెన్ పద్మారావు, స్థానిక కౌన్సిలర్ కుంటి అరుణ, నాగరాజుతో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామని తెలిపారు. కాలనీలో పర్యటించి కాలనీ సభ్యులు, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భారత్ కుమార్, సీనియర్ నాయకులు మురళి యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, నాయకులు మొర అశోక్, లక్ష్మణ, కోటేశ్వర్ రావు, కాలనీ సభ్యులు జ్ఞానేశ్వర్, గణేష్ పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీలోని డి.పోచంపల్లి 9వ వార్డులోని సాయి బాబా, మాధవ్ రావు, గాయత్రి నగర్‌లో సోమవారం రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు, రూ.50లక్షల వ్యయంతో అందర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణ పనులను వైస్ చైర్మెన్ పద్మారావు, స్థానిక కౌన్సిలర్ మహేందర్ యాదవ్‌తో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు.

ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను డివిజన్ ప్రజల సహాయ సహకారాలతో అభివృద్ధి సాధ్యపడుతుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో స్థానిక బస్తీ వాసులతో కలిసి ప్రజా సమస్యలపై పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కార్పొరేటర్ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని ఆయా ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను రాజకీయాలకతీతంగా పరిష్కరిస్తానని తెలిపారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ తదితర సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోని సంక్షేమ, అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జెకె.శేఖర్ యాదవ్, స్థానిక బస్తీ నాయకులు చందు, నాగరాజు, ప్రభాకర్ రెడ్డి, కె.వి.రాజు, రాజేష్, రెడ్డప్ప, సోమనాథ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (దేవాదాయ ధర్మాదాయ శాఖ)53 వ బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, నిర్వాహకులకు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ అధికారులు, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో రూపొందించిన జాతర మహోత్సవ గోడపత్రికను కార్యనిర్వహణ అధికారి కృష్ణమాచార్యులు సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని పరిసర ప్రాంతాల తోపాటు వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ అంకిన బోయిన వేణుగోపాల్ యాదవ్, స్థానిక జగద్గిరిగుట్ట ఎస్సై.రంజిత్ రెడ్డి, ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి సభ్యులు రేగురి ప్రవీణ్ కుమార్ గుప్తా, గుజ్జుల పాపిరెడ్డి, సమ్మయ్య యాదవ్, ఈ.వెంకటేష్, ప్రధానార్చకులు మాడభూషిని రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మల్లారెడ్డి హాస్పిటల్స్ డెంటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఎన్ఎస్-ఎస్ సంయుక్తంగా క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీ కార్యక్రమాన్ని మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ డాక్టర్ సుధా రమణ ప్రారంభించారు. డెంటల్ కాలేజ్ డీన్ డాక్టర్ వెంకట రమణారెడ్డి ఆంకాలజిస్ట్ డాక్టర్ స్వప్న మల్లారెడ్డి క్యాన్సర్ హాస్పిటల్ ప్రొఫెసర్స్, ఫ్యాకల్టీస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మల్లారెడ్డి డెంటల్ ఇనిస్ట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ సజ్జనర్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్యాన్సరును నిర్మూలించడం కోసం క్యాన్సర్ కారకాలైనటువంటి పొగాకు ఉత్పత్తులు వినియోగించ వద్దని, పొగతాగటం కూడా ప్రమాదకరమని స్లొగన్స్ ఇస్తూ సూరారం పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కలిగించే ప్రకార్డులను ఉపయోగిస్తూ ర్యాలీలో మల్లారెడ్డి మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, డాక్టర్లు, విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

అలంపూర్ జోగులాంబ దేవాలయాన్ని సోమవారం అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, ఆమె ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...ప్రజలందరిపై అమ్మవారి దీవెనలు ఉండాలన్నారు. ఆమె దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | ఫిబ్రవరి 06 2024 | www.navatelangana.com

ప్రొ.శ్రీరాం వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన ప్రొ.శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి సెక్రటరీగా ప్రొ.శ్రీరాం వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్‌ను ఇంజనీరింగ్ కాలేజ్ పరిశోధక విద్యార్థులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్ర మంలో పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైను పనులకు శంకుస్థాపన


ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్, సోమవారం షేక్‌పేట్ డివిజన్ వినోభా నగర్‌లో రూ.13లక్షలతో నీటి పైపు లైన్ కోసం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్ర మలో డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, అధికారులు, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా ఆదిరెడ్డి బాధ్యతలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా కే.ఆదిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఆదిరెడ్డి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉమాయున్‌నగర్, సీసీఎల్, రైల్వేలో పని చేసినట్లు, అదేవిధంగా నాగర్‌కర్నూల్‌లో ఇన్స్పెక్టర్‌గా వెళ్లారు. అనంతరం బదిలీపై బోంబండ స్టేషన్‌కు తిరిగి వచ్చినట్లు తెలి పారు. ఈ సంద ర్భంగా మీడియాతో మాట్లా డుతూ, బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, బెల్ట్ షాపులు, మారకద్రవ్యాలు, అమ్మిన సేకరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని, రాత్రి సమయంలో ఎవరైనా తాగి అల్లర్లకు పాల్పడిన రోడ్లపై విచ్చలవిడిగా అల్లర్లు చేసిన, స్థానికులు వెంటనే 100 నెంబర్‌కు డయల్ చేయాలని, అదే విధంగా బాధితులు ధైర్యంగా వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. 24 గంటలు పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటారని ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

సిద్ధిపేట వర్గల్ సరస్వతి దేవాలయన్ని సోమవారం గ్రేటర్ హైదరాబాద్ నగర్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరు బాగుండాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.

ఓయూలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఓయూ

కృష్ణజలాలపై హక్కులను కాపాడుకుందామని, కృష్ణ జలాలలో 50శాతం వాటా సాధించే వరకు ఎంతకైనా పోరాడుతామని సోమవారం బీఆర్ఎస్వీ కార్యదర్శి జంగయ్య రమేష్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి అమ్ముడు పోయిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను సోమవారం ఓయూలో దహనం చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య రమేష్‌గౌడ్ మిథున్,రామకృష్ణ, నాగేందర్‌రావు, అవినాష్, శ్రీను నాయక్ , నిఖిల్ తదితరుల పాల్గొన్నారు.

డిజేబుల్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జంగం శ్రీశైలం



నవతెలంగాణ-ఓయూ

దివ్యాంగ,ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాఖ్యాత, తెలుగు భాష ఉపాధ్యాయుడు జంగం శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో ఎల్లప్పుడూ సంప్రదింపులు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

జోరుగా పలు చోట్ల వాల్ పెయింటింగ్



నవతెలంగాణ-ఓయూ

మరోసారి మోడీ సర్కార్ అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ కమలం పువ్వు గుర్తును మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్ వెంకటరెడ్డినగర్‌లో తుళ్ల వీరేందర్ గౌడ్ హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్‌గోడ మీద పెయింటింగ్ రాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వంలో సుపరిపాలన, అభివృద్ధిని నెరవేర్చడానికి రాబోయే ఎన్నికలలో బీజేపీని చారిత్రాత్మక విజయాన్ని అందిచాలని కోరారు. డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లాలాగూడా ఇన్‌స్పెక్టర్‌గా పల్లె పద్మ

- శాంతి భద్రతల సంరక్షణకు కృషి



నవతెలంగాణ-ఓయూ

లాలాగూడా పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పల్లె.పద్మ సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఆమె గతంలో మారే డుపల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా, సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసినట్లు తెలిపారు. ప్రస్తు తం సీసీఎస్‌లో పనిచేస్తూ లాలగూడా పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల సంరక్షణ కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె అన్నారు. అనంత రం పలువురు ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-బంజారాహిల్స్

మాజీ సీఎం కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశారని సీఎం రేవంత్ దిష్టి బొమ్మను జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఫిలిం నగర్ కొత్త చెరువు వద్ద దహనం చేశారు.

కేబీఆర్ పార్కులో అసంపూర్తి పనులను పూర్తి చేయండి

- పెంపుడు కుక్కలను తీసుకురాకుండా చూడాలి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేబీఆర్ పార్కులో చేపట్టిన అభివద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, పార్క్‌లో సుందరీకరణకు కావాల్సిన అన్ని చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జోనల్, అడిషనల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పార్కును పరిశీలించారు. గతంలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడారు. పార్క్‌లో మరిన్ని మౌలిక వసతులు, సుందరీకరణ కోసం అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పార్క్‌లో సందర్శకుల కోసం, వాకర్స్ కోసం తాగు నీరు, ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెంపుడు కుక్కలను యజమానులు తీసుకుని రాకుండా చర్యలు తీసుకోవాలని, పెంపుడు కుక్క రోడ్డు పైన మలినం వేయడం వలన వాకర్స్ ఇబ్బంది పడుతున్నారని కమిషనర్‌అన్నారు. టాయిలెట్‌కు అనువైన స్థలాన్ని గుర్తించి నిర్మాణం చేయాలని, అక్కడక్కడ లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలని ఎస్.ఈ రత్నాకర్‌ను ఆదేశించారు. మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలి జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఇంతకు ముందు పార్కు అభివద్ధి కోసం చేపట్టిన పనులను పూర్తి చేయడంతో పాటు సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి జోనల్ కమిషనర్ రవి కిరణ్, యూబీడీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ సునంద రాణీ, ఎస్.ఈ రత్నాకర్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈ.ఈ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పల్లవి మోడల్ స్కూల్ మొదటి స్నాతకోత్సవం



నవతెలంగాణ-బేగంపేట్

తిరుమలగిరిలోని పల్లవి మోడల్‌స్కూల్లో కిండర్ గార్టెన్‌లో సోమవారం (2024, ఫిబ్రవరి 3వ తేదీన) మొదటి స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ అకాడమిక్ కో-ఆర్డినేటర్ నీలవేణి స్వాగతోపన్యాసం, ప్రముఖులచే జ్యోతి ప్రజ్వలనతో ఈ వేడుక ప్రారంభమైంది. చిన్న పిల్లల నృత్య ప్రదర్శన , ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను, అదే విధంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పూనమ్‌ను ఎంత గానో ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మీసాగర్, ఉపాధ్యాయులందరూ కార్యక్రమంలో పాల్గొన్ని విద్యార్థుల ను మోటివేట్ చేశారు.క్లాస్ టీచర్ హీరా,మారియా మాట్లాడుతూ పిల్లలు తమతో గడిపిన సమయాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ సాను కూల ఫ్రేమ్‌వర్క్‌తో విజయ శిఖరాలను అందుకోవాలని ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు ఆశించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సాగర్ అందరికి స్వాగతం పలుకుతూ విద్యా ర్థులు సాధించిన విజయాలను, సంస్థకు వారు తెచ్చిన ప్రశంసలను ప్రేక్షకులతో పంచు కున్నారు. పాఠశాల విద్య ప్రాముఖ్యతను, వారి జీవితంలో ముందుకు సాగాలని, సవాళ్లను ఎదుర్కొనేందుకు వారి కెరీర్‌లో రాణించడానికి తగిన నైపుణ్యాలు, జ్ఞానంతో తమను తాము సిద్ధం చేసుకోవాలని ఆమె విద్యార్థులను తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పూనమ్ సింఘాల్ మా ట్లాడుతూ విద్యార్థులు అనుకున్నది సాధిం చాలన్నారు. ఈ వేడుక విజయవంతం అవ్వడానికి ఉపాధ్యా యులు, విద్యార్థులు చేసి కృషిని స్కూల్ ప్రిన్సిపాల్ అభినందించారు.

16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ-ఓయూ

దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16 న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లా యీ స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం యూని వర్సిటీలలో గ్రాండ్స్ విడుదల చేయకుండా యూని వర్సిటీలను నిర్వీర్యం చేస్తు న్నారని, పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తు న్నారన్నారు. ఓయూ కాంట్రాక్ట్‌ఔట్ సోర్సింగ్ యూని యన్(సీఐటీయూ) అధ్య క్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఓయూ ఉద్యోగులు దాదాపు 30 సంవత్స రాల నుండి అతి తక్కువ వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారని, సంవత్సారాలు గడుస్తున్న వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించటం లేదని, అవేదన వ్యక్తం చేశారు. వెంటనే అందరిని ప్రభుత్వ ఉద్యో గులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16 న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని, బీజేపీ వ్యతిరేక విధానాలకు వ్యతరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు. అనసూయ, శ్రీను, నాగరాజు, లక్ష్మణ్‌గౌడ్ ,సహాయ కార్యదర్శులు నరేష్, శ్యామల, స్వప్న శివ కుమార్, లక్ష్మణ్ , బాలకృష్ణమహేందర్, పాల్గొన్నారు.

మిస్, మిసెస్ సౌత్ ఇండియా గ్రాండ్ ఫినాలే వేడుకలు



మురళీ మోహన్, భారతి

నవతెలంగాణ-బంజారాహిల్స్

వీనస్-స్టార్ లైట్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మిస్, మిసెస్‌సౌత్ ఇండియా గ్రాండ్ ఫినాలే వేడుకలు సోమాజీగూడలోని క్షత్రియాహెూటల్లో ఆదివారం రాత్రి అత్యంత రసవత్తరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువతులతో పోటీగా మహిళలు విభిన్న డ్రస్సులతో వాక్ చేస్తూ చూపరులను కనువిందు చేశారు. ఈ వేడుకలకు నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్,వైఎస్ భారతిలు హాజరై వేడుకలను ప్రారం భించి పోటీల్లో పాల్గొన్న యువతులు,మహిళలను సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకేసారి మిస్, మిసెస్ పోటీలను సౌత్ అండియా లెవెల్‌లో ఏర్పాటు చేయడం మంచి పరిణామమని, వేడుకలను నాంది పలికిన నిర్వాహకులు స్టార్ట్ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎండీ జయంతి రామచంద్రన్, వీనస్ ఫిల్మ్ ఈవెంట్స్ ఎండీ జేజే కశ్యప్‌లను వారు అభినందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సీనియర్ జర్నలిస్ట్, సుమన్ టీవీ సీఈఓ జర్నలిస్ట్ ప్రభు, పలు అందాల పోటీల విజేతలు ఉషాప్రసాద్, ప్రియాంక సర్కార్, సోనిభట్, సుధాజైన్‌లు వ్యవహరించారు. మిస్ సౌత్ ఇండియాగా సునీత, రన్నరప్‌గా మహాలక్ష్మి, మిసెస్ సౌత్‌అండియాగా చరిత, రన్నరప్ అష్మిలు గెలుపొందారు. అనంతరం వారికి కిరీటాలను అందించి ఘనంగా సత్కరించారు. వేడుకల్లో ఏఆర్ఆర్ గ్రూప్, ఫార్టీసిక్స్ ఎకర్స్, ఏఆర్ఎం బ్యూటీ, ఈస్ట్రన్ సన్ ఇంజ నీరింగ్ ప్రతినిధులు, తదితరుల పాల్గొన్నారు. యువతులు, మహిళలు ర్యాంప్ వాక్ చేస్తూ సందడి చేశారు.

మాదిగ ఉద్యకారులకు రెండు పార్లమెంట్, ఒక రాజ్యసభ సీట్లు ఇవ్వాలి : ప్రొ. గాలి వినోద్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ మాదిగ ఉద్యమ మేధావులకు వరంగల్, నాగూర్‌కర్నూల్ పార్లమెంట్ సీట్లు ఒక రాజ్యసభ సీటు కాంగ్రెస్ పార్టీ ఇవ్వాలని, అదే విధంగా నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తార్నాక లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అత్యంత కీలక భూమిక పోషించిన మాదిగ సాహితీవేత అందేశ్రీ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆస్తిపన్ను బకాయిలు రూ.19 కోట్లు వసూలు



- వివరాలు వెల్లడించిన జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 అధికారులు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

డివిజన్ పరిధిలో ఆస్తిపన్నుకు సంబంధించిన మొండి బకాయిదారుల నుండి 2023- 24 సంవత్స రానికి గాను పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న వారి వద్ద నుంచి జీహెచ్ఎంసీ అధికారులు బకాయిలు వసూలు చేసినట్లు తెలిపారు. పాత బకాయిలు గత సంవత్సరం నుంచి ప్రస్తుతం ఫిబ్రవరి 5 వరకు సుమా రుగా రూ.19 కోట్ల రూపాయల పన్నును ప్రాపర్టీ సీజ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా యూసుగూడా సర్కిల్ 19 అధికారులు, ఎక్కువ శాతం వ్యాపారస్తులు ఆస్తిపన్ను చెల్లించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ పద్ధతి మార్చుకొని ప్రతి ఒక్కరు బాధ్యతగా ప్రతి సంవత్సరం సకాలంలో పన్ను చెల్లించి, నగర అభివృద్ధికి తోడ్పడాలని జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కమల్ సర్కిల్ పరిధిలోని ఇంటి యజమానులను కోరారు.

బాల్కా సుమన్ జాగ్రత్తగా మాట్లాడాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్



నవతెలంగాణ-ఓయూ

బాల్కా సుమన్ లాంటి వాళ్లు ఒళ్లుదగ్గర పెట్టుకొని జాగ్రత్త మాట్లాడలని లేని యెడల ఓయూకి తీసు కొచ్చి తగిన గుణపాఠం చెప్తామని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతి నిధి చేనగాని దయాకర్‌గౌడ్ హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మీద అనుచిత వ్యా ఖ్యలు మాట్లాడితే బాగుండదని, మళ్లీ ఇంకోసారి సీఎం రేవంత్‌రెడ్డిపైన ఎటువంటి ప్రకటన చేసిన తెలంగాణలో తిరగనివ్వమని హెచ్చ రించారు.రాష్ట్ర దోచుకున్న దొంగలకు కాపలా దారుడు బాల్కా సుమన్ అని, చెన్నూర్‌లో తన్నితే ఇక్కడకు వచ్చి పడ్డాడని విమర్శించారు. పది ఏండ్లు దొంగల దోపిడీ దారుల మీద యుద్ధం చేసి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పై మాట్లాడే స్థాయి నీకు లేదని హెచ్చరించారు. తెలంగాణలో బాల్కా సుమన్, కేటీఆర్ ముక్కు నెలకు రాయాలని హెచ్చరించారు.

సేఫ్టీ లేని రూమ్‌ను నాకు కేటాయించారు



- ఓయూ ఫిజిక్స్ ప్రొఫెసర్స్ డా.కళ్యాణ లక్ష్మీ ఆగ్రహం వ్యక్తం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- నిబంధనలు, సీనియారిటీ ప్రకారమే.. హెడ్ ప్రొ.శ్రీనివాస్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ సైన్స్ కళశాల ఫిజిక్స్ (భౌతికశాస్త్రం), విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాని, తనకు విభాగంలో రూమ్ కేటాయించాలని గత 2 సంవత్సరాల నుండి విభాగంహెడ్, బిఓఎస్(ఎలక్ట్రానిక్)కు వినతి పత్రం ఇచ్చిన ఎవ్వరూ పట్టించుకోవడం లేదని డా.వై.కళ్యాణ లక్ష్మీ తమ ఆవేదనను వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా ఆమె తాను పడుతున్న సమస్యను ఓయూ వీసీ, రిజిస్ట్రార్ ల, ఓయూ ఔట, దృష్టికి తీసు కు వెళ్లినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ విభాగంలో రూమ్ కేటాయించాలని రిజిస్ట్రార్ ఫోన్ విభాగపు హెడ్ ఫోన్ చేసిన కూడా తనకు రూమ్ అలాట్ మెంట్ చేయలేదని, పలుమార్లు తను ప్రశ్నిం చగా మహిళలకు సేఫ్టీ లేని చోట రూమ్ ఎలాట్ మెంట్ చేశారన్నారు. తనకు మహిళ ఫ్యాకల్టీకి కారిడా ర్‌లో 30 నెంబర్ రూమ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన పట్టించునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సేఫ్టీ ఉన్న చోటరూమ్ ఇవ్వాలని కోరితే సేఫ్టీ లేని చోట రూమ్ ఇస్తామని తనపై కక్షసాధింపు చేస్తున్నారన్నారు. స్పెస్ కమిటీ కూడా అన్యాయం చేశారని, సహా మహిళ ఫ్యాకల్టీకి కారిడార్‌లో ఇచ్చి, తనకు ఇవ్వలేదన్నారు. కొందరు ప్రొఫెసర్స్‌కు 1 నుంచి 3రూమ్స్ ఉండగా, తనకు మాత్రం సౌకర్యాలు లేని రూమ్ ఇచ్చారని పరిశోధనలు చేయడానికి ఇబ్బంది పడుతున్నానని తెలిపారు. కొందరు నావ్యక్తిత్వాన్ని కూడా కించపరి చేలా మాట్లాడుతున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సిఐఎస్ఆర్ విద్యార్థులను కూడా వారే కమిటిల్లో ఉంటూ వారికే సిఎస్ఐఆర్ విద్యార్థులను కేటాయింపు చేసుకుంటూ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యహరిస్తున్నారని, నావద్ద పరిశోధన చేసేపీహెచ్డీ విద్యార్థులను టార్గెట్ చేసి మరీ ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 100 ఓయూ లో సహా మహిళ ఫ్యాకల్టీపై ఇంత కక్ష పూరిత చర్యలు ఎంత వరకు సమంజసం కాదన్నారు. ఉన్నతాధికారుల మాటలు కూడా విభాగంలో పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రూమ్ ఇకనైనా కేటా యించక పోతే న్యాయ పరంగా ఉద్యమిస్తానని ఆమె అన్నారు.

నిబంధనల, సీనియారిటీ ప్రకారం రూమ్స్ ఇస్తాం : ప్రొ. శ్రీనివాస్ నాయక్

విభాగంలో సీనియారిటీ, నిబంధనల ప్రకారమే రూమ్స్ ఇస్తామని, కల్యాణలక్ష్మీకి రూమ్ కేటాయించినట్లు తెలిపారు. అంతేకాని ఆమెకు ఇష్టం వచ్చిన రూమ్ కావాలంటే ఎలా ఇస్తామన్నారు. నిబంధనల మేరకు రూమ్‌ను కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లోనే రూమ్ కేటాయిస్తే ఆ రూమ్ వద్దన్నారన్నారు. హెడ్ అని చూడ కుండా అవహేళన చేయడం ఎంత వరకు సమంజసమని, హెడ్‌గా నిబంధనలప్రకారమే వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి : బీఆర్ఎస్వీ



ప్రొ.బసవరావుకు వినతిపత్రం అందజేశారు.

నవతెలంగాణ-ఓయూ

ఇటీవలే వెలువడిన బీ.ఫార్మసీ ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులకు అన్యాయం జరి గిందని, ఒకటి లేదా రెండు సబ్జెక్ట్స్ ఉన్న కానీ ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాల విద్యార్థులను ప్రమోట్ చేయకుండా డిటెన్షన్ చేయడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని వారికి న్యాయం చేయాలని సోమవారం కంట్రోలర్ ప్రొ.రాములుకి బీఆర్ఎస్వీ నాయకులు నాగేందర్‌రావు, అవినాష్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి వినతి పత్రం అందజేశారు.అనంతరం ఓయూ టెక్నాలజీ కళశాల ఫార్మసి డీన్ ప్రొ.బసవరావుకు వినతిపత్రం అందజేశారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-ముషీరాబాద్

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ముషీరా బాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాంనగర్ మేడిబావి బస్తీలో చోటుచేసుకుంది. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి తెలిపిన వివరాల ప్రకారం .అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ మేడిబావి బస్తీలో నివసించే ఎల్.సీతారామ్ తన భార్య, ఇద్దరు కొడుకులతో నివసిస్తున్నాడు. సీతారామ్ కారు డ్రైవర్ కాగా, అతని భార్య కూలిపని చేస్తోంది. పెద్ద కొడుకు ఇంటర్ సెకండ్ ఇయర్ స్థానికంగా చదువుతుండగా, రెండవ కొడుకు ఎల్.ప్రతీక్ (17) నగర శివారు ఇబ్రహింపట్నంలో గల ప్రభుత్వ గురుకుల హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇదిలా ఉండగా గురుకుల హాస్టల్‌లో భోజనం, నీరు తన ఒంటికి పడటంలేదని ప్రతీక్ ఈ నెల 3 వ తేదీన రాంనగర్ మేడిబావి బస్తీలోని తన ఇంటికి వచ్చాడు. ఇదిలా ఉండగా సోమవారం రోజువారి మాదిరిగానే తల్లిదండ్రులు వారి వారి పనుల మీదు బయటకు వెళ్లగా, అన్న కాలేజీకి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం మృత దేహన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడు అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

మానసిక స్థితి లేని వ్యక్తి ఇంట్లో ఎవరికీ తెలియకుండా ఇంటి నుంచి వెళ్ళిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ సీఐ నవీన్ కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఐడీపీఎల్ కాలనీ, గిరినగర్ ప్రాంతానికి చెందిన చందుపట్ల పోలిశెట్టి గత కొంతకాలంగా అనారోగ్య పరిస్థితి సరిగాలేక ఈనెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చుట్టుపక్కల వారిని, పరిసర ప్రాంతాల్లో వెతికినా సమచారం తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



- మంత్రి కార్యక్రమాలు అధికారులు పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాలో పాల్గొనే కార్యక్రమాలు జిల్లా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల తహసిల్దార్‌లతో మాట్లాడుతూ తమ పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని.. ఎలాంటి జాప్యం చేయొద్దన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 66 అర్జీలు రాగా.. 24 గృహ నిర్మాణ శాఖవి, మరో 44 ఇతర శాఖలకు సంబంధించినవి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు సూర్యప్రకాష్, రవికుమార్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్ట్యా సోమవారం చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్‌లో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), వీవీ ప్యాట్స్, సీయూ, బీయూలను హైదరాబాద్ జిల్లా ఉప ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. మొదటి విడత తనిఖీ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈవీఎం యంత్రాల మొదటి విడత తనిఖీ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈవీఎంలపై ఎలాంటి అనుమానాలకు చోటు లేకుండా ప్రక్రియ జరుగుతుందని, వీవీ ప్యాట్స్, సీయూ, బీయూ సంబంధిత వాటి గురించి ఈసీఐఎల్ ఇంజనీర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



ఐదేండ్లలోపు పిల్లలందరికీ
పల్స్‌పోలియో టీకా తప్పనిసరి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐదేండ్లలోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో టీకా తప్పనిసరిగా వేయించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. జిల్లా అంతటా ఇంటెన్సివ్ పోలియో ఇమ్యునైజేషన్ క్యాంపు నిర్వహించడానికి ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉప వైద్య అధికారి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. మాస్ స్కేల్ ఇమ్యునైజేషన్ డ్రైవ్‌ను నిర్వహించడానికి సంసిద్ధతను నిర్ధారించడానికి, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులందరికీ డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ ద్వారా శిక్షణా కార్యక్రమం కలెక్టరేట్‌లోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ స్వామి మాట్లాడుతూ స్కేల్ ఆఫ్ కవరేజీని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా బస్ స్టేషన్లు, ప్రార్థనా స్థలాలు, రైల్వేస్టేషన్లు సహా అన్ని బహిరంగ ప్రదేశాల్లో విస్తరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, లైన్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యాశాఖ, సమగ్ర శిశు ఆరోగ్యశాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా స్వయం సహాయక బందాలు, నర్సింగ్ కళాశాలల వాలంటీర్లు పోలియో టీకాల కార్యక్రమంలో నిమగ్నం చేయాలన్నారు. వలస జనాభా, సంచార సంఘాలు, నిరాశ్రయుల కవరేజీని విస్తరించడానికి, బూత్‌లలో టీకాలు వేయకుండా తప్పిపోయిన పిల్లలను గుర్తించి, టీకాలు వేయడానికి ఇంటింటికీ (మాప్-అప్ రౌండ్లు) నిర్వహించాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ప్రాణాలను రక్షించే డోస్‌ను ఏ పిల్లవాడూ కోల్పోకుండా చూడాలని తెలిపారు.

కాకతీయ హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవ తెలంగాణ - ముషీరాబాద్

కాకతీయ హై స్కూల్ రాంనగర్ విద్యార్థుల ప్రతిభ మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఒకినోవా కరాటే అకాడమీ వారు ఐదవ సేవాలాల్ కరాటే చాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల విద్యార్థులు వారి పాఠశాల తరఫున పోటీలలో పాల్గొన్నారు. హైదరాబాద్ లోని రాంనగర్ కు చెందిన కాకతీయ హై స్కూల్ విద్యార్థులు 22 మంది పాల్గొనగా నాలుగు గోల్డ్, పదకొండు సిల్వర్ ఏడు బ్రోంజ్ మెడల్స్ ను సాధించి అందరికి అందరూ తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ గోక నవీన్, ప్రిన్సిపల్ రామరాజు బల్వంత రావు, మెడల్స్ సర్టిఫికెట్స్ బహూకరించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోక నవీన్, ప్రిన్సిపల్ రామరాజు బల్వంత రావు, ఉపాధ్యాయులు దనమ్మ, శిల్ప, నరేందర్, విన్సెంట్ లు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం అంబర్ పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో సుమారు రూ. 55 లక్షల వ్యయంతో నూతనం గా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి బస్తీలలో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతను పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ, రమేష్, ఎస్ఎఫ్ఏ భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

కుష్టు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం జాతీయ కుష్టు నివారణ అవగాహన కార్యక్రమాన్ని అంబర్‌పేట పటేల్ నగర్ లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇ.విజయ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 తేదీ వరకు స్పార్ష్ సంస్థ ఆధ్వర్యంలో కుష్టు నివారణ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లవంగు అంజనేయులు, మోహన్, వంజరి నాగరా జు, రాజు, శ్రీనివాస్ గుప్తా పాఠశాల ప్రిన్సిపల్, ఆశ వర్కర్లు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి మల్లేష్



నవతెలంగాణ మెహదీపట్నం

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయు ఆధ్వర్యంలో 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి మల్లేష్ పిలుపునిచ్చారు. సీఐటీయు నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మెకు మద్దతుగా నాంపల్లిలో జరిగిన ప్రదర్శనకు ఆయన హాజరైన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలకు చేసిందేమిలేదని, యువతకు ఉద్యోగ కల్పనలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కార్మికులు, కర్షకులు ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 16న సీఐటీయు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెకు మద్దతునివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకురాలు యాదమ్మ, అంసమ్మ శంకర్, నరసింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు ఫోన్ నెంబర్లు లింక్ అప్ చేసుకోండి

విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ శ్యాంసుందర్ రెడ్డి



నవతెలంగాణ మెహిదీపట్నం

విద్యుత్ వినియోగదారులు వారి విద్యుత్ సర్వీస్ మీటర్ల నెంబర్లకు వారి ఫోన్ నెంబర్లు లింక్ అప్ చేసుకోవాలని మెహదీపట్నం డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సి. శ్యాం సుందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెహదీ పట్నంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మాట్లాడ ుతూ వినియోగదారులు వారి విద్యుత్ సర్వీస్ నెంబర్లకు వారి ఫోన్ నెంబర్లు లింక్ అప్ చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. నెలవారి విద్యుత్ బిల్లులు వారి ఫోన్ నెంబర్లకు వస్తాయని, ఎప్పుడైనా విద్యుత్ ప్రసారంలో అంతరాయం ఏర్పడితే ఆ విషయము ముందుగా మెసేజ్ రూపంలో వారికి విద్యుత్ అంతరాయం గురించి సమాచారం అందుతుందని, బిల్లు చెల్లించినప్పుడు బిల్లు చెల్లించిన మెసేజ్ వస్తుందని తెలిపారు. కాబట్టి వినియోగదారులు వారి మీటర్లకు ఫోన్ నెంబర్లు లింక్ లేనిచో ఆన్‌లైన్ లింక్‌ను ఉపయోగించి లింక్ అప్ చేసుకోవచ్చని ఆయన చెప్పారు. ఎవరైనా వినియోగదారులు ఆన్‌లైన్ లో లింక్ చేసుకోవడం తెలియకపోతే వారు తమ ఇంటికి మీటర్ రీడింగ్ నిమిత్తం వచ్చే విద్యుత్ సిబ్బందికి తమ ఫోన్ నెంబర్లు ఇచ్చినట్లయితే తమ సిబ్బంది ఆ ప్రక్రియను పూర్తి చేస్తారని ఆయన తెలిపారు.

టీఎస్ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-అంబర్‌పేట

టీఎస్ఎస్పీ డీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. టీఎస్ఎస్పీడీసీఎల్ సీజీఎం చక్రపాణి, సూపర్ ఇండెంటింగ్ ఇంజనీర్ రాంజీలు ముఖ్య అతిథులుగా హాజరై క్యాలెండర్‌నీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్పీడీసీఎల్ జేఏసీ చైర్మన్ పారునంది భాస్కర్, ప్రతినిధులు ఎ.రాములు, శశికాంత్, మైపాల్రెడ్డి, రంజిత్రెడ్డి, విశ్వేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, యాదాద్రి స్వామి, నల్గొండ బ్రహ్మాచారి, హుజూర్నగర్ నాగిరెడ్డి, ప్రవీణ్రాజు, వనపర్తి సాయి, మహబూబ్ నగర్ మోహన్ కుమార్, నాగర్ కర్నూల్ మల్లయ్య, వనపర్తి రమేష్, దేవరకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ జేఏసీ నాయకులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల జేఏసీ ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగు లను రాష్ట్ర ప్రభుత్వ హెల్త్ డిపార్ట్మెంట్లు విలీనం చేసుకొని మాకు న్యాయం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహను కలిసి కోరామన్నారు. ఈ విషయం పై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. వెంటనే ప్రిన్సిపాల్ హెల్త్ సెక్రటరీ వివరణ కోరుతూ లెటర్ పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ నాయకులు ఎ. రంజిత్ కుమార్, టి.శివప్రసాద్, శ్రీదేవి శ్యామ్ సుందర్, సతీష్ కుమార్, ప్రవీణ్ రెడ్డి, జాబి ప్రశాంత్ నాయకులు పాల్గొన్నారు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- ఈనెల 28 నుంచి మార్చి 19వరకు పరీక్షలు
- జిల్లావ్యాప్తంగా 242 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న1.74లక్షల మంది విద్యార్థులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేస్తుంది. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇందుకోసం జిల్లాలో మొత్తం 242 కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. ఈ పరీక్షలకు సుమారు 1.74 లక్షలకుపైగా విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరగకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, వైద్యశాఖ, పోలీసు, ఆర్టీసీ, జలమండలి, పోస్టల్ అధికారులతో అదనపు కలెక్టర్ మధుసూదన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

మౌలిక సౌకర్యాల కల్పనలో లోటుపాట్లు ఉండొద్దు..!

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలి. సెంటర్లలోకి ఉదయం 8.30 వరకు అనుమతించనున్నారు. విద్యార్థులందరూ ఆ సమయానికల్లా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా స్పెషల్ బస్సులను నడపాలని, ముఖ్యంగా విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాలకు క్యాలిక్యులేటర్లు, సెల్ ఫోన్లు, పెన్ డ్రైవ్లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్సు షాపులను మూసివేసి 144 సెక్షన్ విధించనున్నారు. పరీక్షా కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష సమయంలో విదుత్తు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్తుశాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని జలమండలి అధికారులకు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్తు, వాటర్ వర్క్స్, వైద్య, విద్యా శాఖలు తమ పూర్తి సహకారాన్ని అందించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో డీసీపీ బాబురావు, డీఐఈవో ఒడ్డెన్న, జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్. రోహిణి, మెడికల్ ఆఫీసర్ వెంకటి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమకారులపై ఖమ్మం సీపీ చేసిన అనుచిత వ్యాఖ్యలు తగవు

- పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన చిన్నపాటి గోడవను బూచిగా చూపి సీపీఐ(ఎం) ప్రజాపంథా పార్టీ నాయకులు, పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల అశోక్, మాజీ కార్యదర్శి సివై.పుల్లయ్యలతో పాటు ప్రజా సంఘాల నేతలు తిమ్మిడి హనుమంతరావు, అశోక్, గడ్డం లక్ష్మణ్, శ్రీను తదితరులపై ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ రౌడీషీటర్లు అంటూ సంభోదిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని సీపీ తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు చేస్తూ, ప్రజల కోసం పోరాటాలు చేస్తున్న ప్రజాపంథా పార్టీ నాయకులను రౌడీ షీటర్, నేర ప్రవృత్తి అనే అమానుష పదజాలంతో కూడిన వ్యాఖ్యలు చేసిన ఖమ్మం కమిషనర్ సీపీ సునీల్ దత్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాలని కోరారు. అక్రమంగా పెట్టిన రౌడీ షీటర్, కుట్ర కేసులను ఎత్తివేయాలని తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల భవిష్యత్తులో జరిగేటువంటి పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహా రావ్, నరేందర్, సంధ్య భాస్కర్, అనిల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అఖిల్ ప్రవీణ్ రాష్ట్ర నాయకులు సీతారాం, రాకేష్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ క్రిస్టియన్లకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి'

- తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్ రవి కుమార్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ ఉద్యమం కీలక దశలో ఉన్నప్పుడు సహాయ నిరాకరణ మిలీనియం మార్చ్, సకల జనుల సమ్మె తదితర కార్యక్రమాల్లో తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఎంతో కీలక పాత్ర పోషించిందని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్, పాస్టర్ జీలుకర రవి కుమార్ అన్నారు.ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా జీలుకర రవి కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రిస్టియన్లకు మొండిచేయి చూపిందని, తెలంగాణ క్రిస్టియన్లకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, తెలంగాణలోని చర్చిలకు ప్రభుత్వం భూమిని కేటాయించి చర్చి నిర్మాణం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ పాస్టర్లకు ప్రభుత్వం ద్వారా ప్రతి నెల వేతనం చెల్లించాలని, తెలంగాణ పాస్టర్ పిల్లలకు ఉచిత విద్య సౌకర్యం కల్పించాలని, ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటు కట్టుకునే రుణం చెల్లించాలని ఆయన సీఎం ఎ.రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ డా.నల్లూరి బాబురావు, రిటైర్డ్ ఐపీఎస్ బాబురావు, మేకల సాంయ్య సురేందర్, రత్నారాజు తదితరులు పాల్గొన్నారు.

'పాదాచారులు వాహనాలకు వ్యతిరేక దిశలో నడవాలి'

- హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ఐపీఎస్ పి.విశ్వప్రసాద్
- జాతీయ రహదారి భద్రత మహోత్సవాల సందర్భంగా నారాయణగూడలో భారీ అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పాదాచారులు వాహనాలకు ఎప్పుడు వ్యతిరేక దిశలో నడవాలని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ఐపీఎస్ పి.విశ్వప్రసాద్ సూచించారు.సోమవారం జాతీయ రహదారి భద్రత మహోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నియమాలపై నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ కళాశాల నుంచి శాంతి థియేటర్ వరకు రెండు వేల మంది విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పి.విశ్వప్రసాద్ మాట్లాడుతూ రహదారులపై పాదాచారులు నిర్లక్ష్యం వహించరాదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను అనుసరించి, ప్రమాదాలను నివారించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ రూల్స్, రెగ్యులేషన్స్ తెలుసుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఓవర్ స్పీడ్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సెల్ ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ వారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారులపై క్రమ శిక్షణతో వ్యవహరించి తమ రక్షణ, ఇతరుల రక్షణకై వాహ నాలను జాగ్రత్తగా నడపాలని కోరారు .కళాశాలల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేయరాదని, అవి చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో టిటిఐ బేగంపేట్ ఏసీపీ జి.శంకర్ రాజ్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎస్.అశోక్ కుమార్, ఈస్ట్ జోన్ ఏసీపీ ఎస్.సంపత్ కుమార్, నారాయణగూడ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, కేశవ్ మెమోరియల్ కళాశాల డైరెక్టర్ నాగేశ్వర్ రావు, వి. శాంతి, ప్రిన్సిపాల్ ఎ.సుబ్రహ్మణ్యం, సెక్రెటరీ ఎల్.ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం సేవా పంపిణీ బ్రోచర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అయోధ్యలోని రామ మందిరం హనుమాన్ గడ్ వద్ద ఉస్మాన్ గంజ్ కు చెందిన భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 20నుండి మార్చ్ 2వ తేదీ వరకు ప్రతిరోజూ సుమారు 30వేల మంది రామ భక్తులకు ఉచితంగా అల్పాహారం, అన్నప్రసాదం, మంచినీటి సేవా కార్యక్రమాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని బాస్ అధ్యక్షులు క్యాతం రాధా కృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాదికారి మేడిశెట్టి రాకేష్ లు తెలిపారు. ఈ మేరకు సోమవారం అబిడ్స్, బొగ్గులకుంటలోని, తెలంగాణ సరస్వతీ పరిషత్తు ఆడిటోరియంలో అన్నదాన బ్రోచర్, అన్న ప్రసాద వెబ్‌సైడ్ లను వీహెచ్‌పీ రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ యాదిరెడ్డి, సాస్ అల్ ఇండియా ఆర్గనైసింగ్ సెక్రటరీ నాయిని బుచ్చిరెడ్డి, బాస్ సలహాదారులు దేవర రాజేశ్వర్, వెంకటేశం గుప్త చేతులు మీదుగా ప్రారంభించారు. భక్తులకు బాస్ సంస్థ తమవంతు సహాయంగా అన్నదానం చేయడానికి ముందుకు రావడం సంతోషకరమని కొనియాడారు.

ముఖ్యంగా బాస్ శబరిమల నిలకల్ వద్ద అన్నదానం, ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు మంచి నీటి పంపిణీ, గోశాల నిర్వహణ, 40మంది అనాధ చిన్నారులను హక్కున చేర్చుకొని వారికీ వసతి, విద్య, వైద్యం అందించి వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు చేస్తు న్న కృషి ఎంతో గొప్పదన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్- 9848083376, 9396601234 నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్ర మంలో శివ శంకర్, నాగరాజు గౌడ్, వెంకటేశం గురు స్వామి , హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

- అన్నీ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర బడ్జెట్ 47 కోట్ల 65 లక్షల 768 కోట్లు బడ్జెటులో బీసీల సంక్షేమానికి బిక్షం ఇచ్చినట్లుగా కేవలం 2150 కోట్లు బడ్జెటు మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేశారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య విమర్శించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, గువ్వల భరత్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎంపీ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో బీసీలకు కేటాయించిన మొత్తం చూస్తే దేశంలో 75 కోట్ల మంది బీసీలకు పంచితే చాక్లెట్లు బిస్కెట్లు కూడా రావన్నారు. బీసీల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధి, ఎలాంటి స్కీములు కేటాయింపులు లేవు. కేంద్రీయ విద్యా సంస్థలలో లక్షలాది బీసీలు చదువుకుంటున్నారు. వారికి ఫీజు రియంబర్స్మెంట్ లేదు స్కాలర్ షిప్ లేదు, హాస్టళ్ళు లేవు. కేంద్ర స్థాయిలో స్కాలర్ షిప్ ఫీజుల రియంబర్స్మెంట్ స్కీములు హాస్టళ్ళు లేవు. గురుకుల పాఠశాలలు లేవు. వీటిని నిర్వహిస్తున్న రాష్ట్రాలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదు. కులవృత్తులకు స్వయంగా ఉపాధి పథకాలకు, జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇవ్వడంలేదని తెలిపారు. జాతీయ బీసీ కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయించకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో బీసీలకు అన్నీ పార్టీలు 50 శాతం సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, బీఆర్ఎస్ అన్నీ పార్టీల అధ్యక్షులను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలో బలంగా యున్నవి. బీజేపీ అధికారంలో ఉంది.బీసీలకు ఇవ్వడానికి ఎవరు సాకులు అవసరం లేదు. ఈ మూడు పార్టీలు బీసీలకు ఇస్తే గెలిపిం చుకుంటామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు జనగణనలో కులగనన చేయడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.ఈ మహా ధర్నాలో మురళి, ముత్యం వెంకన్న గౌడ్, కిరణ్, బ్రహ్మిందర్, సునీత, యుగేందర్, కృష్ణమాచారి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి విచారణకైనా సిద్ధం

- ఆరోపణలు రుజువు చేస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తా
- రుజువు చేయకపోతే పరువు నష్టం దావా వేస్తా
- ఐపీఎం డైరెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నేతలు
- అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్



నవతెలంగాణ- అంబర్‌పేట:

తనపై వచ్చిన ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఐపిఎంలోని కొంత మంది ఉద్యోగ సంఘం నేతలు తన పై చేసిన ఆరోపణలను నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానని ఆయన ప్రకటించారు. ఆరోపణలను రుజువు చేయకపోతే ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నారాయణగూడలోని ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలను టీఎన్జీవోస్ నేతలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ తన వ్యక్తిగత పరువుకు నష్టం కల్గించిన ఉద్యోగ సంఘం నేతలపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఐపిఎంపై, తనపై తప్పుడు ప్రకటనలు చేసిన ఉద్యోగ సంఘం నేతలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు ఆరోపణలు చేసిన ఉద్యోగ సంఘం నేతలపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. టీఎన్జీవోస్ నగర అధ్యక్షుడు కె.శ్రీకాంత్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ నేతలపట్ల వ్యక్తిగతంగా, యూనియన్పై అసత్యపు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని, అలాంటి వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ నేతలు చిలుక నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌడ్, బీటీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మల్లారెడ్డి, ఎ. శ్రీనివాస్, రాజేశ్వర్ రావు, ఐపిఎం నేతలు ఎం. శ్రీనివాస్ రావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు ఎనిమిది సీట్లు కేటాయించాలి

- రాజకీయ పార్టీల కార్యాలయాలలో వినతి పత్రం అందజేత
- బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు ఎనిమిది సీట్లు కేటాయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ భవన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్, బీజేపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డిలనుకలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బూరుగుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధంగా, బీసీలను రాజకీయంగా అణచి వేసున్నాయని , జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక, ఉపాధి, రాజకీయ రంగాలలో సమానవాటా కల్పించాలని, బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించిన రాజకీయ పార్టీకే మా మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు ఆకుల శ్రీనివాస్, శివ రాములు, వెంకటేష్ యాదవ్, సె లేటి వెంకటేష్, గొడుగు నరసింహులు, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బీజేపీ కార్పొరేట్ - మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

- 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి
- భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు)



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర బీజేపీ కార్పొరేట్ - మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఐఎఫ్‌టీయు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ కేంద్ర బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీట్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటింటికి వెళ్లి క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె - గ్రామీణ భారత బంద్ నిర్వహించాలని జాయింట్ ప్లాట్ ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఉద్యోగ సంఘాలు అఖిల భారత ఫెడరేషన్లు సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత స్థాయిలో నిర్ణయించాయన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే పది సంవత్సరాలు పూర్తయిన రైతాంగం కార్మిక వర్గం ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. అచ్చాదిన్ ఆయేగా, విశ్వగురు, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలిచ్చినా ఏమీ ఒరగలేదు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామినిచ్చారు. నేడు ఉద్యోగ కల్పన పడిపోయింది. నిరుద్యోగం గత 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరిందన్నారు. శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గిపోయాయి. ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తున్నది. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థల్లో 100 శాతం వాటాలు తెగనమ్ముతున్నదీ అని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తలపెట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు లక్షలాదిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్. పద్మ, యం. హన్మేష్, సత్యనారాయణ, విష్ణులు పాల్గొన్నారు.



నా కొడుకుని చూసి గర్వపడుతున్నా...

నాలుగు భాషల్లో ఎన్నో విజయాలు అందుకున్నారు. ఆరు పదుల వయసులోనూ భార్య, తల్లి, నటి, నిర్మాత, దర్శకురాలు ఇలా భిన్న పాత్రలతో నేటితరానికి ఆదర్శంగా నిలిచారు. కేరళలో జరిగిన ఓ ఈవెంట్‌లో సుహాసిని పాల్గొని, తన కొడుకు లైఫ్‌స్టైల్ గురించి మీడియాతో పంచుకున్నారు. సహజంగా తలిదండ్రులు ఇద్దరూ చిత్రపరిశ్రమలో ఉంటే పిల్లలూ ఆ వైపుగా అడుగులు వేస్తారు. కానీ తన కుమారుడు ఆ దారిలో రాలేదని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న కొన్ని సంగతులు...

తమిళనాడులోని పరమకుడి మా ఊరు. మాది ఉమ్మడి కుటుంబం. మా ఇంట్లో కారు కాదు కదా, కనీసం ఫ్రిజ్ కూడా ఉండేది కాదు. నేను చదువుకున్నది కూడా మున్సిపల్ స్కూల్లోనే. నాన్న చారు హాసన్, బాబాయి కమల్‌హాసన్ అప్పటికే సినిమాల్లో నటిస్తున్నారు. నాన్నకు తోడుగా ఉంటానని నన్నూ పంపారు. రామకృష్ణ మిషన్ వారి శారద విద్యాలయ, క్వీన్ మేరీస్ కాలేజీలో నా చదువు సాగింది. మనం వేసుకునే దుస్తుల నుంచి చేసే పనుల వరకూ అన్నింటినీ అందరూ గమనిస్తారు. అందుకే ప్రతి పనిలోనూ జాగ్రత్తగా, బాధ్యతగా ఉండటం అలవాటు చేసుకున్నా. నాకు బాగా ఇష్టమైన దర్శకులు కె. బాలచందర్, సత్యజిత్ రే. బాలచందర్ దర్శకత్వంలోని 'సింధు భైరవి'లో నా పాత్రకు జాతీయ పురస్కారం దక్కింది.

అనుకోకుండా నటినయ్యా..

చదువుకునే రోజుల్లో బ్యాంక్ మేనేజర్ కావాలనేది నా కల. నాన్నేమో నన్ను ఇంజినీర్‌గానో, కలెక్టర్‌గానో చూడాలనుకున్నారు. అమ్మ నన్ను ఇంగ్లీష్ లెక్చరర్ చేయాలనుకునేది. కానీ అవేవీ కాకుండా.. బాబాయ్ ప్రోత్సాహంతో సినిమాటోగ్రఫీ కోర్సులో చేరాను. అచ్చంగా పక్కింటి అమ్మాయిలా ఉంటానని బాలూ మహేంద్రగారు హీరోయిన్‌గా అవకాశం ఇచ్చారు. మొదటి సినిమాకే ఉత్తమనటిగా తమిళనాడు ప్రభుత్వ అవార్డు వచ్చింది. అప్పటికి నా వయసు పందొమ్మిది. మణిరత్నంగారి అన్నయ్య, మా నాన్నగారు మంచి స్నేహితులు. వాళ్ల ముందే మాట్లాడుకుని మా పెండ్లి నిశ్చయించారు. ఆ తర్వాతే మమ్మల్ని ఓసారి కలిసి మాట్లాడుకోమని చెప్పారు. అప్పుడే మళ్లీ కలిశాం. కాసేపు మాట్లాడుకున్నాక తెలిసింది.. మా ఇద్దరి ఆలోచనలు, అభిరుచులు ఒక్కటేనని. అలా మా పెండ్లి జరిగింది. నాకు చదవడం, రాయడం, నేర్చుకోవడం.. చాలా ఇష్టం. ఒకే చట్రంలో ఎప్పుడూ ఇరుక్కుపోకూడదు. లాక్‌డౌన్‌లో దొరికిన సమయాన్ని వృథా చేసుకోకుండా పియానో నేర్చుకున్నా. దక్షిణాది భాషల్లో అనర్గళంగా మాట్లాడగలను. ప్రస్తుతం ఫ్రెంచ్ నేర్చుకుంటున్నా. దర్శకురాలిగా టీవీ సిరీస్‌తోపాటు షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్ చేశా. ఓ మీడియా ఆర్గనైజేషన్‌తోనూ పనిచేస్తున్నా. రాజా రవివర్మ చిత్రాలను రీక్రియేట్ చేసేందుకు కృషి చేస్తున్నా. 'ఎన్ఎఎం' ఫౌండేషన్ ద్వారా సమాజంలో అవసరమైన వారికి చేయూత అందిస్తున్నాం' అంటూ ఆమె చెప్పారు.



తృప్తిగా ఉన్నాను

ఈ మధ్యకాలంలో కేరళలో రాష్ట్ర ఫిల్మ్ అకాడమీ నిర్వహించిన హ్యాపీనెస్ ఫెస్టివల్‌లో భాగంగా తాలిపరంబలో రెండవ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెను కొడుకు నందాహాసన్ గురించి మీడియా ప్రశ్నలు వేయగా.. అతని లైఫ్‌స్టైల్ పట్ల తాను తృప్తిగా ఉన్నానని చెప్పారు. 'నందన్ ఇతర పిల్లల్లా కాదు. చిన్నతనంలో పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత భారత పార్లమెంటు సమావేశాల టెలికాస్ట్‌ను సీరియస్‌గా చూసేవాడు. నేను ఇలాంటి బిడ్డకు జన్మనిచ్చానా అని ఆశ్చర్యపోయాను. పన్నెండేండ్ల వయస్సులో 'పెట్టుబడి' గంథ్రం చదవడం ప్రారంభించాడు. ఓ రోజు చేతిలో పుస్తకం పట్టుకుని సిపిఎం కార్యాలయానికి వెళ్లాడు. తన వద్ద కారు ఉందని పార్టీ సభ్యులకు తెలియకూడదని, దానిని వేరేచోట పార్క్ చేయమని చెప్పి ఆఫీసులోకి వెళ్లాడు. పార్టీ సభ్యులు నందాను మొదట అడిగింది 'భోజనం చేశావా?' అని. అది కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేకత. అతను ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడు అని వారు అడగలేదు. నందా అన్నం తిన్న తర్వాత పార్టీ కార్యదర్శిని కలిశాడు. తన తండ్రి పేరు గురించి అడిగినప్పుడు, మణిరత్నం అని చెప్పకుండా అసలు పేరు గోపాలరత్నం సుబ్రమణ్యం అని చెప్పాడు. అమ్మ పేరు అడగ్గా సుహాసిని అని చెప్పాడు. వెంటనే ఆయన మణిరత్నం కొడుకువా? అని అడిగారు. అప్పటి నుండి నందా వాలంటీర్ సభ్యుడుగా చేరాడు. తర్వాత కాలంలో కమ్యూనిస్టు భావజాలంతో ముందుకు వెళుతున్నాడు. అందుకు నేను గర్వపడుతున్నా' అని అన్నారు.

సేకరణ: సోషల్ మీడియా నుండి



ఉద్యోగం, వ్యాపారం ఏదైనా సరే తమ కాళ్ల మీద తాము నిలడాలి. ముఖ్యంగా మహిళలు దీనిపై దృష్టి పెట్టాలి. ఇంట్లో వాళ్ళు చూసుకుంటారులే అనుకుంటే ఏదైనా అనుకోనిది జరిగినప్పుడు చాలా కష్టంగా మారుతుంది. ఆర్థిక విషయాల గురించి ఇంటి కోసం ప్రత్యేకంగా ఓ బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి. సంపాదనకు తగ్గట్టు ఖర్చులను నియంత్రించుకోవాలి. ఆపదలూ, అవసరాన్ని సమన్వయం చేసుకుంటూ ఆర్థిక ఒత్తిడి ఇంటికి తగలకుండా చూసుకోవాలి. అలాంటి కొన్ని ఆర్థిక క్రమశిక్షణ కోసం పాటించాల్సిన కొన్ని విషయాలను తెలుసుకుందాం...

ఆర్థికంగా ఎదగాలంటే..?

ఏ నెల జీతం ఆ నెలే ఖర్చయితే భవిష్యత్తులో చాలా కష్టం. అందుకే ఖర్చులు తగ్గించుకుంటూ కొంత పొదుపు కేటాయించుకోవాలి. అలాగని నెలకు ఎంతో కొంత మొత్తాన్ని తీసి పొదుపు చేస్తే చాలు. అదే ఆర్థిక ప్రణాళిక అనుకుంటారు చాలా మంది. కానీ ఇది కాదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాల జాబితా సిద్ధం చేసుకోవాలి. వచ్చే ఆదాయంలో కనీసం ముప్పై శాతమైనా పొదుపు కోసం కేటాయించుకోవాలి. మీ స్థాయికి తగ్గట్టు ఎంతైనా పెట్టుబడిగా పెట్టొచ్చు. ఏడాదికేడాది దీన్ని పెంచుకుంటూ వెళ్లడం వల్ల ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది. ఇలా కాకుండా అప్పు చేసి మదుపు చేయడం, అవసరానికి మించి ఖరీదైన వస్తువులు కొనడం వంటివి మీ జీవితాన్ని కల్లోలం చేస్తాయి. ఇది పెట్టుకొని లెక్కలు వేయాలి.

ప్రతిదీ రాయాల్సిందే

చాలా మందికి డబ్బు లెక్కలు పెద్దగా పట్టవు. ఆదాయం, ఖర్చుల వివరాలు రాయడం అసలే ఇష్టం ఉండదు. విలాసాలు, అవసరాలకు మధ్య తేడానూ గుర్తించరు. ఇలాంటప్పుడు చిక్కుల్లో పడటం ఖాయం. మీరూ అలా చేస్తుంటే వెంటనే మీ పద్ధతి మార్చుకోండి. ఆదాయ, వ్యయాల మధ్య సమతూకం కుదరాలంటే ప్రతీ ఖర్చూ కచ్చితంగా రాసుకోవల్సిందే.

మీరే నిర్ణయించుకోవాలి

నేటి అవసరాలను తీర్చుకుంటూనే భవిష్యత్ వ్యయాలనూ అంచనా వేయాలి. ఉదాహరణకు ఇంట్లోకి కావాల్సిన వస్తువులు కొనడం స్వల్పకాలిక అవసరం. సొంతిల్లు, కారు కొనాలనుకోవడం మధ్య కాలిక లక్ష్యాలు. పదవీ విరమణ, పిల్లల వివాహం దీర్ఘకాలిక వ్యూహాలు. మీ ఇంటి పరిస్థితులకు అనుగుణంగా వాటిని మీరే నిర్ణయించుకోవాలి. వీటిపై స్పష్టత వస్తేనే మన దగ్గర ఉన్న వనరుల్ని ఎలా వినియోగించుకోవాలో తెలుస్తుంది. వాటిని ప్రతి రెండు నెలల కోసారి సమీక్షించుకోవాలి. ఖర్చుల నియంత్రణ సూత్రాన్ని ఇంట్లోని ప్రతి ఒక్కరూ పాటించేలా చూసుకోవాలి.

ముందుగానే ఊహించండి

ప్రణాళికా బద్ధంగా పెట్టుబడులు పెడుతున్న సమయంలో మధ్యలో ఏదో చిన్న కష్టమొచ్చిందని వాటిని వెనక్కి తీసుకుంటారు చాలా మంది. అలా చేయొద్దు. ఈ తీరు మీ ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీస్తుంది. దీనికి బదులుగా ఇలాంటి పరిస్థితుల్ని ముందుగానే ఊహించుకోవడం అలవాటు చేసుకోండి. వీటిని దాటేయడానికి కొంత అవ్యవసర నిధిని ఏర్పరుచుకోండి. మీ కుటుంబ బడ్జెట్‌లో దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వండి. దాన్ని ఆపత్కాలంలో ఆరు నెలల పాటు రోజువారీ జీవితాన్ని గడపడానికీ, వాయిదాల చెల్లింపులకు ఉపయోగపడేలా సిద్ధం చేసుకోండి. అప్పుడే మీ లెక్క తప్పదు.

ఆన్‌లైన్ షాపింగ్‌తో జాగ్రత్త

ఏ వస్తువు కొన్నా ఆచితూచి కొనడం మహిళలకు అలవాటే. కానీ ఈ మధ్య ఆన్‌లైన్ షాపింగ్ మన ఆలోచనల్ని మార్చేస్తుంది. అవసరమున్నా లేకున్నా కొనేస్తున్నాం. ఇందుకు ఆకర్షణీయమైన చిత్రాలూ, ప్రకటనలూ, రాయితీలు వంటివి ఏవైనా కావొచ్చు. ఈ వ్యాలెట్లలో డబ్బులు నింపి ఉంచడం, ఆయా షాపింగ్ వెబ్‌సైట్లలో కార్డుల వివరాలు నమోదు చేయడం, ఆటోమేటిక్ డెబిట్ ఆప్షన్లు తీసుకోవడం వంటి సదుపాయం వల్ల కూడా త్వరపడి కొనేస్తుంటాం. వాటికి దూరంగా ఉండండి. ఒకవేళ ఏదైనా కొనాలనుకున్నా వాయిదాలు చెల్లించేలా కాకుండా పొదుపు చేసి కొనడానికి ప్రయత్నించండి. ఇవన్నీ మీ బడ్జెట్ పద్దుల్ని తలకిందులు కానివ్వవు.



హరీషే అబద్ధాలు చెబుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

షెకావత్‌ని కలిసి కూడా ప్రాజెక్ట్‌లు అప్పగించేది లేదని ఖరాఖండీగా చెప్పినట్టు గుర్తు చేశారు. తెలంగాణ వచ్చింది వీళ్ళ వల్ల కాదు, చిదంబరం కేంద్రంలో ఆల్ పార్టీ మీటింగ్ పెట్టి ఒప్పించడం వల్లేనని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ తెలంగాణలో ఓట్లను ప్రభావితం చేయడానికి ఓటింగ్ రోజున జగన్‌తో మాట్లాడుకుని పోలీసులను నాగార్జునసాగర్ డ్యామ్ మీదకు పంపి కుట్ర చేశారని తెలిపారు. రాజకీయంగా లబ్ధి పొందడానికే కేసీఆర్ ఈ నాటకం ఆడారని వ్యాఖ్యానించారు.

ప్రాజెక్టుల తనిఖీకి ఎన్‌డీఎస్‌ఏ రాక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) అధికారులు తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులను తనిఖీ చేయనున్నారు. ఈమేరకు ఢిల్లీలోని ఆ శాఖ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్రానికి లేఖ అందింది. ఇప్పుడు ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే విషయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ అధికారుల రాక ఒకింత ఆసక్తి రేకెత్తిస్తున్నది. నీటి వాటాల విషయంలో అరోపణలు, విమర్శలు చోటుచేసుకుంటున్న తరుణంలో ఎన్‌డీఎస్‌ఏ అధికారులు తనిఖీకి రావడం అనుమానాలకు తావిస్తున్నది. అయితే ఈ తనిఖీలు సాధారణమేనని అధికారులు అంటున్నారు. ప్రోటోకాల్ ప్రకారమే ఎన్‌డీఎస్‌ఏ అధికారులు మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు డ్యామ్, 16న నాగార్జున సాగర్ డ్యామ్‌ను పరిశీలించనున్నారని చెబుతున్నారు. ఈ తనిఖీల సందర్భంగా అవసరమైన మరమ్మత్తులు చేయాలని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించే అవకాశం లేకపోలేదని సమాచారం.

ఇండియాను గెలిపిస్తే దేశవ్యాప్తంగా కుల గణన

(మొదటిపేజీ తరువాయి)

పరిమితిని తొలగిస్తామని హామీ ఇచ్చారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా జార్ఖండ్‌లో ఆయన నాలుగో రోజు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పై హామీలు ఇచ్చారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో బహిరంగ ర్యాలీలో ఆయన మాట్లాడారు.

దళితులు, గిరిజనులు, ఓబీసీలు బాండెడ్ లేబర్లుగా ఉన్నారనీ, పెద్ద కంపెనీలు, ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలు, న్యాయస్థానాల్లో వారి భాగస్వామ్యం కొరవడిందని రాహుల్ అన్నారు. "ఇది భారత్ ముందున్న అతిపెద్ద సవాల్. మా మొదటి అడుగు దేశంలో కుల గణను నిర్వహించటం. ప్రస్తుతం ఉన్న నిబంధనల కింద 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ లభించదు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై పరిమితిని ఎత్తేస్తాం. దళితులు, గిరిజనులు, ఓబీసీలకు వారి హక్కులు అందేలా చూస్తాం. ఆదివాసీ, దళితుల రిజర్వేషన్లలో ఎలాంటి తగ్గింపూ ఉండదు. సమాజంలో వెనకబడిన వర్గాలు వారి హక్కులను పొందేలా నేను హామీ ఇస్తున్నాను" అని రాహుల్ తెలిపారు.

సామాజిక, ఆర్థిక అన్యాయం అతిపెద్ద సమస్య అని ఆయన చెప్పారు. కుల గణనను ప్రధాని మోడీ వ్యతిరేకిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మోడీ ఓబీసీ అని చెప్పుకుంటాడనీ, అయితే కులగణన డిమాండ్‌కు వచ్చేసరికి 'పేద, ధనిక' అనే కులాలు మాత్రమే ఉంటాయంటారని రాహుల్ తెలిపారు. కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లను క్రమంగా నిర్వీర్యం చేస్తున్నదని రాహుల్ ఆరోపించారు. వీటిని క్రమంగా గౌతమ్ అదాని నేతృత్వంలోని అదానీ గ్రూపునకు కట్టబెడుతున్నారని అన్నారు.

అంతా ఒట్టిదే..!

(మొదటిపేజీ తరువాయి)

ముప్పేట దాడి చేసింది. కోవిడ్‌కు ఈ సంస్థ ఒక్కటే కారణమంటూ ప్రధాని నిందలు మోపారు. ఆ సంస్థకు చెందిన అనేక మందిని జైళ్లలోనూ, డిటెన్షన్ కేంద్రాల్లోనూ పెట్టారు. వీరిపై మోపిన ఆరోపణలన్నింటినీ ఆ తర్వాత న్యాయస్థానాలు కొట్టివేశాయి.

శంభూలాల్ రేగర్ అనే మానవ మృగం అఫ్రజుల్ ఖాన్‌ను ఉరి తీసి చంపిన ఉదంతాన్ని మైనారిటీలు ఎన్నటికీ మరువలేరు. ఆయన నేరమల్లా ముస్లిం కావడమే. ఈ దారుణాన్ని రేగర్ బంధువైన 14 సంవత్సరాల బాలుడు చిత్రీకరించి ప్రపంచానికి చూపాడు. అటవికంగా ప్రవర్తించిన రేగర్‌ను శిక్షించాల్సింది పోయి శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా సత్కరించారు. హిందువుల గౌరవాన్ని కాపాడాడంటూ కొనియాడారు.

భకర్వాల్ గిరిజనులను భయభ్రాంతుల్ని చేసేందుకు కథువాలో ఎనిమిది సంవత్సరాల చిన్నారిపై లైంగిక దాడి చేసి ఆటవికంగా హతమార్చిన ఉదంతం ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. ఇక్కడ సిగ్గు పడాల్సిన విషయమేమంటే కథువా బార్ అసోసియేషన్‌తో పాటు సమాజంలోని కొన్ని వర్గాలు హంతకులకు బాసటగా నిలవడం. ఇక్కడ మరో ఘటనను గురించి కూడా చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. మాంసాన్ని రవాణా చేస్తున్నాడన్న అనుమానంతో అలీముద్దీన్ అన్సారీ అనే వ్యక్తిని ఎనిమిది మంది పొట్టన పెట్టుకున్నారు. వీరిని దోషులుగా న్యాయస్థానం నిర్ధారించింది కూడా. అయితే వీరేదో ఘనకార్యం సాధించారన్నట్లు కేంద్ర మంత్రి జయంత్ సిన్హా సన్మానించారు.

గుజరాత్‌లో ఓ వేడుకకు అంతరాయం కలిగించారన్న ఆరోపణపై 10 మంది ముస్లిం యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని న్యాయస్థానం ముందు హాజరు పరచాల్సిన పోలీసులు విద్యుత్ స్తంభానికి కట్టేసి, జనం ఎదుటే కొరడాలతో కొట్టారు. ఇక బిల్కిస్ బానో ఉదంతాన్ని ఎలా మరువగలం? ఇప్పుడు ఇలాంటి ఘటనలన్నీ సర్వసాధారణమై పోయాయి. అవి ఇంకెంత మాత్రం మనల్ని ఆశ్చర్యానికి గురి చేయబోవు. ముస్లింల పట్ల వివక్ష చూపే పౌరసత్వ సవరణ చట్టాన్ని త్వరలోనే అమలు చేయబోతున్నారు. ఇదే కాదు...మత మార్పిడుల నిరోధక చట్టం, గో వధ నిరోధక చట్టం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి వంటివన్నీ మెజారిటీ వర్గాన్ని సంతృప్తి పరచేందుకు ఉద్దేశించినవే.

కేరళ ప్రభుత్వంపై కేంద్రం నిరంకుశ ధోరణి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్యవాదులు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. కేరళ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత, అణచివేత ధోరణి కొనసాగిస్తున్నదని విమర్శించారు. గతంలో ఎదుర్కొన్న విపత్తులు, కష్టకాలంలోనూ కేరళ రాష్ట్రానికి కేంద్రం సహాయం చేయకుండా మొండిచెయ్యి చూపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రాష్ట్ర ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి అన్ని విధాలుగా ఆటంకం కలిగిస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నదని పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం ఆదాయం, ఉత్పత్తి విషయాల్లో మంచి ఫలితాలు సాధించినప్పటికీ కేంద్రం అనుసరిస్తున్న విధానాల కారణంగా ఆ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని తెలిపారు. 2021-22 నుంచి కేరళ రుణ పరిమితిని తగ్గించిందని వివరించారు. జీఎస్టీ వంటి ఆదాయ వనరులను తగ్గించిందని పేర్కొన్నారు. పన్ను వనరుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సిన వాటాను 41 శాతానికి తగ్గించిందని తెలిపారు. ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ, ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంట్‌లను ప్రయోగించడం, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశాల్లో కేంద్రం జోక్యం చేసుకుని దుర్వినియోగం చేయడం, ప్రభుత్వ వ్యవహారాల్లో గవర్నర్ మితిమీరిన జోక్యం తదితర అంశాల వల్ల ప్రభుత్వ పనివిధానంపై ప్రభావం పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు కేంద్ర ఆదాయంలో మూడో వంతును సెస్సు, సర్‌చార్జీకి బదిలీ చేశారని తెలిపారు. విపక్ష రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్రం విద్వేషపూరిత వైఖరిని అనుసరించడం సరికాదని పేర్కొన్నారు. మేధావులు, యువకులు, ప్రజాస్వామికవాదులు మౌనం వహించకుండా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలని ఆయన కోరారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కుల గణన చేపట్టాలని నిర్ణయించామనీ, అందుకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామనీ, ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్నిరకాలుగా ప్రణాళికలు రూపొందించుకున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించామని, వాటిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసి బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని సీఎం వివరించారు. కాగా ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం... జార్ఖండ్ పర్యటన ముగించుకొని ఢిల్లీ మీదుగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల సోమవారం రాత్రి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ఢిల్లీలో బస చేశారు. ఈ రోజు పలువురు పార్టీ ముఖ్య నేతల్ని కలిసి తిరిగి హైదరాబాద్ బయలు దేరే అవకాశం ఉంది.

భారత్ న్యాయ్ యాత్రలో సీఎం...

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ న్యాయ్ యాత్రలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో కొనసాగుతున్న యాత్రలో రాహుల్ గాంధీని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రెండు గ్యారంటీలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు వివరాలను తెలియజేశారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి సోనియా గాంధీ పోటీ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తీరును రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి వివరించారు. న్యాయ్ యాత్రలో సీఎం వెంట రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు విడుదలకు సహకరించండి : నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్ సుమన్ భేరీకి సీఎం వినతి

కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావల్సిన గ్రాంటు రూ.1,800 కోట్లు వెంటనే రిలీజ్ అయ్యేందుకు సహకరించాలని నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్ సుమన్ భేరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. హైదరాబాద్‌లో మూసీ నది రివర్ ఫ్రంట్ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇప్పించాలని కోరారు. ఇందుకు అవసరమైన వరల్డ్ బ్యాంక్ ఎయిడ్ విడుదలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాగు నీటి సరఫరాకు అవసరమైన నిధులతో పాటు రాష్ట్రంలో తమ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల్లో తీసుకురానున్న సంస్కరణలకు సహకారం అందించాలని కోరారు.

టీజీగా మార్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకే వాహన రిజిస్ట్రేషన్లను టీఎస్ నుంచి టీజీగా మార్చుతూ నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఒక జాతి అస్థిత్వానికి చిరునామా ఆ జాతి భాష, సాంస్కృతిక వారసత్వం. ఆ వారసత్వాన్ని సమున్నతంగా నిలబెట్టాలన్న సదుద్దేశంతో జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా, సగటు తెలంగాణ ఆడబిడ్డ రూపురేఖలే తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రతిరూపంగా, రాచరికపోకడలు లేని చిహ్నామే రాష్ట్ర అధికారిక చిహ్నాంగా, వాహన రిజిస్ట్రేషన్లకు ఉద్యమ సమయం లో ప్రజలు నినదించిన అక్షరాలే ఉండాలన్నది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష" అని సీఎం పేర్కొన్నారు. ప్రజల బలీయమైన కోరికను నెరవేరుస్తూ రాష్ట్ర క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

బలపరీక్ష నెగ్గిన చంపయ్ సోరెన్

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో వీరంతా ఆదివారమే తిరిగి రాంచీ చేరుకున్నారు. ఉదయం శాసనసభ సమావేశం కాగానే చంపయ్ సోరెన్ విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో బీజేపీపై నిప్పులు చెరిగారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరచేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 'మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌కు జరిగిన అన్యాయాన్ని ఈ రోజు దేశమంతా చూస్తోంది. మీరు రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వెళ్లండి. ప్రతి ఇంటిలోనూ హేమంత్ అమలు చేసిన పథకాలే కన్పిస్తాయి' అని చెప్పారు. హేమంత్ సోరెన్ రెండో భాగంగా (పార్ట్-2) ఉన్నందుకు తాను గర్వపడుతున్నానని అన్నారు.

తమ పార్టీ చంపయ్ ప్రభుత్వాన్ని సమర్థిస్తోందని కాంగ్రెస్ నేత ప్రదీప్ యాదవ్ తెలిపారు. హేమంత్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను, ప్రజలకు కల్పించిన హక్కులను ఈ నూతన ప్రభుత్వం కొనసాగిస్తుందన్న విశ్వాసం తమకు ఉన్నదని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోందని సీపీఐ (ఎంఎల్) నాయకుడు వినోద్ కుమార్ సింగ్ విమర్శించారు. అవినీతి అర్థాన్నే బీజేపీ మార్చేసిందని వ్యాఖ్యానించారు. 'మీరు బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షంలో ఉంటే అవినీతిపరులు. అదే బీజేపీలో ఉంటే నీతిమంతులు' అని అన్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వంటి నేతలు బీజేపీలో చేరగానే వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు చర్యలను నిలిపివేశాయని గుర్తు చేశారు. నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ సభ్యుడు గ్లెన్ జోసఫ్ గల్‌స్టన్ కూడా సోరేన్ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. మైనారిటీల హక్కులను బీజేపీ కాలరాస్తోందని ఆయన ఆరోపించారు.

విశ్వాస పరీక్ష కోసం ఏర్పాటుచేసిన శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తుండగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు.

ఇరవై కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి?

(మొదటిపేజీ తరువాయి)

విభజిస్తున్నదని, హిందీని రుద్దుతున్నదని విమర్శించారు. కీలకమైన బిల్లులను చర్చ లేకుండా ఆమోదిస్తున్నదనీ, అందుకు ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేస్తున్నదని ఆరోపించారు. 'ఈ ప్రభుత్వ హయాంలోనే గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారత్ 107వ స్థానం నుంచి 111వ స్థానానికి పడిపోయింది. పదేండ్లలో దేశానికి అన్నదాతలైన వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వెయ్యి కోట్లతో విగ్రహాలు నిర్మిస్తున్నారు. కాని దేశ క్రీడల ఔన్నత్యానికి స్టేడియంలు నిర్మించటం లేదు. కేరళ పట్ల విద్వేషం కారణంగానే రాష్ట్రానికి ఎయిమ్స్‌ను ఇవ్వలేదు" అని ఆరిఫ్ విమర్శించారు.

మేడారం జాతరకు 6 వేల ప్రత్యేక బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

టీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. మేడారం జాతరలో సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. జాతరకు మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉన్నందున ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 14.50 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.

ఈ నెల 16న మేడారంలో టీఎస్ఆర్టీసీ బేస్ క్యాంప్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. మేడారం జాతరలో దాదాపు 14వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని, వారికి వసతి, భోజనం విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. మేడారం జాతరను టీఎస్ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శభరిష్, అదనపు కలెక్టర్ శ్రీజ, టీఎస్ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవిందర్, ఈడీలు మునిశేఖర్, కష్టకాంత్, రఘునాథ రావు, సీటీఎం జీవన ప్రసాద్, సీపీఎం ఉషాదేవి, వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, రంగారెడ్డి ఆర్ఎంలు పాల్గొన్నారు.



విశాఖలో స్పిన్‌బాల్

106 పరుగుల తేడాతో భారత్‌ ఘన విజయం

- 399 ఛేదనలో ఇంగ్లాండ్‌ 292 ఆలౌట్‌
- అశ్విన్‌, బుమ్రా మూడేసి వికెట్ల జోరు

టెస్టు సిరీస్‌ 1-1తో సమం

దెబ్బకు దెబ్బ. లెక్క సమం. హైదరాబాద్‌లో బజ్‌బాల్‌ పైచేయి సాధించగా, విశాఖలో స్పిన్‌బాల్‌ జోరందుకుంది. భారత పేసర్లు, స్పిన్నర్లు విజృంభించటంతో ఇంగ్లాండ్‌ బజ్‌బాల్‌ తోకముడిచింది. 399 పరుగుల ఛేదనలో బెన్‌స్టోక్స్‌ సేన 292 పరుగులకే కుప్పకూలింది. బుమ్రా, అశ్విన్‌ మూడేసి వికెట్లతో మ్యాజిక్‌ చేయటంతో ఇంగ్లాండ్‌ ఛేదనలో చేతులెత్తేసింది. రెండో టెస్టులో 106 పరుగుల తేడాతో గెలుపొందిన టీమ్‌ ఇండియా.. 1-1తో సిరీస్‌ సమం చేసింది. కోహ్లి లేడు. జడేజా దూరమయ్యాడు. రాహుల్‌ సైతం గాయపడ్డాడు. అయినా, హైదరాబాద్‌ టెస్టు పరాజయం నుంచి టీమ్‌ ఇండియా గొప్పగా పుంజుకుంది. బ్యాట్‌తో యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్‌, శుభ్‌మన్‌ గిల్‌ చెలరేగగా.. బంతితో సీనియర్‌ బౌలర్లు జశ్‌ప్రీత్‌ బుమ్రా, రవిచంద్రన్‌ అశ్విన్‌లు మాయ చేశారు. ఇంగ్లాండ్‌ గత పర్యటనలో మాదిరిగానే తొలి టెస్టులో నెగ్గి.. ఆ తర్వాత ఆతిథ్య జట్టు ధాటికి విలవిల్లాడింది. భారత్‌, ఇంగ్లాండ్‌ మూడో టెస్టు ఫిబ్రవరి 15 నుంచి రాజ్‌కోట్‌లో జరుగనుంది.

నవతెలంగాణ-విశాఖపట్నం

విశాఖ టెస్టులో భారత్‌ ఘన విజయం సాధించింది. ఇంగ్లాండ్‌పై 106 పరుగుల తేడాతో గెలుపొందింది. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌ను 1-1తో సమం చేసింది. పేస్‌ దళపతి జశ్‌ప్రీత్‌ బుమ్రా (3/46), మాస్టర్‌ మాయగాడు రవిచంద్రన్‌ అశ్విన్‌ (3/72) మూడేసి వికెట్ల ప్రదర్శనతో ఛేదనలో ఇంగ్లాండ్‌ను వణికించారు. ఇంగ్లాండ్‌ ఓపెనర్‌ జాక్‌ క్రాలీ (73, 132 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌) ధనాధన్‌ అర్థ సెంచరీతో మెరిసినా.. ఇతర బ్యాటర్లు ఎవరూ భారత బౌలర్ల ముందు నిలబడలేకపోయారు. బెన్‌ ఫోక్స్‌ (36, 69 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌), టామ్‌ హార్ట్‌లీ (36, 47 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌), జానీ బెయిర్‌స్టో (26, 36 బంతుల్లో 5 ఫోర్లు) ఇంగ్లాండ్‌ ఓటమి అంతరాన్ని కుదించగలిగారు. 69.2 ఓవర్లలో 292 పరుగులకు ఇంగ్లాండ్‌ రెండో ఇన్నింగ్స్‌లో కుప్పకూలింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తొమ్మిది వికెట్లు కూల్చిన జశ్‌ప్రీత్‌ బుమ్రా 'మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌' అవార్డు అందుకున్నాడు. హైదరాబాద్‌ టెస్టు, విశాఖ టెస్టులు నాలుగు రోజుల్లోనే ముగియటం గమనార్హం.

లంచ్‌లోపే ఖాయం

ఓవర్‌నైట్‌ స్కోరు 67/1తో నాల్గో రోజు ఛేదనకు వచ్చిన ఇంగ్లాండ్‌.. బజ్‌బాల్‌తో భారత్‌ను భయపెట్టేందుకు చూసింది. కానీ, భారత బౌలర్లు ఇంగ్లాండ్‌ బ్యాటర్లను క్రమం తప్పకుండా ఇరకాటంలో పడేశారు. నైట్‌ వాచ్‌మన్‌ రెహాన్‌ అహ్మద్‌ (23, 31 బంతుల్లో 5 ఫోర్లు) అంచనాలకు మించి రాణించాడు. ఓపెనర్‌ జాక్‌ క్రాలీతో కలిసి రెండో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడికి అక్షర్‌ పటేల్‌ విడదీశాడు. వికెట్ల ముందు రెహాన్‌ అహ్మద్‌ను మాయ చేశాడు. దీంతో ఇంగ్లాండ్‌ రెండో వికెట్‌కు కోల్పోయింది. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 83 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన జాక్‌ క్రాలీ.. ఛేదనను ముందుకు నడిపించాడు. తొలి టెస్టు హీరో ఓలీ పోప్‌ (23, 21 బంతుల్లో 5 ఫోర్లు) దూకుడుగా ఆడినా.. వికెట్‌ నిలుపుకోలేదు. స్లిప్స్‌లో వేగంగా కదిలిన రోహిత్‌ శర్మ ఎడమ చేతితో ఓలీ పోప్‌ క్యాచ్‌ను అందుకున్నాడు. దీంతో డ్రింక్స్‌ విరామం ముంగిట ఇంగ్లాండ్‌ కీలక మూడో వికెట్‌ కోల్పోయింది. లంచ్‌ విరామం లోపు మరో మూడు వికెట్లు పడగొట్టిన భారత్‌.. విశాఖ టెస్టును చేతుల్లోకి తీసుకుంది. ఓ ఎండ్‌లో జాక్‌ క్రాలీ నిలకడగా నిలబడ్డాడు. కానీ, మరో ఎండ్‌లో సరైన సహకారం లభించలేదు. జో రూట్‌ (16, 10 బంతుల్లో 2 ఫోర్లు) సిరీస్‌లో వరుసగా నాల్గో ఇన్నింగ్స్‌లో విఫలమయ్యాడు. రెండు బౌండరీలతో జో రూట్‌ దూకుడు సంకేతాలు పంపినా.. అశ్విన్‌ మాయలో ఇరుకున్నాడు. నాల్గో వికెట్‌ రూపంలో పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఆ తర్వాత జానీ బెయిర్‌స్టో (26, 36 బంతుల్లో 5 ఫోర్లు)తో కలిసి జాక్‌ క్రాలీ విలువైన భాగస్వామ్యం నమోదు చేశాడు. ఐదో వికెట్‌కు 66 బంతుల్లోనే 40 పరుగులు జోడించాడు. బెయిర్‌స్టో సైతం ఐదు బౌండరీలతో మంచి దూకుడు మీద కనిపించాడు. దీంతో తొలి సెషన్లో ఇంగ్లాండ్‌ పైచేయి సాధించేలా కనిపించింది. కానీ, లంచ్‌ విరామం ముందు రెండు ఓవర్లలో భారత్‌ మెరుపు దెబ్బ కొట్టింది. చైనామన్‌ స్పిన్నర్‌ కుల్దీప్‌ యాదవ్‌కు జాక్‌ క్రాలీ వికెట్ల ముందు దొరికిపోగా, ఆ తర్వాతి ఓవర్లో బుమ్రా బంతికి బెయిర్‌స్టో కథ ముగిసింది. దీంతో ఒక్క పరుగూ జోడించకుండానే జాక్‌ క్రాలీ, జానీ బెయిర్‌స్టో వికెట్లు వరుసగా పడ్డాయి. తొలి సెషన్‌ ముగిసే సమయానికి ఇంగ్లాండ్‌ 194/6తో ఓటమి కోరల్లో కూరుకుంది. కుల్దీప్‌, బుమ్రా వరుస ఓవర్లలో వికెట్లు ఇంగ్లాండ్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టగా.. మ్యాచ్‌ను దాదాపు భారత్‌ పరం చేశాయి.

> భారత్‌కు బుమ్రా చాంపియన్‌ ఆటగాడు. ఇటువంటి విజయాల్లో జట్టు ఓవరాల్‌ ప్రదర్శన చూడాలి. ఈ పరిస్థితుల్లో టెస్టు విజయం అంత సులువు కాదు. బౌలర్లు బాధ్యత తీసుకున్నారు. జైస్వాల్‌ గొప్పగా ఆడాడు. భారత్‌కు ఇంకెన్నో ఇన్నింగ్స్‌లు ఆడగలడు. ఇంగ్లాండ్‌ జట్టు మంచి క్రికెట్‌ ఆడుతోంది. ఆ జట్టుపై యువ జట్టుతో విజయం గొప్పగా ఉంది. చాలా మంది బ్యాటర్లు జట్టుకు కొత్త. మంచి ఆరంభాలు లభించినా భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఈ ఫార్మాట్‌కు కొత్త కావటంతో నేర్చుకునేందుకు కాస్త సమయం పడుతుంది. మరో మూడు మ్యాచులు మిగిలి ఉన్నాయి. చాలా అంశాలు సరి చేసుకోవాల్సి ఉంది
>
> - రోహిత్‌ శర్మ, భారత కెప్టెన్‌

లాంఛనం త్వరగానే..

రెండో సెషన్‌ ఆరంభంలో భారత్‌ విజయానికి నాలుగు వికెట్ల దూరంలో నిలువగా, ఇంగ్లాండ్‌కు మరో 205 పరుగులు అవసరం. భారత్‌ మ్యాచ్‌పై తిరుగులేని పట్టు సాధించినా.. ఇంగ్లాండ్‌ సారథి బెన్‌ స్టోక్స్‌ (11) క్రీజులో ఉన్నాడు. ఛేదనలో అసమాన ఇన్నింగ్స్‌లు నమోదు చేసిన బెన్‌ స్టోక్స్‌ విశాఖలో ఏం చేస్తాడో అనే చిన్న ఆందోళన అభిమానుల్లో కనిపించింది. కానీ శ్రేయస్‌ అయ్యర్‌ మెరుపు ఫీల్డింగ్‌తో బెన్‌ స్టోక్స్‌ కథ ముగిసింది. సింగిల్‌ తీసే ప్రయత్నంలో బెన్‌ స్టోక్స్‌ రనౌట్‌గా నిష్క్రమించాడు. బెన్‌ స్టోక్స్‌ ఏడో వికెట్‌ రూపంలో నిష్క్రమించటంతో భారత్‌కు ఇక లాంఛనమే మిగిలింది. వికెట్‌ కీపర్‌ బెన్‌ ఫోక్స్‌ (36, 69 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌), టెయిలెండర్‌ టామ్‌ హార్ట్‌లీ (36, 47 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌) ఎనిమిదో వికెట్‌కు భారత్‌ను విసిగించారు. 74 బంతుల్లో 55 పరుగులు జోడించిన ఫోక్స్‌, హార్ట్‌లీ ఓటమి అంతరాన్ని తగ్గించగలిగారు. బెన్‌ ఫోక్స్‌ను రిటర్న్‌ క్యాచ్‌ ద్వారా అవుట్‌ చేసిన బుమ్రా.. హార్ట్‌లీ వికెట్లను గిరాటేశాడు. అంతకముందు ముందు షోయబ్‌ బషీర్‌ (0)ను ముకేశ్‌ కుమార్‌ బోల్తా కొట్టించాడు. దీంతో 69.2 ఓవర్లలోనే ఛేదనలో ఇంగ్లాండ్‌ కథ ముగిసింది. భారత బౌలర్ల మాయకు ఇంగ్లాండ్‌ తలొంచినా.. ఓవర్‌కు 4.21 పరుగులు చొప్పున జోడించటం విశేషం.



స్కోరు వివరాలు

భారత్‌ తొలి ఇన్నింగ్స్‌ : 396/10

ఇంగ్లాండ్‌ తొలి ఇన్నింగ్స్‌ : 253/10

భారత్‌ రెండో ఇన్నింగ్స్‌ : 255/10

ఇంగ్లాండ్‌ రెండో ఇన్నింగ్స్‌ : జాక్‌ క్రాలీ (ఎల్బీ) కుల్దీప్‌ యాదవ్‌ 73, బెన్‌ డకెట్‌ (సి) భరత్‌ (బి) అశ్విన్‌ 28, రెహాన్‌ అహ్మద్‌ (ఎల్బీ) అక్షర్‌ పటేల్‌ 23, ఒలీ పోప్‌ (సి) రోహిత్‌ శర్మ (బి) అశ్విన్‌ 23, జో రూట్‌ (సి) అక్షర్‌ పటేల్‌ (బి) అశ్విన్‌ 16, జానీ బెయిర్‌స్టో (ఎల్బీ) బుమ్రా 26, బెన్‌ స్టోక్స్‌ రనౌట్‌ 11, బెన్‌ ఫోక్స్‌ (సి,బి) బుమ్రా 36, టామ్‌ హార్ట్‌లీ (బి) బుమ్రా 36, షోయబ్‌ బషీర్‌ (సి) భరత్‌ (బి) ముకేశ్‌ 0, జేమ్స్‌ అండర్సన్‌ నాటౌట్‌ 5, ఎక్స్‌ట్రాలు : 15, **మొత్తం : (69.2 ఓవర్లలో ఆలౌట్‌) 292.**

వికెట్ల పతనం : 1-50, 2-95, 3-132, 4-154, 5-194, 6-194, 7-220, 8-275, 9-281, 10-292.

బౌలింగ్‌ : జశ్‌ప్రీత్‌ బుమ్రా 17.2-4-46-3, ముకేశ్‌ కుమార్‌ 5-1-26-1, కుల్దీప్‌ యాదవ్‌ 15-0-60-1, రవిచంద్రన్‌ అశ్విన్‌ 18-2-72-3, అక్షర్‌ పటేల్‌ 14-1-75-1.

మళ్లీ సెలక్షన్‌ డైలమా?!

- చివరి మూడు టెస్టులకు త్వరలో జట్టు ప్రకటన
- విశాఖలో రోహిత్‌, ద్రవిడ్‌, అగార్కర్‌ చర్చలు



విశాఖపట్నం : ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో రెండు మ్యాచులు ముగిశాయి. ఇంగ్లాండ్‌, భారత్‌ చెరో మ్యాచ్‌లో గెలుపొందాయి. సిరీస్‌ 1-1తో సమవుజ్జీల సమరంగా ఉంది. చివరి మూడు టెస్టులకు సీనియర్‌ సెలక్షన్‌ కమిటీ త్వరలోనే జట్టును ఎంపిక చేయనుంది. వ్యక్తిగత కారణాలతో, గాయాలతో కీలక ఆటగాళ్లు జట్టుకు దూరమైన తరుణంలో సెలక్షన్‌ కమిటీపై ఫోకస్‌ కనిపిస్తుంది. విరాట్‌ కోహ్లి, కెఎల్‌ రాహుల్‌, రవీంద్ర జడేజాలు తిరిగి జట్టులోకి వస్తారా? లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

సుదీర్ఘ మంతనాలు : విశాఖ టెస్టులో విజయానంతరం కెప్టెన్‌ రోహిత్‌ శర్మ, కోచ్‌ రాహుల్‌ ద్రవిడ్‌తో చీఫ్‌ సెలక్టర్‌ అజిత్‌ అగర్కార్‌ సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ ముగ్గురు ప్రధానంగా రానున్న మూడు టెస్టులకు జట్టు కూర్పుపై చర్చించినట్టు తెలుస్తున్నది. వ్యక్తిగత కారణాలతో విరాట్‌ కోహ్లి తొలి రెండు టెస్టులకు దూరంగా ఉన్నాడు. కెఎల్‌ రాహుల్‌, రవీంద్ర జడేజా గాయపడ్డారు. జాతీయ క్రికెట్‌ అకాడమీ రాహుల్‌కు క్లియరెన్స్‌ ఇచ్చినా.. జడేజా ఫిట్‌నెస్‌పై ఇంకా నీలినీడలు కనిపిస్తున్నాయి. మూడో టెస్టుకు ఎనిమిది రోజుల విరామం లభించటంతో కోహ్లి రాజ్‌కోట్‌ టెస్టుకు అందుబాటులో ఉంటాడా? అందుబాటులో లేనని సెలక్షన్‌ కమిటీకి సమాచారం ఇస్తాడా ? అనేది తెలియాలి. 'కోహ్లి విషయాన్ని సెలక్టర్లు చెబుతారు. మాకు తెలిసి రెండు టెస్టులకు అందుబాటులో ఉండలేనని సమాచారం ఉంది. మిగతా మూడు టెస్టులకు కోహ్లి ఉండేది లేనిది రెండ్రోజుల్లో తెలుస్తుంది' అని రాహుల్‌ ద్రవిడ్‌ అన్నాడు.

అది కిషన్‌ నిర్ణయం! : యువ వికెట్‌ కీపర్‌ బ్యాటర్‌ ఇషాన్‌ కిషన్‌ జాతీయ జట్టుకు దూరం కావటంపై పలు కథనాలు వెలువడ్డాయి. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి అర్థాంతరంగా స్వదేశం చేరుకున్న కిషన్‌ ఇటు దేశవాళీ క్రికెట్‌లో కనిపించటం లేదు. దీనిపై కోచ్‌ రాహుల్‌ ద్రవిడ్‌ స్పందించాడు. 'విరామం కావాలని కిషన్‌ కోరుకున్నాడు. రీ ఎంట్రీకి ముందు దేశవాళీలో మ్యాచ్‌ ప్రాక్టీస్‌ నిరూపించుకోవాలని సూచించాం. కిషన్‌ ఇంకా దేశవాళీలో ఆడటం లేదు. జట్టు మేనేజ్‌మెంట్‌ కిషన్‌తో టచ్‌లోనే ఉంది. అతడు ఎప్పుడు రావాలని అనుకుంటే అప్పుడు క్రికెట్‌ మొదలుపెట్టవచ్చు. విరామం పూర్తిగా కిషన్‌ నిర్ణయమే' అని రాహుల్‌ ద్రవిడ్‌ తెలిపాడు.

మెరిసిన అన్షు, వినేశ్‌

జాతీయ రెజ్లింగ్‌ పోటీలు



జైపూర్‌ : రెజ్లింగ్‌ మహిళల 57 కేజీల విభాగంలో పోటీ తారా స్థాయికి చేరుకుంది!. ఒలింపిక్స్‌ బెర్త్‌ కోసం పోటీపడుతున్న అన్షు మాలిక్‌, సరితలు జాతీయ చాంపియన్‌షిప్స్‌లో సై అన్నారు. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో అన్షు మాలిక్‌ పైచేయి సాధించింది. మోకాలి గాయం నుంచి కోలుకున్న అన్షు మాలిక్‌ 8-3తో సరితపై విజయం సాధించింది. మహిళల 55 కేజీల విభాగంలో స్టార్‌ రెజ్లర్‌ వినేశ్‌ ఫోగట్‌ బంగారు పతకం సాధించింది. ఫైనల్లో జ్యోతిపై గెలుపొంది గోల్డ్‌ దక్కించుకుంది. ఒలింపిక్‌ మెడలిస్ట్‌ సాక్షి మాలిక్‌ విజేతలకు మెడల్స్‌ ప్రదానం చేశారు.

నవచిత్రం

ఈగల్‌ అవుట్‌పుట్‌ అదిరింది - రవితేజ



రవితేజ నటించిన స్టయిలీష్‌ మాస్‌ యాక్షన్‌ ఎంటర్‌టైనర్‌ 'ఈగల్‌'. కార్తీక్‌ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్‌ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్‌ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్‌ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కావ్య థాపర్‌, అనుపమ పరమే శ్వరన్‌ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈనెల 9న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్‌ ఈవెంట్‌ సక్సెస్‌ఫుల్‌గా జరిగింది.

రవితేజ మాట్లాడుతూ,'నవదీప్‌కు బలమైన క్యారెక్టర్‌ దక్కాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ సినిమాతో తనకి మంచి పేరు వస్తుందని నమ్ముతున్నాను. ఎవరూ ఊహించలేని విధంగా డైలాగ్స్‌ చెప్పాడు. ఇద్దరం కలిసి ఓ కామెడీ సినిమాలో చేయాలని ఉంది. తనలో చాలా మంచి హ్యూమర్‌ ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల రియాక్షన్‌ కోసం ఎదురుచూస్తున్నాను. డైరెక్టర్‌ కార్తిక్‌కి విపరీతమైన క్లారిటీ ఉంది. అద్భుతంగా తీశాడు. ఈ సినిమా పెద్ద విజయం సాధించి తనతోపాటు మా నిర్మాత విశ్వప్రసాద్‌కి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'ఖచ్చితంగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే సినిమా ఇది. ఇదొక గొప్ప థియేట్రికల్‌ ఎక్స్‌పీరియన్స్‌ ఇచ్చే చిత్రం' అని డైరెక్టర్‌ కార్తీక్‌ ఘట్టమనేని చెప్పారు.

నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ మాట్లాడుతూ,'రవితేజకి ప్రత్యేక కృతజ్ఞతలు. కొత్త దర్శకులు, నటులకు అవకాశం ఇచ్చినట్లే.. మా ప్రొడక్షన్‌కు వరుసగా మూడు సినిమాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. కార్తీక్‌తో మరో సినిమా చేస్తున్నాం. ఇదొక స్టయిలీష్‌ మాస్‌ యాక్షన్‌ ఎంటర్‌టైనర్‌. మంచి సందేశంతో పాటు అద్భుతమైన క్లైమాక్స్‌ ఉంటుంది' అని తెలిపారు. నవదీప్‌ మాట్లాడుతూ, 'రవితేజ అన్నతో కలిసి పని చేయడం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు.

లగ్గం షురూ..



సుభిశి ఎంటర్టైన్మెంట్స్‌ బ్యానర్‌ పై వేణుగోపాల్‌ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'లగ్గం'. 'భీమదేవరపల్లి బ్రాంచి' దర్శకుడు రమేష్‌ చెప్పాల ఈ సినిమాకు రచన -దర్శకత్వం వహిస్తున్నారు. సాయి రోనక్‌, గనవి లక్ష్మణ్‌ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్‌ కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఎవ్వరు, ఎప్పటికీ మరిచిపోలేని పాత్ర పోషిస్తున్నాను. నా కెరీర్‌లో 'పెళ్లిపుస్తకం' తరువాత అంత గొప్ప పాత్ర ఈ సినిమాలో చేస్తుండడం విశేషం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న తెలుగు వారందరికీ ఈ కథ, కథనాలు కనెక్ట్‌ అవుతాయి. ఇదొక విందు భోజనం లాంటి సినిమా' అని చెప్పారు.

'పెళ్లి చేసుకోవడం అంటే రెండు కుటుంబాలు కలవడం కాదు. రెండు మనసులు కలవడం. అదే ఈ సినిమా. రెగ్యులర్‌ షూటింగ్‌ కూడా నేటి నుంచే ఆరంభం చేస్తున్నాం' అని దర్శకుడు రమేష్‌ చెప్పాల అన్నారు.

'ఈ సినిమాతో ప్రేక్షకులకు ఎప్పటికీ మరిచిపోలేని ట్రీట్‌ ఇవ్వబోతున్నాము. ఈ సినిమాలో వినోదంతో పాటు ఎమోషన్స్‌, తెలంగాణ పెళ్లి కల్చర్‌ ప్రతి ఒక్కరికి వాళ్ళ లగ్గాన్ని గుర్తుచేస్తుంది. పెళ్ళి కాని వారికి ఇలా లగ్గం చేసుకోవాలనిపిస్తుంది' అని హీరో సాయి రొనక్‌ తెలిపారు. ఈ చిత్రానికి చరణ్‌ అర్జున్‌ సంగీతం సమకూరుస్తున్నారు. బొంతల నాగేశ్వర రెడ్డి ఎడిటర్‌, బాల్‌ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.



నాగచైతన్య, చందూ మొండేటి

తండేల్‌.. కీలక షెడ్యూల్‌ పూర్తి

నాగ చైతన్య, చందూ మొండేటి కాంబినేషన్‌లో గీతా ఆర్ట్స్‌ నిర్మిస్తున్న చిత్రం 'తండేల్‌. అల్లు అరవింద్‌ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్‌ శరవేగంగా జరుగుతోంది. తాజాగా సినిమాలో కీలకంగా సాగే సుదీర్ఘ షెడ్యూల్‌ని చిత్ర బృందం పూర్తి చేసింది.

ఈ షెడ్యూల్‌లో నాగ చైతన్య, సాయి పల్లవి, ఇతర తారాగణంపై సినిమాలోని చాలా కీలకమైన సన్నివేశాలని చిత్రీకరించారు. ఈ సందర్భంగా మేకర్స్‌ కొన్ని వర్కింగ్‌ స్టిల్స్‌ని విడుదల చేశారు. ఈ చిత్రాన్ని చాలా రియలిస్టిక్‌గా తీస్తున్నారని వర్కింగ్‌ స్టిల్స్‌ చూస్తే అది అర్థమవుతోంది. ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్‌ ఎక్స్‌ పీరియన్స్‌ అందించడం కోసం సుందరమైన, సహజసిద్ధమైన లోకేషన్స్‌లో చిత్రాన్ని షూట్‌ చేస్తున్నారు.

తెలుగులో అమ్మ ఒడి



జ్యోతిక

జ్యోతిక ప్రధాన పాత్రలో ఎస్‌వై గౌతమ్‌ రాజ్‌ దర్శకత్వంలో డ్రీమ్‌ వారియర్‌ పిక్చర్స్‌ బ్యానర్‌ పై ఎస్‌ఆర్‌ ప్రకాష్‌, ఎస్‌ఆర్‌ ప్రభు నిర్మించిన తమిళ చిత్రం 'రాక్షసి'. ఐదేళ్ల క్రితం తమిళనాట విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ చిత్రాన్ని తెలుగులో 'అమ్మ ఒడి' టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. వడ్డి రామానుజం, వల్లెం శేషారెడ్డి ఈ సినిమాను ఏపీ, తెలంగాణలో గ్రాండ్‌గా రిలీజ్‌ చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే టీచర్‌గా జ్యోతిగా కనిపిస్తున్నారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే వారికి ఆమె ఒక రాక్షసి అంటూ జ్యోతిక పాత్రను పరిచయం చేయడం సినిమాపై ఆసక్తిని పెంచుతుంది. నాగినీడు, హరీష్‌ పేరడీ, పూర్ణిమ, భాగ్యరాజ్‌ ముఖ్యపాత్రలు పోషించారు. ఈ సందర్భంగా వడ్డి రామానుజమ్‌, వల్లెం శేషారెడ్డి మాట్లాడుతూ, 'తెలుగు ట్రైలర్‌కు మంచి స్పందన వస్తుంది. తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్‌ సాధిస్తుందని నమ్మకం ఉంది. విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను చూపించేలా ఈ చిత్రాన్ని దర్శకుడు గౌతమ్‌ రాజ్‌ అద్భుతంగా రూపొందించారు. డబ్బింగ్‌, సెన్సార్‌ పూర్తి చేసి త్వరలోనే రిలీజ్‌ డేట్‌ను ప్రకటిస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి మాటలు, పాటలు : భారతి బాబు పి, దర్శకులు : ఎస్‌ వై గౌతమ్‌ రాజ్‌.

మరోసారి చిరు సరసన..



చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' టైటిల్‌ టీజర్‌తో తన అభిమానులను, ప్రేక్షకులని అలరించారు. టైటిల్‌ టీజర్‌ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సినిమా కోసం మేకర్స్‌ 13 పెద్ద పెద్ద సెట్‌లను నిర్మించి, న్యూ వరల్డ్‌ని క్రియేట్‌ చేశారు. నవంబర్‌ చివరి వారంలో ఈ సినిమా షూటింగ్‌ ప్రారంభ మైంది. లేటెస్ట్‌గా శుక్రవారం చిరంజీవి 'విశ్వంభర' ప్రపంచంలోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రొడక్షన్‌ వర్క్స్‌ జరుగుతున్నాయి.

టీమ్‌ విడుదల చేసిన క్రియేటివ్‌లో చిరంజీవి విశ్వంభర ప్రపంచంలోకి అడుగు పెడుతున్నట్లు చూపిస్తుంది. ఇది చాలా క్రియేటివ్‌, మెస్మరైజింగ్‌గా ఉంది. ఈ చిత్రంలో మెగాస్టార్‌ సరసన కథానాయికగా నటించడానికి త్రిషని మేకర్స్‌ ఎంపిక చేశారు. సోమవారం షూటింగ్‌లో ఆమె జాయిన్‌ అయ్యారు. ఆమెకు చిరంజీవి, దర్శకుడు వశిష్ఠ, నిర్మాతల నుంచి ఘన స్వాగతం లభించింది. మెగా మాస్‌ బియాండ్‌ యూనివర్స్‌కి ఆమె తన చార్మ్‌, గ్రేస్‌ను జోడించడానికి సిద్ధంగా ఉన్నారు. త్రిష గతంలో చిరంజీవి కల్సి 'స్టాలిన్‌'లో పనిచేశారు. ఈ కాంబినేషన్‌లో మ్యాజికల్‌ కెమిస్ట్రీని మనం ఆశించవచ్చు. 'బింబిసార' ఫేమ్‌ వశిష్ఠ ఈ ఫాంటసీ అడ్వెంచర్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్‌ పతాకంపై విక్రమ్‌, వంశీ, ప్రమోద్‌ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా చిరంజీవి కెరీర్‌లోనే బిగ్గెస్ట్‌ బడ్జెట్‌ సినిమా. ఈ సినిమా సాంకేతికంగా చాలా గ్రాండీయర్‌, విజువల్‌ వండర్‌గా ఉండబోతుంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమాను విడుదల చేస్తామని మేకర్స్‌ అనౌన్స్‌ చేశారు.

ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, డీవోపీ : ఛోటా కె నాయుడు, ప్రొడక్షన్‌ డిజైనర్‌: ఏఎస్‌ ప్రకాష్‌, కాస్ట్యూమ్‌ డిజైనర్‌: సుస్మిత కొణిదెల, ఎడిటర్‌: కోటగిరి వెంకటేశ్వరరావు, సంతోష్‌ కామిరెడ్డి, సాహిత్యం: శ్రీ శివ శక్తి దత్తా, చంద్రబోస్‌, స్క్రిప్ట్‌ అసోసియేట్స్‌: శ్రీనివాస్‌ గవిరెడ్డి, గంటా శ్రీధర్‌, నిమ్మగడ్డ శ్రీకాంత్‌, మయూఖ్‌ ఆదిత్య, ఎగ్జిక్యూటివ్‌ ప్రొడ్యూసర్‌: కార్తీక్‌ శబరీష్‌, లైన్‌ ప్రొడ్యూసర్‌: రామిరెడ్డి శ్రీధర్‌ రెడ్డి.

మా నమ్మకాన్ని ప్రేక్షకులు నిలబెట్టారు



శివాని నాగరం, సుహాస్‌

సుహాస్‌, శివాని నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్‌, దర్శకుడు వెంకటేష్‌ మహా బ్యానర్‌ మహాయన మోషన్‌ పిక్చర్స్‌, ధీరజ్‌ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్‌ బ్యానర్స్‌ సంయుక్తంగా నిర్మించారు. దుశ్యంత్‌ కటికినేని దర్శకుడు. ఓవర్సీస్‌ సహా విడుదలైన అన్ని చోట్లా బ్లాక్‌ బస్టర్‌ దిశగా వెళ్తున్న నేపథ్యంలో ఈ చిత్ర సక్సెస్‌ మీట్‌ను ఘనంగా నిర్వహించారు.

హీరోయిన్‌ శివాని మాట్లాడుతూ, "ఈ సినిమాతో హిట్‌ అందుకున్న మా ప్రొడ్యూసర్‌ ధీరజ్‌కి కంగ్రాట్స్‌. అమ్మా నాన్న తర్వాత నేను రుణపడి ఉండేది మా డైరెక్టర్‌ దుశ్యంత్‌కే. ఆయన నన్ను హిట్‌ సినిమాతో హీరోయిన్‌గా ఇంట్రడ్యూస్‌ చేశారు. సుహాస్‌ కారణంగా ఇలాంటి మంచి సినిమా వచ్చింది. మా సినిమాకు సపోర్ట్‌ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్‌' అని అన్నారు. 'ఇలాంటి కథలు రాయడంతోనే సరిపోదు ప్రొడ్యూస్‌ చేసే ధైర్యం గల వాళ్లు కావాలి. గీతా ఆర్ట్స్‌, ధీరజ్‌, బన్నీ వాస్‌ ఆ ధైర్యం చేశారు. ప్రొడ్యూసర్స్‌తో పాటు కథను నమ్మిన హీరో సుహాస్‌కు థ్యాంక్స్‌. సినిమా చూసిన వాళ్లంతా ప్రతి సీన్‌ గురించి మాట్లాడుతున్నారు. ఇది అహంకారానికి, ఆత్మాభిమానికి మధ్య జరిగే కథ. ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు అని ఈ మూవీలో చెప్పాం. సిస్టర్స్‌ ఉన్న ఆడియెన్స్‌ అయితే ఎమోషనల్‌ అవుతున్నారు' అని డైరెక్టర్‌ దుశ్యంత్‌ చెప్పారు.

ప్రొడ్యూసర్‌ ధీరజ్‌ మొగిలినేని మాట్లాడుతూ, 'నా దృష్టిలో ఇదొక జెన్యూన్‌ మూవీ. ఈ కథ విన్నప్పుడు నాకు అదే ఫీలింగ్‌ కలిగింది' అని తెలిపారు. 'నాకు హ్యాట్రిక్‌ ఇచ్చిన ఆడియెన్స్‌కు థ్యాంక్స్‌. నన్ను నమ్మి థియేటర్స్‌కు వస్తున్నందుకు సంతోషంగా ఉంది. మూడు రోజుల్లో మంచి కలెక్షన్స్‌ వచ్చాయి. ఇంకా పెద్ద హిట్‌ చేయాలని కోరుకుంటున్నా. రేపటి నుంచి టూర్‌కి వస్తున్నాం. మీ అందరినీ కలుస్తాం' అని హీరో సుహాస్‌ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,220	▼	160
22 క్యారెట్లు	57,950	▼	150
కిలో వెండి	76,700	▼	300



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	111
రిటైల్ (లైవ్)	రూ.	133
స్కిన్‌తో	రూ.	193
స్కిన్‌లెస్	రూ.	219

చొప్పదండి ఎమ్మెల్యే 'మేడిపల్లి' ఔదార్యం

- ప్రభుత్వ పదోతరగతి పిల్లల అల్పాహారానికి రూ.1.50లక్షల సాయం
- తొలి జీతం నుంచే కలెక్టర్‌కు చెక్కు అందజేత



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి పిల్లల ఆకలి తీర్చేందుకు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పేద పిల్లలకు సాయంత్రం అల్పాహారం అందించేందుకు ఎమ్మెల్యే తన తొలి జీతం నుంచి రూ.లక్షా 50వేల చెక్కును జిల్లా కలెక్టర్ పమేలాసత్పతికి మంగళవారం అందించారు. 'నాకు పేద విద్యార్థుల కష్టాలు, వారి ఆకలిగోసలు తెలుసు. బాల్యంలో నేనూ ఆకలితో చదువుకున్న రోజులు ఉన్నాయి. అందుకే ఎమ్మెల్యేగా నా వంతు సాయం చేయాలనుకున్నాను' అని సత్యం చెప్పారు. విద్యార్థుల చదువుకు తోడ్పాటును అందించడమేకాకుండా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఎమ్మెల్యే చూపిన చొరవ స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అభిప్రాయపడ్డారు.

బీజేపీయేతర రాష్ట్రాలపై వివక్ష

- పన్నుల్లో వాటా పంపిణీపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత విమర్శ
- ఇందులో వాస్తవం లేదు : నిర్మలా సీతారామన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పన్నుల వాటా, రాష్ట్రాల మధ్య పంపిణీపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత అధీర్ రంజన్ చౌదరి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. బీజేపీయేతర ప్రభుత్వాల పట్ల.. మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు బకాయిలు, కేటాయింపుల విషయంలో 'వివక్ష' చూపుతున్నారంటూ లోక్‌సభలో సోమవారం చర్చ సందర్భంగా అధీర్ రంజన్ చౌదరి విమర్శించారు. అధీర్ మాటల్లో వాస్తవంలేదని నిర్మలా సీతారామన్ ఖండించారు. ఆయన మాటలు రాజకీయ కోణంలో ఉన్నాయని తప్పుపట్టారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కోరకంగా నిబంధనలు మార్చే హక్కు తనకు లేదని నిర్మలా సీతారామన్ వివరణ ఇచ్చారు. అధీర్ రంజన్ జోక్యం చేసుకుంటూ.. బీజేపీయేతర పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనికి కర్నాటకే ఉదాహరణ అని చెప్పారు. అక్కడ బీజేపీ అధికారంలో ఉన్నంతవరకు ఎప్పటికప్పుడు జీఎస్టీ చెల్లింపులు చేసేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటినుంచి ఆ ప్రస్తావనే లేదని విమర్శించారు. 2024 మధ్యంతర బడ్జెట్‌లోనూ కేంద్రం వివక్ష చూపిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా అధీర్ ప్రస్తావించారు. నిధులు విడుదల చేయకపోవడంతో 15వ ఆర్థికసంఘం కింద ఆ రాష్ట్రానికి రూ.11 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు సభకు వివరించారు. దీనిపై నిర్మలా సీతారామన్ స్పందిస్తూ, ఎస్‌జీఎస్టీ 100 శాతం రాష్ట్రాలకు వెళు తుందని, ఇది ఆటోమ్యాటిక్ నిబంధన అని చెప్పారు. ఐజీఎస్టీ అనేది అంతర్‌రాష్ట్ర పేమెంట్లనీ, వీటిపై పీరియాడికల్‌గా సమీక్ష ఉంటుందని చెప్పారు. సీజీఎస్టీ అనేది ఫైనాన్స్ కమిషన్ డివైడ్ చేస్తుందన్నారు. తనంతతాను ఇష్టానుసారంగా ఎలాంటి మార్పులు చేర్పులు చేయడానికి కుదరదన్నారు. ఇందులో తన పాత్ర ఎంతమాత్రం లేదన్నారు. 'ఫైనాన్స్ కమిషన్ చెప్పకుండా నేను చేయడానికి ఏమీ లేదు. దయజేసి నేను ఏదో వివక్ష చూపుతున్నానని ఊహించుకోవద్దు. ఫైనాన్స్ కమిషన్‌తో మాట్లాడండి" అంటూ నిర్మలా సీతారామన్ తన చర్చను ముగించారు.

బాలకృష్ణ కేసులో రియల్ ఎస్టేటర్లపై ఏసీబీ దృష్టి

- ఆరో రోజు కొనసాగిన విచారణ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ కోట్ల రూపాయల అక్రమాస్తుల కేసులో రియల్ ఎస్టేటర్ల పాత్రపై ఏసీబీ అధికారులు దృష్టిని సారించారు. సోమవారం ఆరో రోజు బాలకృష్ణను ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ఏసీబీ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ దర్యాప్తులో హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో అనేక మంది రియల్ ఎస్టేటర్లకు బాలకృష్ణ నిబంధనలను ఉల్లంఘించి సాయం చేశాడనీ, అందుకు ప్రతిఫలంగా రియల్ ఎస్టేటర్ల నుంచి లక్షల రూపాయల ముడుపులను, అత్యంత ఖరీదైన ప్లాట్లను బాలకృష్ణ పొందినట్టు ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో బాలకృష్ణ మిలాఖత్ అయిన రియల్ ఎస్టేటర్లు ఎవరనేది తేల్చే పనిలో అధికారులు పడ్డారు. వారెవరనేది తేలాక వరుసబెట్టి విచారించటానికి రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. మొత్తమ్మీద, ఏసీబీ అధికారులు వేస్తున్న ప్రశ్నలకు బాలకృష్ణ ఆచితూచి సమాధానాలిస్తున్నట్టు సమాచారం.

వైఎస్ అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా పడింది. ఏప్రిల్ మూడో వారంలో కేసు తుది వాదనలు వింటామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతోఒతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఏప్రిల్ 22 నుంచి ప్రారంభమయ్యే వారంలో నాన్ మిస్లేనియస్ డే రోజు జాబితా చేయాలని రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశించింది. కేసు డైరీ మొత్తాన్ని కోర్టు ముందుంచాలని ధర్మాసనం ఆదేశించింది. కేసు డైరీ 60 భాగాలుగా ఉందని ధర్మాసనానికి సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు. డిజిటల్ రూపంలోకి మార్చి ఈ- కేసు డైరీ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఏప్రిల్ 22కు ముందు కేసు విచారణకు తీసుకునే పరిస్థితి లేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- కొత్త ప్రయోగాలకు నాంది పలికాలి
- మూఢనమ్మకాలను దూరం పెట్టాలి
- 14న నేషనల్ సైన్స్ డే సందర్భంగా సన్నాహక కార్యక్రమాలు : తెలంగాణ బాలోత్సవ్ సైన్స్ జాతాలో విజ్ఞాన దర్శిని కార్యదర్శి రమేష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయాలని విజ్ఞాన దర్శిని కార్యదర్శి టి. రమేష్ అన్నారు. ఈ నెల 14న నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని తెలంగాణ బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో సైన్స్ జాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కొత్త కొత్త ప్రయోగాలకు నాంది పలకాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో మూఢనమ్మకాలు విచ్చలవిడిగా ప్రేరేపించబడుతున్నాయనీ, వాటి పట్ల విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో మెలగాలన్నారు. పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 30 సైన్స్ కొత్త ఆవిష్కరణలు ప్రదర్శించారు. అంబర్ పేట్ భారతీయ విద్యా భవన్ ఉన్నత పాఠశాల, జిందా తిలిస్మాత్ ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ బాలోత్సవ్ కమిటీ నిర్వాహకులకు పాఠశాల విద్యార్థులు వివిధ సైన్స్ గెటప్స్ తో స్వాగతం పలికిన విధానం అందరినీ ఆకర్షించింది . నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు పిల్లలు కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యూటన్ మొదటి చలన నియమం, అగ్రికల్చర్ ఫార్మింగ్ , ఐ , స్ట్రక్చర్ అఫ్ స్కిన్ ,అడ్రినల్ గ్లాండ్, పార్ట్స్ ఆఫ్ ది బాడీ , హైడ్రాలిక్ బ్రిడ్జ్ , రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, డ్రిప్ ఇరిగేషన్ , ఎయిర్ పొల్యూషన్ , డెన్సిటీ ఆఫ్ లిక్విడ్స్, వాటర్ పొల్యూషన్, వాషింగ్ మెషిన్, పిచ్ ఆఫ్ సౌండ్ , ప్రాసెస్ ఆఫ్ డివిజన్ హాట్ కోల్డ్ , హ్యూమన్ హార్ట్, ఎలక్ట్రిక్ స్విచ్ , హ్యూమన్ బ్రెయిన్, యాసిడ్స్ అండ్ గ్యాసెస్, 4 స్టేజ్ వాటర్ ప్యూరిఫై రింగ్ , వండర్స్ ఇన్ ది క్యాలెండర్ , స్ప్రింక్లర్ ఇరిగేషన్, న్యాచరల్ రెయిన్‌బోతో పాటు ఇస్రో విజయవంతంగా చేపట్టిన చంద్రయాన్ 3 ప్రయోగం ఏ విధంగా రూపుదిద్దుకున్నదన్న విషయాన్ని కళ్లకు కట్టినట్టుగా విద్యార్థుల ప్రయోగాత్మక ప్రదర్శనలు అందరినీ ఆకర్షించింది. విద్యార్థినీ, విద్యార్థులు 180 సైన్స్ నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు.

ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారి ప్రదర్శనలను ఫిబ్రవరి 24న జరగబోయే సైన్స్ జాతలో అవకాశం కల్పిస్తారు. బాలోత్సవ్ కమిటీ నిర్వహులు మాట్లాడుతూ, తాము చదువుకొనే రోజుల్లో ఇన్ని అవకాశాలు లేవన్నారు. ఇప్పుడు విద్యార్థులతో కలిసి ప్రయోగాలు చేయాలనిపిస్తుందని చెప్పారు. ఇలాంటి అవకాశాలు కల్పిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లు, సహకరించిన వారందిరికి ధన్యవాదాలు తెలిపారు. పిల్లలు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలును త్వరలో బాలోత్సవ్ యూట్యూబ్ ఛానెల్‌లో వస్తాయని, వాటిని విద్యార్థులందరూ తప్పకుండా చూసి, మిగిలిన వారికీ షేర్ చేయాలని కోరారు. తెలంగాణ బాలోత్సవ్ కమిటీ ఫిబ్రవరి 24 న నిర్వహించే సైన్స్ జాతలో ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు ఇవ్వనున్నట్టు ఆ కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్. సోమయ్య తెలిపారు.

లిక్కర్ స్కాంలో...కవిత పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాంలో దర్యాప్తు సంస్థలు తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్ పై విచారణను సుప్రీంకోర్టు ఈనెల 16కు వాయిదా వేసింది. లిక్కర్ స్కాంలో గతేడాది పలుమార్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరైన కవిత... తర్వాత ఈడీ నోటీసులను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతేడాది మార్చి 14న 105 పేజీల రిట్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. దర్యాప్తు సంస్థలు మహిళలను తమ కార్యాలయానికి పిలవవచ్చా? అనే అంశాన్ని అందులో ప్రశ్నించారు. తనపై ఎలాంటి బలవంతపు (అరెస్ట్ లాంటివి) చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కవిత ప్రస్తావించిన విషయం తెలిసిందే.గతంలో ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళిని చిదంబరం, వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీల పిటిషన్లతో ట్యాగ్ చేసింది. ఈ పిటిషన్లను సోమవారం జస్టిస్ బెల ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ ధర్మాసనం విచారించింది.ఈ సందర్భంగా కవిత తరపు సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు.గతేడాది మార్చి నుంచి ఈ పిటిషన్ వాయిదా పడుతూ వస్తుందన్నారు.అందువల్ల ఈ పిటిషన్ పై విచారణ చేపట్టాలని కోరారు. అయితే ఈ పిటిషన్ నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీల పిటిషన్లతో ట్యాగై ఉండడంతో ఈ కేసుల స్టేటస్‌ను ధర్మాసనం ఆరా తీసింది. అనంతరం అన్ని కేసుల్ని ఒకే సారి కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈడీ తరపు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) ఎస్ వి రాజు జోక్యం చేసుకుని... ఈడీ నోటీసులిచ్చినా కవిత హాజరుకావడం లేదని బెంచ్‌కు నివే దించారు.ఈ వాదనలపై జోక్యం చేసుకున్న కపిల్ సిబల్... ఈ వాదనలు విరుద్ధమని తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు.ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం ఈనెల 16న అన్ని పిటిషన్లు కలిపి విచారిస్తామని వెల్లడించింది.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

- రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య
- బీసీల సమస్యల పరిష్కారం కోసం జంతర్ మంతర్ వద్ద ధర్నా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేవలం రూ. 2,150 కోట్లు మాత్రమే కేటాయించి వెనకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య విమర్శించారు. సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో బీసీ నేతలు గుజ్జ కృష్ణ, గవ్వల భరత్, ఆళ్ల రామకృష్ణ, తెలుగు రాష్ట్రాలకు చెందిన బీసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రం బీసీల సంక్షేమానికి కేటాయించిన నిధులతో దేశంలోని రూ. 75 కోట్ల మంది బీసీలకు కనీసం బిస్కెట్లు కూడా రావన్నారు. బీసీల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి ఎలాంటి కేటాయింపులు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి వీడాలని హెచ్చరించారు. బడ్జెట్‌లో బీసీల కేటాయింపుల కోసం రూ. 2 లక్షల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. అలాగే బీసీలకు విధించిన క్రిమిలేయర్ విధానం ఎత్తివేయాలన్నారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లు ఇవ్వాలని కోరారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని పార్టీలు 50 శాతం సీట్లు బీసీలకు కేటాయించాలన్నారు. అలా సీట్ల కేటాయింపులు చేసిన వారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. జన గణనలో కుల గణన, బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్ల ఆధారంగా ప్రమోషన్లు, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించాలని డిమాండ్ చేశారు.

యూపీ మహిళా జడ్జి మరణంపై ఎఫ్ఐఆర్ నమోదు

- హత్య చేసి ఉరేశారు : ఫిర్యాదులో మృతురాలి తండ్రి ఆరోపణలు



లక్నో : యూపీలో మహిళా జడ్జి మరణం పలు అనుమానాలకు తావిస్తున్నది. బదౌన్ జిల్లాకు నియమింపడిన మహిళా న్యాయమూర్తి తన అధికారిక నివాసంలో మరణించిన తర్వాతి రోజు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. వివరాళ్లోకెళ్తే.. మవు జిల్లాకు చెందిన జ్యోత్స్న రాయ్ (29) బదౌన్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా ఉన్నారు. ఆమె తన అధికారిక నివాసంలో ఉరేసుకొని మరణించారు. ఆమె విధులకు రాకపోవటం, అందుబాటులో లేకపోవటంతో ఆమె తోటి ఉద్యోగులు పోలీసులకు తెలిపారు. దీంతో శనివారం ఉదయం ఆమె తన ఇంటిలో విగత జీవిగా కనిపించారు. జ్యోత్స్న ఇంట్లో సూసైడ్ నోట్ సైతం లభించింది.

అయితే, జ్యోత్స్న మరణంపై ఆమె తండ్రి అశోక్ కుమార్ రాయ్ అనుమానాలు లేవనెత్తారు. ఈ మేరకు కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమెను తొలుత హత్య చేసిన తర్వాతే ఉరేసినట్టు తన ఫిర్యాదులో అశోక్ పేర్కొన్నారు. దీని ఆధారంగానే కొత్వాలి పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. "ఆయన (అశోక్ కుమార్) తన ఫిర్యాదులో, జ్యోత్స్న ఉండే అపార్ట్‌మెంట్‌లో ఎవరో ఆమెను చంపారని పేర్కొన్నారు. మేము సాక్ష్యాలు, పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా ముందుకెళ్తాం" అని బదౌన్‌కు చెందిన పోలీసు అధికారి అలోక్ మిశ్రా తెలిపారు. సూసైడ్ నోట్‌లో ఆమె ఎవరి పేరునూ పేర్కొనలేదనీ, ఎవరి పైనా ఆరోపణలు చేయలేదని పోలీసులు అన్నారు. తాము జడ్జి బంధువులతో మాట్లాడుతున్నామనీ, మా నిర్ధారణలు, పోస్ట్ మార్టం నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జడ్జి సోదరుడు హిమాన్షు శేఖర్ రాయ్ పోలీసుల దర్యాప్తు తీరుపై అనుమానాలు లేవనెత్తాడు. పోలీసులు తలుపుల నుంచి వేలి ముద్రలు సేకరించలేదని ఆయన ఆరోపించారు.

రాష్ట్రంలో జర్నలిస్టులు, జడ్జిలు, ప్రభుత్వ అధికారులు.. ఇలా ఎవరికీ భద్రత లేదనీ, వారిపై దాడులు నిత్యకృత్యమవుతున్నాయని సామాజికవేత్తలు ఆరోపించారు. ఇక మహిళల భద్రత గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని అన్నారు. యూపీలోని యోగి సర్కారుకు అయోధ్యలో రామ మందిరంపై ఉన్న శ్రద్ధ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణపై లేదని వారు వాపోయారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు సహించం :ఎమ్‌డీ సజ్జనార్

- మరో ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే సహించేది లేదని టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. పదే పదే ఈ విషయంపై హెచ్చరిస్తున్నా, కొందరు వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా సిబ్బందిపై దాడులకు పాల్పడుతుండటం దురదృష్టకరమనీ, ఇది సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఇద్దరు వ్యక్తులు ఫరూక్‌నగర్ డిపోనకు చెందిన డ్రైవర్, కండక్టర్‌పై విచక్షణారహితంగా క్రికెట్ బ్యాట్‌తో దాడిచేసి తీవ్రంగా కొట్టారని తెలిపారు. ఈ ఘటనలో కండక్టర్ రమేష్ ఎడమ చేయి విరగ్గా, డ్రైవర్ షేక్ అబ్దుల్‌కి తీవ్ర గాయాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్టీసీ అధికారులు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు మహ్మద్ మాజీద్, మహ్మద్ ఖాసీంలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. ఇటీవలే బస్సులో కండక్టర్‌పై దుర్భాషలాడుతూ కాలితో తన్ని దాడికి పాల్పడిన అంబర్‌పేటకు చెందిన యువతిపై కూడా కేసు నమోదు చేసి, జైలుకు పంపిన విషయం తెలిసిందే. అతి తక్కువ సమయంలో నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులకు ఎమ్‌డీ సజ్జనార్ ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

గడ్డం కృష్ణమూర్తికి తెలుగు భాషారత్న అవార్డు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కృష్ణమూర్తికి అరుదైన పురస్కారం లభించింది. తెలుగు పత్రికారంగంలో నాలుగు దశాబ్దాలుగా ఆయన అందించిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం 'తెలుగు భాషా రత్న జీవన సాఫల్య పురస్కారం' అవార్డును అంద చేసింది. సోమవారం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రాజశేఖర్, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ఎస్వీ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ కొలకలూరి ఇనాక్, ఆంధ్రప్రదేశ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రభుత్వ సలహా సంఘం మాజీ అధ్యక్షులు కొమ్మినేని శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జర్నలిజం వృత్తిలో ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని అవార్డు గ్రహీత కృష్ణమూర్తి అన్నారు.

సరుకు రవాణాలో రైల్వే రికార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈ ఏడాది జనవరి మాసంలో సరుకు రవాణా విభాగంలో దక్షిణ మధ్య రైల్వే అత్యుత్తమ పనితీరును నమోదు చేసి రికార్డు సృష్టించిందని ఆ సంస్థ సోమవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఆ నెలలో 13.122 మిలియన్ టన్నుల సరుకు రవాణాను సాధించి, రూ.1,296.73 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసిందని తెలిపారు. జోన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అత్యధిక నెలవారీ ఆదాయమని పేర్కొన్నారు. ప్రధాన లోడింగ్ వస్తువులైన బొగ్గు 6.497 మిలియన్ టన్నులు, సిమెంట్ 3.278 మి.ట., 0.851 మి.ట., ఆహార ధాన్యాలు, 0.851 మి.ట., ఎరువులు, 0.423 మి.ట., ఇనుప ఖనిజం, 0.375 మి.ట.,ఉక్కు కర్మాగారాల కోసం ముడి పదార్థాలు, 0.200 మి.ట.,కంటైనర్లు, 0.647 మి.టన్నుల ఇతర వస్తువులు రవాణా చేసినట్టు వివరించారు. సరుకు రవాణాను బలోపేతం చేసేందుకు వ్యాగన్ల సరఫరాను క్రమబద్ధీకరిస్తూ, సరుకు రవాణా రైళ్ల కదలికలను తరచూ పర్యవేక్షించడం వల్ల ఈ రికార్డు సాధ్యమైందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆపరేషన్స్, కమర్షియల్ బృందాలను ఆయన అభినందించారు.

ఫ్రీ కరెంటుకు ఈ వివరాలివ్వండి!

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లలోపు వినియోగదారులు విద్యుత్ శాఖతో తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలనే ప్రకటన ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించగా, అది వాస్తవమేననీ, అయితే అధికారికంగా ఇంకా ప్రకటన ఇవ్వలేదని స్పందించారు. గృహజ్యోతి పథకం అమలుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండ్లకు వచ్చి కరెంటు రీడింగ్ తీసే మీటర్ రీడర్లకు వినియోగదారులు తమ ఫోన్ నెంబర్, రేషన్‌కార్డు నెంబర్ (ఫుడ్ సెక్యూరిటీ కార్డు), ఆధార్ నెంబరు అందచేయాలనేది ఆ ప్రకటన సారాంశంగా ఉంది. ఈ వివరాలు ఇచ్చి ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ పేరుతో సోషల్ మీడియాలో ఓ ప్రకటన సర్క్యులేట్ అవుతున్నది.

ఆ మందును రిటైల్ మెడికల్ షాపుల్లో అమ్మొద్దు :డీసీఏ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

హైడ్రోజన్ పెరాక్సైడ్ సొల్యూషన్ (ల్యాబోరేటరీ రీజెంట్)ను రిటైల్ మెడికల్ షాపుల్లో అమ్మడానికి వీల్లేదని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) హెచ్చరించింది. ఈ మేరకు సోమవారం డీసీఏ డైరెక్టర్ జనరల్ వి.బి.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. దాన్ని యాంటిసెప్టిక్‌గా ఆయా థెరపిటిక్‌ల కోసం ఉద్దేశించిందని తెలిపారు. మెడికల్ షాపులు కేవలం హైడ్రోజన్ పెరాక్సైడ్ సొల్యూషన్ ఐపీని మాత్రమే అమ్మాలనీ, దాన్ని కూడా నిర్దేశించిన ధరకే అమ్మాలని సూచించారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దూరవిద్య పది, ఇంటర్ ఫీజు గడువు 21

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లింపు ప్రక్రియ ఈనెల 12 నుంచి ప్రారంభం కానుంది. ఫీజు చెల్లింపునకు తుది గడువు ఈనెల 21వ తేదీ వరకు ఉందని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుం రూ.25తో ఈనెల 22 నుంచి 27 వరకు చెల్లించేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఆలస్య రుసుం రూ.50తో ఈనెల 28 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు చెల్లించొచ్చని సూచించారు. ఏప్రిల్ లేదా మేలో దూరవిద్య పది, ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు

యూపీఎఫ్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా గట్టు రామచందర్ రావు

పూలే విగ్రహం ఏర్పాటు డిమాండ్ ను ప్రభుత్వం గౌరవించాలి : మధుసూదనాచారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ హక్కుల సాధన కోసం ఉద్యమించడానికి ఏర్పడిన యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్‌గా గట్టు రామచందర్ రావు నియమితులయ్యారు. సోమవారం ఫ్రంట్ అడ్ హక్ కమిటీని ఎన్నుకుంది. ఫ్రంట్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య, మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, కాసాని జ్ఞానేశ్వర్ సలహాదారులుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుసూదనా చారి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. అసమానతలు, దుర్మార్గాలు ఉన్న సమాజాన్ని మార్చాలనీ, ఆయా జాతులు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్న ఆలోచనతో సంస్కరణలకు పూనుకున్నారని వివరించారు. జ్ఞానమే సకల సమస్యలకు పరిష్కారమని గ్రహించిన పూలే ఆ దిశగా పని చేశారని చెప్పారు. విద్య కోసం తన భార్య సావిత్రి బాయి పూలేతో కలిసి కృషి చేశారన్నారు. పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం గౌరవించి ఆచరించాలని సూచించారు.

చట్టసభల్లో ఉన్నవారికి నిత్యం ఆరాధ్యుడైన పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సమాజం నుంచి మంచి డిమాండ్ వస్తే పాలకులు స్వీకరించాలనీ, కానీ, ఈనాడు ఆ పరిస్థితి లేదు కాబట్టి పోరాట బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

గట్టు రామచందర్ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బీసీల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయనీ, బలహీనవర్గాలను రాజకీయంగా అణచేస్తున్నారని విమర్శించారు.. సీఎం సొంత సామాజిక తరగతికి తప్ప ఎవరికీ పరిపాలన సాధ్యం కాదని ప్రకటించడం దారుణమన్నారు. సన్న, చిన్నకారు రైతులకు రైతుబంధు ఇవ్వడం లేదని విమర్శించారు. బీసీలు ఐక్య పోరాటాలకు సిద్ధం కాకపోతే సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా తమకు తాము అణగదొక్కుకున్నట్లవుతుందని స్పష్టం చేశారు. బీసీ హక్కుల సాధన ఉద్యమంలో భాగంగా మొదటగా అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. దానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలని, తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఫ్రంట్ కో-కన్వీనర్‌గా తాడూరి శ్రీనివాస్, కాసాని వీరేశ్ ముదిరాజ్, ఆర్జేసీ కృష్ణ, రాజారాం యాదవ్, బొల్ల శివశంకర్, కోల శ్రీనివాస్, ముప్పు భిక్షపతి, రాచమల్ల బాలకృష్ణ, రాగిపెల్లి రవీంద్ర చారి, ఆర్వీ మహేందర్ రావు, ప్రచార కార్యదర్శిగా ఆలకుంట హరి, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా ఎల్చాల దత్తాత్రేయ, కో కన్వీనర్ గా అశోక్ యాదవ్, బొడ్డుపల్లి లింగం, మహిళా కన్వీనర్లుగా గీతా గౌడ్, బాల మణెమ్మ, బొమ్మ ప్రవళిక నియమితులయ్యారు.

ఫ్రంట్ కో-కన్వీనర్‌గా తాడూరి శ్రీనివాస్, కాసాని వీరేశ్ ముదిరాజ్, ఆర్జేసీ కృష్ణ, రాజారాం యాదవ్, బొల్ల శివశంకర్, కోల శ్రీనివాస్, ముప్పు భిక్షపతి, రాచమల్ల బాలకృష్ణ, రాగిపెల్లి రవీంద్ర చారి, ఆర్వీ మహేందర్ రావు, ప్రచార కార్యదర్శిగా ఆలకుంట హరి, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా ఎల్చాల దత్తాత్రేయ, కో కన్వీనర్‌గా అశోక్ యాదవ్, బొడ్డుపల్లి లింగం, మహిళా కన్వీనర్ లుగా గీతా గౌడ్, బాలమణెమ్మ, బొమ్మ ప్రవళిక నియమితులయ్యారు.